PRGI Reg No -“APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి... చదివించండి...

ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 217, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, ఆదివారం - 27 - సెప్టెంబర్ - 2026 , వెల రూ.5/-



2లో

**ఖైరతాబాద్ లో పోటీ చేస్తా..**

**నా ఫాంహౌస్ కబ్జా భూమి కాదు**

- ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తమ అభ్యర్థిని దింపుతామన్న కవిత
- రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలు గాడితప్పుతున్నాయని విమర్శ
- తన ఆస్తులకు సంబంధించిన ప్రతి వివరం అఫిడవిట్లో క్లియర్ గా ఉందని వెల్లడి

# పిక్సెల్స్ నుంచి పైపుల వైపు పాలన పయనం సాగింది

**దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న చివరి ఆయకట్టు రైతులకు నీరందించడమే లక్ష్యం**

- ★ పిక్సెల్స్ అయినా, పైపులైనా.. లక్ష్యం ఒక్కటే: ‘ది ప్రింట్’ కథనంపై సీఎం చంద్రబాబు స్పందన
- ★ ది ప్రింట్ వ్యవస్థాపకుడు శేఖర్ గుప్తా పోస్టుపై స్పందించిన చంద్రబాబు
- ★ అభివృద్ధి ఫలాలు సామాన్యుడికి చేరాలన్నదే తన నమ్మకమని వెల్లడి
- ★ సమస్యల పరిష్కారం, జీవనోపాధి కల్పనే ప్రధాన ఉద్దేశం



అమరావతి: ప్రముఖ ఆంగ్ల మీడియా సంస్థ ‘ది ప్రింట్’ వ్యవస్థాపకుడు శేఖర్ గుప్తా పెట్టిన ఓ సోషల్ మీడియా పోస్టుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. తన పాలనా విధానం, ప్రాధాన్యతలపై జరుగుతున్న విశ్లేషణపై ఆయన తన అభిప్రాయాలను స్పష్టంగా పంచుకున్నారు. ‘పిక్సెల్స్ నుంచి పైపుల వైపు’ సాగుతున్న తన ప్రయాణం వెనుక ఉన్న ఉద్దేశాన్ని వివరిస్తూ, అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ చేరాలన్నదే తన స్థిరమైన నమ్మకమని పునరుద్ఘాటించారు. ‘ది ప్రింట్’ మీడియాలో వచ్చిన ఒక కథనాన్ని శేఖర్ గుప్తా ప్రస్తావిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. చంద్రబాబు తన ‘సీఈఓ-సీఎం’ ఇమేజ్‌ను మార్చుకుని, గ్రామీణ ప్రాంతాల్లో టీడీపీకి ఆదరణ పెంచుకునేందుకు ‘పిక్సెల్స్’ (టెక్నాలజీ) నుంచి ‘పైపుల’ (సాగునీటి) వైపు ఎలా పయనిస్తున్నారనే విశ్లేషణ ఆ కథనంలో ఉంది. ఈ పోస్టుపై స్పందించిన చంద్రబాబు, తన రాజకీయ ప్రస్థానం వెనుక ఉన్న మూల సిద్ధాంతాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు స్పందిస్తూ, “నా ప్రజా జీవితం ఒకే ఒక్క నమ్మకం

వివరాలు 2లో..

**ఆనాడు సాధించిన ప్రగతి**

**నేడు దేశానికే రోల్ మోడల్‌గా నిలిచింది**

**తెలంగాణ తెగువకు, ధిక్కార స్వరానికి**

**ఐలమ్మ నిలువెత్తు రూపం: కేసీఆర్**



2లో

- ➤ చాకలి ఐలమ్మ 131వ జయంతి
- ➤ ఘన నివాళి అర్పించిన కేసీఆర్
- ➤ నాటి రాచరిక వ్యవస్థను ధైర్యంగా ఎదిరించిన వీరవనిత అని కేసీఆర్ కితాబు



2లో

## భజనలకు కొత్త స్టైల్.. ‘భజన్ క్లబ్బింగ్’ అంటే ఏంటి? మోదీ ఎందుకు పాల్గొన్నారు? భజనలకు ఆధునిక కచేరీ తరహా రూపమే ‘భజన్ క్లబ్బింగ్’

- లైవ్ మ్యూజిక్, బీట్లు, చప్పట్లతో కార్యక్రమం
- ప్రేక్షకులు కూడా భజనల్లో భాగస్వాములయ్యే ఛాన్స్
- యువతలో కొత్త ఆసక్తిని పెంచుతున్న ఈ విధానం
- ఆధ్యాత్మికత, ఆధునిక సంగీతాన్ని కలిపే ప్రయత్నం

ఢిల్లీ: సాధారణంగా భజన అంటే ఓ చోట చేరి భక్తి పాటలు పాడటం.. తాళాలు వేయడం.

## స్థానిక ఎన్నికలపై పవన్ ఫోకస్.. సమన్వయ కమిటీకి కీలక

**సమన్వయ కేంద్ర కమిటీ సభ్యులతో భేటీ అయిన పవన్**





- ★ స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సమీక్ష
- ★ క్షేత్రస్థాయి నివేదికలతో సిద్ధంగా ఉండాలని కమిటీకి సూచన
- ★ కార్యాచరణ ఖరారుపై సోమవారం మరోసారి సమావేశం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం జనసేన పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నిన్న సాయంత్రం స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ శ్రేణులు అందించిన సమాచారాన్ని క్రోడీకరించి, నివేదించేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల కమిటీతో ఈ భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ విధివిధానాలు, మిగతా 2 లో

**స్థానిక ఎన్నికలపై పవన్ ఫోకస్..**

**సమన్వయ కమిటీకి కీలక ఆదేశాలు**

స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సమీక్ష



2లో

సమన్వయ కేంద్ర కమిటీ సభ్యులతో భేటీ అయిన పవన్

క్షేత్రస్థాయి నివేదికలతో సిద్ధంగా ఉండాలని కమిటీకి సూచన

కార్యాచరణ ఖరారుపై సోమవారం మరోసారి సమావేశం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం జనసేన పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ స్థానిక సంస్థల ఎన్నికల మిగతా 2 లో

**సీఎం విజయ్ నటనను**

## ఇంకా ఆపలేదు: స్టాలిన్

సీఎం విజయ్‌పై మాజీ సీఎం స్టాలిన్ తీవ్ర విమర్శలు

ప్రజల ముందు విజయ్ నటన ఇంకా కొనసాగుతోందని ఎద్దేవా

డీఎంకే పథకాలకే పేర్లు మార్చి అమలు చేస్తున్నారని ఆరోపణ

సీఎం పదవికి తగిన హుందాతనం చూపాలని హితవు



తమిళనాడు: తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్‌పై మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కే. స్టాలిన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సినిమాలకు స్వస్తి మిగతా 2 లో

## ఇంధన నిర్వహణ అద్భుతం.. అదానీ సెంటర్‌పై లోకేశ్ ట్వీట్

**పర్యటన వివరాలను ఎక్స్ ఖాతాలో పంచుకున్న లోకేశ్**

- ➤➤ అహ్మదాబాద్‌లో అదానీ గ్రూప్ ఎనర్జీ మానిటరింగ్ సెంటర్‌ను సందర్శించిన మంత్రి లోకేశ్
- ➤➤ రియల్ టైంలో విద్యుత్ ఉత్పత్తిని పర్యవేక్షిస్తున్న తీరు పరిశీలన



అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన అహ్మదాబాద్ పర్యటనలో భాగంగా అదానీ గ్రూప్‌కు చెందిన అత్యాధునిక మిగతా 2 లో



2లో

**జోరు పెంచిన ప్రశాంత్ కిశోర్..**

**ఢిల్లీలో నేడు అత్యంత కీలక సమావేశం**

- పూర్తి స్థాయి పొలిటీషియన్ గా మారిన ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్
- బంకిపూర్ ఉప ఎన్నికలో స్వయంగా విజయం సాధించి సత్తా చాటిన పీకే

## రేవంత్ ‘నిజాయతీ గల

**2028లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా**

- రైతుబంధుపై ప్రభుత్వాన్ని తప్పుబట్టిన కేటీఆర్
- హామీలు అమలు కాలేదని ఆరోపణ
- కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి
- సెప్టెంబర్ 28 నుంచి పట్టభద్రుల ఓటరు నమోదుకు పిలుపు



హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ ‘నిజాయతీ గల మోసగాడు’ అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలు పాలిచ్చే బర్రెను వదిలి తన్నే దున్నపోతును తెచ్చుకున్నారని అన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం మహబూబాబాద్ జిల్లా మిగతా 2 లో

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక
జనరల్ న్యూస్
ఆదివారం -27 - సెప్టెంబర్ - 2026

## హైదరాబాద్ జీపీఓ స్థాయిని తగ్గించొద్దు.. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానికి ఒవైసీ లేఖ

హైదరాబాద్: హైదరాబాద్ నగరానికి చారిత్రక వారసత్వంగా ఉన్న హైదరాబాద్ జనరల్ పోస్టాఫీస్ (జీపీఓ) హోదాను తగ్గించాలన్న ప్రతిపాదనను తాము వ్యతిరేకిస్తున్నట్టు ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. ఈ ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని కోరుతూ కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాలకు ఆయన శనివారం లేఖ రాశారు. హైదరాబాద్ జీపీఓను గ్రూప్ 'ఏ' నుంచి గ్రూప్ 'బీ'కి మార్చడంతో పాటు, హైదరాబాద్ సిటీ డివిజన్‌లో విలీనం చేయాలని ఇటీవల వచ్చిన ప్రతిపాదన సరికాదంటూ ఒవైసీ తన లేఖలో ప్రస్తావించారు. వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న ఈ సంస్థ హోదాను తగ్గించడం అన్యాయమని, ఏకపక్ష నిర్ణయమని ఆయన అభిప్రాయపడ్డారు. జీపీఓ ఉద్యోగుల నుంచి తనకు అందిన వినతిపత్రాన్ని కూడా ఈ లేఖకు జతపరిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జీపీఓ ప్రాముఖ్యతను ఒవైసీ వివరించారు. "హైదరాబాద్ జీపీఓ అత్యధిక పనిభారం కలిగిన ముఖ్యమైన సంస్థ. హైదరాబాద్ హెడ్ పోస్టాఫీస్ పరిధిలోని మొత్తం మెయిల్ కార్యకలాపాల్లో జీపీఓ వాటా గణనీయంగా ఉంది. దీని డెలివరీ పరిధి కూడా నిరంతరం విస్తరిస్తోంది. అంతేకాకుండా, తెలంగాణ రాష్ట్రంలో ఏకైక ఫిలాటెలిక్ బ్యూరో (తపాలా స్టాంపుల సేకరణ, పోస్టల్ చరిత్ర పరిశోధన) ఇక్కడే ఉంది" అని ఆయన పేర్కొన్నారు. తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఈ చారిత్రక సంస్థకు మహానగరంలో ఎంతో ప్రాధాన్యత ఉందని, లక్షలాది మందికి తపాలా సేవలు అందిస్తోందని ఒవైసీ గుర్తుచేశారు. ప్రజల ప్రయోజనాలను, సంస్థ వారసత్వ గుర్తింపును దృష్టిలో ఉంచుకుని, కేంద్ర మంత్రులు ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జీపీఓ హోదా తగ్గింపు, విలీనం ప్రతిపాదనలను రద్దు చేసి, చీఫ్ పోస్ట్‌మాస్టర్ ఆధ్వర్యంలో స్వతంత్ర గ్రూప్ 'ఏ' సంస్థగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## ప్రధానిపై రాహుల్ అనుచిత వ్యాఖ్యలు సరికాదు: కిషన్‌రెడ్డి

హైదరాబాద్: అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికైన ప్రధానమంత్రి, హోంమంత్రిని లోక్‌సభలో ప్రతిపక్ష నేత 'దేశద్రోహి' అంటూ అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. "కోట్ల మంది నమ్మకంతో ఓటేసి గెలిపించిన వారిపై రాహుల్ గాంధీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆయన అసహనాన్ని తెలియజేస్తోంది. ఒక పార్టీ జెండాతో గెలిచి వేరే పార్టీలోకి ఫిరాయించిన దానం నాగేందర్‌పై సుప్రీం కోర్టు అనర్హత వేటు వేయడాన్ని స్వాగతించి, క్షమాపణలు చెప్పాల్సింది పోయి అదేరోజు ప్రజాస్వామ్యం గురించి పాఠాలు చెప్పడం హాస్యాస్పదం. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వేరే పార్టీల టికెట్లపై ఎన్నికైన 10 మంది ఎమ్మెల్యేలను రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిల నాయకత్వంలో కాంగ్రెస్‌లోకి చేర్చుకున్నారు. ప్రజల నమ్మకాన్ని గెలుచుకోలేకపోవడంతో ఎన్నికల్లో ఓడిపోతూ.. నిరాశ నిస్పృహలకు గురవుతున్న కాంగ్రెస్ నాయకులు, రాహుల్ గాంధీ నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ గెలిస్తే ప్రజాస్వామ్యం.. వేరే పార్టీలు గెలిస్తే అది ప్రజాస్వామ్యానికి విఘాతమా?" అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు.

## నాలుగు ప్యాకేజీలుగా అమరావతి ఓఆర్ఆర్ పనులు

అమరావతి: అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)ను నాలుగు ప్యాకేజీలుగా నిర్మించనున్నారు. 189.93 కి.మీ.మేర ఆరు వరుసలతో కూడిన ఓఆర్ఆర్‌తోపాటు, నారాకోడూరు నుంచి గుంటూరు శివారులోని బుడంపాడు వరకు 5.2 కి.మీ. మేర నాలుగు వరుసల అనుసంధాన రహదారి (స్పర్ రోడ్డు) కలిపి మొత్తం 195.13 కి.మీ. మేర నిర్మించనున్నారు. దీనిని నాలుగు ప్యాకేజీలుగా విభజించి.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు ప్రతిపాదనలు పంపారు. కృష్ణా నదిపై రెండు చోట్ల నిర్మించనున్న వంతెనలు, 3 సొరంగాలు.. తదితర పనులన్నీ కలిపి నాలుగు ప్యాకేజీల్లోనే నిర్మించేలా చూస్తారు. గతంలో సగటున 25–30 కి.మీ.లకు ఒక ప్యాకేజీ చొప్పున ఆరు నుంచి ఎనిమిది ప్యాకేజీలుగా ప్రతిపాదించాలనుకున్నారు. అయితే తక్కువ ప్యాకేజీలు ఉండేలా చూడాలని ఉన్నతాధికారుల నుంచి సూచన రావడంతో..నాలుగు ప్యాకేజీలుగా విభజించారు.

మొదటి ప్యాకేజీ చిన్నది..

ఎన్టీఆర్ జిల్లాలోని కంచికచర్ల సమీపంలో విజయవాడ–హైదరాబాద్ హైవే వద్ద నుంచి ఓఆర్ఆర్ (0 కి.మీ.) మొదలవుతుంది. అక్కడి నుంచి కొండపల్లి, పంగిడి అటవీ ప్రాంతాల మీదుగా మైలవరం సమీపంలో 27వ కి.మీ. వరకు మొదటి ప్యాకేజీ ఉంటుంది. ఇందులో 2.68 కి.మీ., 1.64 కి.మీ.తో రెండు సొరంగాలు కూడా ఉన్నాయి. రెండో ప్యాకేజీ 27వ కి.మీ. నుంచి కృష్ణా జిల్లా కంకిపాడు మండలం కోలవెన్ను సమీపంలోని 83వ కి.మీ.వరకు ఉంటుంది. ఇది మొత్తం 56 కిలోమీటర్లు ఉంటుంది. మూడో ప్యాకేజీ 83వ కి.మీ నుంచి మొదలై.. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట సమీపంలోని 133.5వ కి.మీ. వరకు ఉంటుంది. ఈ ప్యాకేజీలో 50.5 కి.మీ. మేర ఓఆర్ఆర్‌తోపాటు, అదనంగా నారాకోడూరు నుంచి బుడంపాడు వరకు 5.2 కి.మీ. అనుసంధాన రహదారి కూడా ఉంటుంది. అలాగే ఇదే ప్యాకేజీలో కృష్ణానదిపై వల్లూరుపాలెం వద్ద 4.8 కి.మీ. మేర వంతెన నిర్మిస్తారు.

నాలుగో ప్యాకేజీ 133.5 కి.మీ. వద్ద మొదలై.. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల సమీపంలో 189వ కి.మీ. వరకు ఉంటుంది. ఇది మొత్తం 55.5 కి.మీ.లు. ఇందులో పేరేచర్ల వద్ద 400 మీటర్ల సొరంగం, మున్నలూరు వద్ద కృష్ణానదిపై 3.15 కి.మీ. వంతెన నిర్మిస్తారు.

చివర్లో 189వ కి.మీ. నుంచి 189.93 కి.మీ. వరకు (930 మీటర్ల మేర) ఓఆర్ఆర్ పనులు మొదటి ప్యాకేజీలో చేర్చారు.

రూ.10,595.70 కోట్ల అంచనాతో..

ఓఆర్ఆర్ ప్రాజెక్ట్ మొత్తం అంచనా వ్యయం రూ.30,491 కోట్లుగా ఉంది. ఇందులో నాలుగు ప్యాకేజీల్లో సివిల్ పనులకు కలిపి రూ.10,595.70 కోట్ల మేర అవసరమని అంచనా వేశారు. భూసేకరణకు రూ.5,315 కోట్ల వరకు వెచ్చిస్తారు. పర్యావరణ, అటవీ అనుమతులు, విద్యుత్ లైన్లు తదితరాలకు ఖర్చులు, హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్)లో 15 ఏళ్లపాటు వడ్డీ సహా చెల్లింపులు తదితరాలకు మిగిలిన వ్యయం అవుతుంది.

## బీఆర్ఎస్ కొత్త పంథాలో సరికొత్త వ్యూహాలతో ముందుకు




హైదరాబాద్: రాష్ట్రంలో మరోమారు వరుస ఎన్నికల సందడి తెరమీదకు వస్తుండటంతో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కొత్త పంథాలో సరికొత్త వ్యూహాలతో ముందుకు సాగాలని భావిస్తోంది. గతంలో కొన్ని ఎన్నికలకు దూరంగా ఉండి రాజకీయంగా నష్టపోయిన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని సమీప భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ సర్వశక్తులు ఒడ్డాలని పార్టీ నిర్ణయించింది. ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నిక మొదలుకొని శాసనమండలి పట్టభద్రుల ఎన్నికల్లో సత్తా చాటాలని అనుకుంటోంది. మరోవైపు గ్రేటర్ హైదరాబాద్, వరంగల్ కార్పొరేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలకూ పార్టీ శ్రేణులను ఇప్పటి నుంచే సన్నద్ధం చేసేదిశగా బీఆర్ఎస్ అడుగులు వేస్తోంది. మండలి పట్టభద్రుల స్థానాల్లో..: శాసనమండలి పట్టభద్రుల కోటాలో 'వరంగల్--ఖమ్మం--నల్లగొండ', 'హైదరాబాద్-- రంగారెడ్డి--మహబూబ్‌నగర్' స్థానాల్లో పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ప్రస్తుతం 'హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్'పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా ఉన్న దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు కుమార్తె వాణీదేవి మరోమారు పోటీకి విముఖంగా ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కొత్త అభ్యర్థిని బరిలోకి దింపాలని బీఆర్ఎస్ భావిస్తోంది.

'వరంగల్--ఖమ్మం--నల్లగొండ'పట్టభద్రుల నియోజకవర్గం నుంచి గతంలో పోటీ చేసి ఓటమిపాలైన ఏనుగుల రాకేశ్‌రెడ్డికే మరోమారు అవకాశం ఇవ్వడం దాదాపు ఖాయమైంది. ఈ నేపథ్యంలో "హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్'స్థానం నుంచి బీసీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని బరిలోకి దింపాలని బీఆర్ఎస్ భావిస్తోంది. స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ ఆంజనేయ... వెంకటేశ్వర్‌రెడ్డి తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. అయితే బీసీ సామాజికవర్గానికి చెందిన ఓ కేంద్ర ప్రభుత్వ కేడర్‌కు చెందిన అధికారి, మరో హైకోర్టు న్యాయవాది పోటీ చేసేందుకు ఆసక్తిగా ఉన్నా, ఆర్థికంగా బలమైన వ్యక్తి కోసం అన్వేషణ సాగుతున్నట్లు ప్రచారం. మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ కుమారుడు కాసాని వీరేశ్ కూడా పోటీకి ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బీసీ సామాజికవర్గానికి చెందిన ఓ మాజీ మంత్రిని కూడా బరిలోకి దించితే ఎలా ఉంటుందనే కోణంలో బీఆర్ఎస్‌లో చర్చ జరుగుతోంది.

గతంలో 'కరీంనగర్--ఆదిలాబాద్--నిజామాబాద్--మెదక్'పట్టభద్రుల నియోజకవర్గంతోపాటు 'కరీంనగర్--ఆదిలాబాద్--నిజామాబాద్--మెదక్', 'వరంగల్--ఖమ్మం--నల్లగొండ'ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికకు బీఆర్ఎస్ దూరంగా ఉంది. దీంతో 'కరీంనగర్--ఆదిలాబాద్-- నిజామాబాద్--మెదక్'పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపొందారు. బీఆర్ఎస్ బరిలో లేకపోవడంతో ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు బీజేపీ అభ్యర్థులకు అనుకూలంగా పోలైనట్లు అంచనాకు బీఆర్ఎస్ వచ్చింది. మరోవైపు 'హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్'పట్టభద్రుల నియోజకవర్గం నుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పోటీ చేసే అవకాశాలు ఉండటంతో, సిట్టింగ్ స్థానాన్ని తిరిగి కైవసం చేసుకునేందుకు బలమైన అభ్యర్థిని బరిలోకి దింపాలని బీఆర్ఎస్ భావిస్తోంది.

2023 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారానికి దూరమైన బీఆర్ఎస్ ఆ తర్వాత హైదరాబాద్ జిల్లా పరిధిలో జరిగిన రెండు ఉప ఎన్నికల్లోనూ ఓటమి పాలైంది. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నికలో భిన్నమైన వ్యూహంతో ముందుకు సాగాలని పార్టీ భావిస్తోంది. సుదీర్ఘకాలంగా పార్టీ కోసం పనిచేస్తున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. గతంలో గోవర్ధన్‌రెడ్డి భార్య మన్నె కవితారెడ్డి రెండు పర్యాయాలు జీహెచ్ఎంసీ కార్పొరేటర్‌గా కూడా పనిచేశారు. తలసాని సాయికిరణ్ పేరు కూడా ఆశావహుల జాబితాలో వినిపిస్తోంది.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్లతోపాటు వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లు, మరికొన్ని మున్సిపాలిటీలకు కూడా ఎన్నికలు జరగాల్సి ఉంది. సుదీర్ఘకాలంగా వాయిదా పడుతూ వస్తున్న మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు కూడా ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించే అవకాశం ఉందని బీఆర్ఎస్ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రెండు రోజుల క్రితం ఎర్రవల్లి నివాసంలో పార్టీ అధినేత కేసీఆర్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాలు, కాంగ్రెస్, బీజేపీ వేస్తున్న రాజకీయ ఎత్తుగడలు, బీఆర్ఎస్ అనుసరిస్తున్న వ్యూహాలు, ప్రతివ్యూహాలపైనా ఈ భేటీలో చర్చ జరిగినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో వచ్చే నెల మొదటివారంలో ఉమ్మడి జిల్లాల వారీగా ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, కీలక నేతలతో కేసీఆర్ వరుస భేటీలు నిర్వహించాలని యోచిస్తున్నారు. దసరా తర్వాత క్షేత్ర స్థాయిలో వివిధ ఎన్నికలను ఎదుర్కొనే విధానం కేడర్‌ను సన్నద్ధం చేసేలా కార్యాచరణకు శ్రీకారం చుట్టాలని బీఆర్ఎస్ భావిస్తోంది.

## రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు': కేటీఆర్

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలు పాలిచ్చే బర్రెను వదిలి తన్నే దున్నపోతును తెచ్చుకున్నారని అన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. సత్తూరి యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్ ప్రజల తీర్పును గౌరవించి కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారని కేటీఆర్ అన్నారు. మూడేళ్లుగా కేసీఆర్ ప్రజల్లోకి రాకపోయినా గల్లీ గల్లీలో ఆయన పాటలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో రైతులు నాట్లు వేసే సమయానికే రైతుబంధు డబ్బులు ఖాతాల్లో పడేవని కేటీఆర్ చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు మూడుసార్లు రైతుబంధు ఇవ్వలేదని ఆరోపించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలతో పాటు హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చలేదని విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని భావించారని కేటీఆర్ అన్నారు. కానీ పరిస్థితి 'అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం పోయినట్లు' తయారైందని వ్యాఖ్యానించారు. మహబూబాబాద్‌లో కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించిన నాయకుడు కనిపించకుండా పోయారని ఎద్దేవా చేశారు. 2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 28 నుంచి చేపట్టే పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

## పిక్సెల్స్ నుంచి పైపుల వైపు పాలన పయనం సాగింది

అమరావతి: ప్రముఖ ఆంగ్ల మీడియా సంస్థ 'ది ప్రింట్' వ్యవస్థాపకుడు శేఖర్ గుప్తా పెట్టిన ఓ సోషల్ మీడియా పోస్టుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. తన పాలనా విధానం, ప్రాధాన్యతలపై జరుగుతున్న విశ్లేషణపై ఆయన తన అభిప్రాయాలను స్పష్టంగా పంచుకున్నారు. 'పిక్సెల్స్ నుంచి పైపుల వైపు' సాగుతున్న తన ప్రయాణం వెనుక ఉన్న ఉద్దేశాన్ని వివరిస్తూ, అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ చేరాలన్నదే తన స్థిరమైన నమ్మకమని పునరుద్ఘాటించారు. 'ది ప్రింట్' మీడియాలో వచ్చిన ఒక కథనాన్ని శేఖర్ గుప్తా ప్రస్తావిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. చంద్రబాబు తన 'సీఈఓ–సీఎం' ఇమేజ్‌ను మార్చుకుని, గ్రామీణ ప్రాంతాల్లో టీడీపీకి ఆదరణ పెంచుకునేందుకు 'పిక్సెల్స్' (టెక్నాలజీ) నుంచి 'పైపుల' (సాగునీటి) వైపు ఎలా పయనిస్తున్నారనే విశ్లేషణ ఆ కథనంలో ఉంది. ఈ పోస్టుపై స్పందించిన చంద్రబాబు, తన రాజకీయ ప్రస్థానం వెనుక ఉన్న మూల సిద్ధాంతాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు స్పందిస్తూ, "నా ప్రజా జీవితం ఒకే ఒక్క నమ్మకం చుట్టూ ముడిపడి ఉంది. అభివృద్ధి ఫలాలు కచ్చితంగా ప్రజల దైనందిన జీవితాలను మెరుగుపరచాలి. 1990లలో మారుతున్న ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా టెక్నాలజీ పర్యావరణ వ్యవస్థను నిర్మించడం, కొత్త అవకాశాలు సృష్టించడం నా ముందున్న కర్తవ్యం. కానీ, ఈ రోజు నా ప్రాధాన్యత మరింత మౌలికమైనది. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న మన రైతులకు, ముఖ్యంగా చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడమే నా ముందున్న అతిపెద్ద లక్ష్యం" అని వివరించారు. "అది పిక్సెల్స్ అయినా, పైపులైనా.. రెండింటి ఉద్దేశం ఒక్కటే. ప్రజల సమస్యలను పరిష్కరించడం, వారి జీవనోపాధిని బలోపేతం చేయడం, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి కుటుంబానికి మెరుగైన భవిష్యత్తును నిర్మించడం" అని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ప్రయాణాన్ని కథనంలో చక్కగా వివరించినందుకు శేఖర్ గుప్తాకు, 'ది ప్రింట్' మీడియాకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు 'హైటెక్ సీఎం'గా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి పెద్దపీట వేసిన నేతగా గుర్తింపు పొందారు. అయితే, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వ్యవసాయ రంగం, సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారించడం ద్వారా గ్రామీణ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తన పాలనా ప్రాధాన్యతలు కాలానికి అనుగుణంగా మారతాయే తప్ప, ప్రజలకు సేవ చేయాలనే అసలు లక్ష్యం మాత్రం మారదని చంద్రబాబు తన స్పందన ద్వారా స్పష్టం చేశారు.

## సీఎం విజయ్ నటనను ఇంకా ఆపలేదు: స్టాలిన్

తమిళనాడు: తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్‌పై మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎం.కే. స్టాలిన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సినిమాలకు స్వస్తి పలికినప్పటికీ, ప్రజల ముందు విజయ్ ఇంకా నటిస్తూనే ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఈ మేరకు శనివారం 'ఎక్స్' వేదికగా ఆయన ఒక పోస్ట్ చేశారు. మధురాంతకం అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రచారంలో విజయ్ నటనను తాను ప్రత్యక్షంగా చూశానని స్టాలిన్ పేర్కొన్నారు. డీఎంకేను ఒక దుష్టశక్తిగా, టీవీకేను పవిత్ర శక్తిగా విజయ్ అభివర్ణించడం హాస్యాస్పదమని విమర్శించారు. విజయ్ ప్రభుత్వ హయాంలో పరిపాలన పూర్తిగా విఫలమైందని, రాష్ట్రంలో విద్యుత్ కోతలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, పాల కొరత, శాంతిభద్రతల క్షీణత వంటి సమస్యలు పెరిగిపోయాయని ఆరోపించారు. గత డీఎంకే ప్రభుత్వ పథకాలకే పేర్లు మార్చి టీవీకే ప్రభుత్వం అమలు చేస్తోందని ఆయన మండిపడ్డారు. జెమ్ గ్రానైట్స్ ఛైర్మన్ ఆర్. వీరమణికి సంబంధించిన పోక్సో కేసులో డీఎంకేపై విజయ్ చేస్తున్న ఆరోపణలు కేవలం నిరాధారమని స్టాలిన్ కొట్టిపారేశారు. ఈ విషయంపై తాను ఇప్పటికే అసెంబ్లీలో స్పష్టమైన వివరణ ఇచ్చానని గుర్తుచేశారు. దర్యాప్తు దశలో ఉన్న అంశాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవద్దని మద్రాస్ హైకోర్టు ఆదేశించినప్పటికీ, ఎన్నికల ప్రచారంలో విజయ్ పదేపదే ఈ అంశాన్ని ప్రస్తావించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రజల ముందు నటించడం మాని, ముఖ్యమంత్రి పదవికి ఉండాల్సిన రాజకీయ హుందాతనాన్ని ప్రదర్శించాలని విజయ్‌కు స్టాలిన్ హితవు పలికారు.

## జోరు పెంచిన ప్రశాంత్ కిశోర్.. ఢిల్లీలో నేడు అత్యంత కీలక సమావేశం

ఢిల్లీ: ఎన్నికల వ్యూహకర్తగా సుపరిచితులైన ప్రశాంత్ కిశోర్... ఇప్పుడు రాజకీయ నాయకుడిగా తన ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకెళ్తున్నారు. 'జన్ సూరజ్ పార్టీ' (జేఎస్పీ) అధినేత అయిన ఆయన, ఇప్పుడు జాతీయ రాజధాని ఢిల్లీపై కన్నేశారు. పార్టీని అక్కడ కూడా విస్తరించాలనే ఉద్దేశంతో రేపు ఢిల్లీ వేదికగా ఓ కీలక సమావేశానికి ఏర్పాట్లు చేశారు. ఈ భేటీలోనే ఢిల్లీ వ్యవహారాలను చక్కదిద్దేందుకు ఒక ప్రత్యేక స్టీరింగ్ కమిటీని కూడా ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. 2024లో జేఎస్పీని ప్రారంభించిన ప్రశాంత్ కిశోర్... 2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు సాధించలేకపోయారు. ఆ ఎన్నికల్లో పార్టీ ఎలాంటి స్థానాలను గెలుచుకోలేకపోయింది. అయితే, ఈ ఏడాది ఆగస్టులో జరిగిన బంకిపూర్ ఉప ఎన్నికలో ఆయన స్వయంగా విజయం సాధించి సత్తా చాటారు. ఈ జోష్‌తోనే ఇప్పుడు ఢిల్లీ రాజకీయాల్లోనూ తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని చూస్తున్నారు. ముఖ్యంగా ఢిల్లీలో నివసిస్తున్న పూర్వాంచల్ ప్రాంత ప్రజలపై జేఎస్పీ ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సమాచారం. బీహార్‌కు చెందిన మూలాలున్న ఈ వర్గం ప్రజలు రేపు జరిగే సమావేశానికి పెద్ద ఎత్తున తరలిరానున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఢిల్లీ ఓటర్లు బీజేపీ, ఆప్ తీరుతో విసిగిపోయారని, ప్రత్యామ్నాయ వేదిక కోసం చూస్తున్నందున తమ పార్టీని ఆదరిస్తారన్న నమ్మకంతో జేఎస్పీ నేతలు ఉన్నారు. ఢిల్లీ బాధ్యతల కోసం ఏర్పాటు చేయబోయే ఈ స్టీరింగ్ కమిటీలో పలువురు ప్రముఖులు ఉండే అవకాశం ఉంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... న్యాయవాది తథాగత్ హర్షవర్ధన్, దేశబంధు కాలేజీ ప్రొఫెసర్ శంతను కుమార్, హిమాచల్ ప్రదేశ్ మాజీ ఏడీజీపీ సింగ్ ఈ కమిటీలో కీలక బాధ్యతలు నిర్వర్తించనున్నారు. వీరితో పాటు జేఎస్పీ నేతలు కున్వార్ చంద్రేశ్, అబూ అద్నాన్ ఫరూఖీ, ప్రియాంక సింగ్ తదితరులు కూడా ఇందులో సభ్యులుగా ఉండనున్నట్లు తెలుస్తోంది.

## ఇంధన నిర్వహణ అద్భుతం.. అదానీ సెంటర్‌పై లోకేశ్ ట్వీట్

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన అహ్మదాబాద్ పర్యటనలో భాగంగా అదానీ గ్రూప్‌కు చెందిన అత్యాధునిక ఎనర్జీ మానిటరింగ్ సెంటర్‌ను సందర్శించారు. ఈ పర్యటనకు సంబంధించిన విశేషాలను ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా పంచుకున్నారు. అదానీ గ్రూప్ తమ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ఒకే ప్లాట్‌ఫామ్ ద్వారా రియల్ టైమ్ పద్ధతిలో పర్యవేక్షిస్తున్న తీరును లోకేశ్ పరిశీలించారు. ఈ విధానం వల్ల మెరుగైన పనితీరును సాధించవచ్చని, సత్వర నిర్ణయాలు తీసుకోవడానికి వీలవుతుందని, అలాగే సాంకేతిక అంతరాయాలను గణనీయంగా తగ్గించవచ్చని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. "భారీ ఇంధన మౌలిక సదుపాయాల నిర్వహణలో సాంకేతికతను, డేటాను వినియోగిస్తున్న విధానం ఎంతో ఆసక్తికరంగా ఉంది. అహ్మదాబాద్ పర్యటనలో ఈ సెంటర్‌ను సందర్శించడం మంచి అనుభవం" అని లోకేశ్ తెలిపారు. ఈ సందర్భంగా తనకు ఆతిథ్యం ఇచ్చిన మిత్రుడు కరణ్ అదానీకి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

## స్థానిక ఎన్నికలపై పవన్ ఫోకస్.. సమన్వయ కమిటీకి కీలక ఆదేశాలు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం జనసేన పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నిన్న సాయంత్రం స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ శ్రేణులు అందించిన సమాచారాన్ని క్రోడీకరించి, నివేదించేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల కమిటీతో ఈ భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ విధివిధానాలు, బాధ్యతలపై పవన్ కల్యాణ్ సభ్యులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయి నుంచి సేకరించిన సమగ్ర సమాచారంతో నివేదికలు సిద్ధం చేయాలని, సమన్వయంతో పనిచేస్తూ ఎప్పటికప్పుడు వివరాలను తనకు నివేదించాలని సూచించారు. కమిటీ కార్యకలాపాలకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి పూర్తి సహకారం ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. తదుపరి కార్యాచరణను ఖరారు చేసేందుకు సోమవారం మరోసారి సమావేశం కావాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్, పులపర్తి ప్రశాంత్, యనమల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఖైరతాబాద్ లో పోటీ చేస్తాం.. నా ఫాంహౌస్ కబ్జా భూమి కాదు: కవిత

హైదరాబాద్: ఖైరతాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నిక బరిలో తాము నిలవబోతున్నట్లు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీ తరఫున అధికారికంగా అభ్యర్థిని బరిలోకి దించనున్నట్లు ఆమె ప్రకటించారు. ఇదే సమయంలో ఫిరాయింపు రాజకీయాలపై మండిపడిన ఆమె... ఒక పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి, వేరే పార్టీలోకి వెళ్లి ఎంపీగా పోటీ చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని దానం నాగేందర్ తీరును పరోక్షంగా తప్పుబట్టారు. ఇక కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా సవరణపై స్పందిస్తూ... కేవలం క్లరికల్ తప్పుల పేరుతో ఓట్లు తొలగిస్తున్నారనే విమర్శలున్నాయని, బీజేపీని ప్రసన్నం చేసుకునేలా ఈ కుట్ర జరుగుతోందన్న చర్చ ప్రజల్లో నడుస్తోందని ఆమె ఆరోపించారు. ఆదిలాబాద్ రిమ్స్‌లో వరుసగా చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలు గాడితప్పుతున్నాయని, ప్రభుత్వం వాటిని తక్షణమే చక్కదిద్దాలని డిమాండ్ చేశారు. నిమ్స్, నీలోఫర్ వంటి పెద్ద ఆసుపత్రులలో మంత్రులు స్వయంగా ఫోన్ చేసినా బెడ్లు దొరకని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 11 రకాల ఆరోగ్య పథకాలకు కనీస బడ్జెట్ కేటాయించలేదని, ఆరోగ్యశ్రీ బకాయిలను కూడా ఇప్పటివరకు విడుదల చేయలేదని దుయ్యబట్టారు. ప్రభుత్వ ఆసుపత్రులను మంత్రులు పట్టించుకోవడం మానేశారని విమర్శించిన కవిత... జిల్లాల కలెక్టర్లు క్రమం తప్పకుండా హాస్టళ్లు, ప్రభుత్వ ఆసుపత్రులను తనిఖీ చేయాలని సూచించారు. తాము కూడా తెలంగాణ రక్షణ సేన తరఫున ప్రతి జిల్లాలోనూ ప్రభుత్వ ఆసుపత్రులను సందర్శించి పరిస్థితులను మదింపు చేస్తామన్నారు. రాష్ట్రంలో ఇన్ని పసిమొగ్గలు రాలిపోతుంటే... తెలంగాణను సింగపూర్, డల్లాస్ చేస్తామని సీఎం, మంత్రులు ఎలా గొప్పలు చెప్పుకుంటారని నిలదీశారు. ఐటీడీఏకు కేంద్రం నుంచి వచ్చిన నిధుల్లో ఏకంగా 70 శాతం నిధులను ఖర్చు చేయకుండా వృథా చేశారని ఆరోపించారు. కోఠి ఆసుపత్రిలో మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తామన్న ప్రతిపాదనను గత బీఆర్ఎస్ హయాంలోనే అడ్డుకున్నారని గుర్తుచేశారు. తన ఫామ్‌హౌస్‌పై వస్తున్న ఆరోపణలను కవిత పూర్తిగా ఖండించారు. తనది ఎలాంటి కబ్జా భూమి కాదని, ఇనాం లేదా అసైన్డ్ భూమి అంతకంటే కానేకాదని స్పష్టం చేశారు. తన ఫామ్‌హౌస్ ఎఫ్‌టీఎల్ పరిధిలో కూడా లేదని స్పష్టం చేస్తూ... తన ఆస్తులకు సంబంధించిన ప్రతి వివరమూ ఎన్నికల అఫిడవిట్లోనే స్పష్టంగా పేర్కొన్నట్లు వెల్లడించారు. ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనపై, ఇతర ప్రతిపక్ష నేతలపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. గతంలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల ఫామ్‌హౌస్‌లకు వెళ్లిన పెద్దలు అప్పట్లో ఎందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె ప్రశ్నించారు.

## 13 నెలల్లోనే గూగుల్.. 17 నెలల్లో ఆర్సెలర్.. ఏపీ స్పీడ్ ఇదేనన్న లోకేశ్



అమరావతి: 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ ప్రధాన గ్రోత్ ఇంజన్‌గా నిలవాలని, ఈ అభివృద్ధి ప్రయాణంలో పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. అహ్మదాబాద్‌లో సీఐఐ (కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) ఆధ్వర్యంలో జరిగిన పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ రోడ్‌షోలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గుజరాత్ పారిశ్రామిక స్ఫూర్తి దేశానికి ఆదర్శమని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆ రాష్ట్రం సాధించిన ప్రగతి అద్భుతమని కొనియాడారు. వైబ్రంట్ గుజరాత్ మోడల్ స్ఫూర్తితో ఏపీ కూడా శరవేగంగా దూసుకెళ్తోందని, ఈ ప్రగతిలో గుజరాత్ పారిశ్రామిక రంగం భాగస్వామి కావాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతతో, వేగవంతమైన నిర్ణయాలతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని లోకేశ్ తెలిపారు. తమ ప్రభుత్వ పనితీరుకు ఫలితాలే నిదర్శనమని, 2025–26 ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో దేశానికి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25.3 శాతం ఏపీకే వచ్చాయని గుర్తుచేశారు. ఏపీలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, మాటలకే పరిమితం కాకుండా చేతల్లో వేగం చూపిస్తున్నామని వివరించారు. గుజరాత్‌లో డబుల్ ఇంజన్ సర్కార్ ఉంటే, ఏపీలో కేంద్రం సహకారంతో 'నాయుడు–మోదీజీ' జోడీతో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ వేగానికి ఉదాహరణగా గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ ప్రాజెక్టులను లోకేశ్ ప్రస్తావించారు. విశాఖలో గూగుల్ ఏఐ హబ్, డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియను కేవలం 13 నెలల్లో పూర్తి చేశామని తెలిపారు. అదేవిధంగా, సుమారు 12 బిలియన్ డాలర్ల పెట్టుబడితో రానున్న ఆర్సెలర్ మిట్టల్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్ ప్లాంట్‌కు సంబంధించిన భూసేకరణ, పర్యావరణ అనుమతులు, పునరావాసం వంటి క్లిష్టమైన ప్రక్రియలను కేవలం 17 నెలల్లో పూర్తి చేశామని వివరించారు. పెట్టుబడిదారుల సమస్యలను వ్యక్తిగత సమస్యగా కాకుండా, వ్యవస్థాగత సమస్యగా చూసి శాశ్వత పరిష్కారాలు చూపుతామని భరోసా ఇచ్చారు. అందుకే కొందరు తనను సరదాగా 'ఆంధ్రా డోలో–650' అని పిలుస్తారని అన్నారు. పెట్టుబడిదారులను కేవలం అనుమతుల కోసం వచ్చేవారిగా కాకుండా రాష్ట్ర అభివృద్ధిలో దీర్ఘకాలిక భాగస్వాములుగా చూస్తామని లోకేశ్ స్పష్టం చేశారు. 'స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్' అనే మూడు సూత్రాలతో ముందుకెళ్తున్నామన్నారు. రాష్ట్రంలో క్లస్టర్ ఆధారిత అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా వంటి 23 రంగాల్లో ప్రత్యేక క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. విశాఖ, అమరావతి, తిరుపతిలను ప్రత్యేక ఆర్థిక రీజియన్లుగా తీర్చిదిద్దుతామని, హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన అనుభవంతో అమరావతిని కూడా ఉన్నతంగా నిర్మిస్తామని చంద్రబాబు పట్టుదలతో ఉన్నారని అన్నారు. గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు పోటీపడాల్సిన అవసరం లేదని, కలిసి పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చని అభిప్రాయపడ్డారు. ఏపీని తూర్పు భారతదేశానికి వ్యూహాత్మక గేట్‌వేగా వినియోగించుకోవాలని గుజరాత్ పారిశ్రామికవేత్తలను కోరారు. నవంబర్‌లో జరగనున్న పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌లో పాల్గొనాలని ఆహ్వానిస్తూ, 2047 నాటికి ఏపీ ఆర్థిక వ్యవస్థను 2.4 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో సీఐఐ గుజరాత్ ప్రతినిధులు, ఏపీఐఐసీ ఉన్నతాధికారులు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## భజనలకు కొత్త స్టైల్.. 'భజన్ క్లబ్బింగ్' అంటే ఏంటి? మోదీ ఎందుకు పాల్గొన్నారు?



ఢిల్లీ: సాధారణంగా భజన అంటే ఓ చోట చేరి భక్తి పాటలు పాడటం.. తాళాలు వేయడం.. భక్తిలో మునిగిపోవడం. కానీ ఇప్పుడు ఇదే భజనలకు కాస్త కొత్త రూపం వచ్చింది. పాటలు అవే.. భక్తి భావం అదే.. అయితే ప్రదర్శించే విధానం మాత్రం కాస్త మోడ్రన్‌గా మారింది. 'భజన్ క్లబ్బింగ్' పేరుతో యువతను ఆకట్టుకుంటున్న ఈ ట్రెండ్ ఇప్పుడు మరోసారి చర్చలోకి వచ్చింది. కారణం.. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ అంతటివాడు పాల్గొనడమే.

అసలు 'భజన్ క్లబ్బింగ్' అంటే?

'భజన్ క్లబ్బింగ్'లో సంప్రదాయ భజనలను కచేరీ తరహాలో ప్రదర్శిస్తారు. భక్తి పాటలకు ఆధునిక సంగీత వాయిద్యాలు, బీట్‌లు, రిథమ్ జోడిస్తారు. గాయకులతో పాటు ప్రేక్షకులూ పాటలు పాడొచ్చు. చప్పట్లు కొడుతూ తాళానికి అనుగుణంగా కదలొచ్చు. కొన్ని కార్యక్రమాల్లో నృత్యం చేస్తూ కూడా భజనల్లో పాల్గొంటారు.

అంటే.. సంప్రదాయ భక్తి సంగీతాన్ని నేటి కచేరీ వాతావరణానికి దగ్గరగా తీసుకురావడమే ఈ విధానం. భజనల పవిత్రతను కాపాడుతూనే వాటిని కొత్త తరానికి పరిచయం చేయడం దీని ప్రత్యేకతగా చెప్పొచ్చు.

సంప్రదాయ భజనలకు దీనికి తేడా ఏంటి?

సాధారణ భజనల్లో ప్రశాంతంగా కూర్చొని లేదా ఒకే చోట చేరి భక్తి పాటలు పాడటం ఎక్కువగా కనిపిస్తుంది. భజన్ క్లబ్బింగ్‌లో మాత్రం వాతావరణం మరింత ఉత్సాహంగా ఉంటుంది. లైవ్ మ్యూజిక్, ఆధునిక బీట్‌లు, చప్పట్లు, పాటతో పాటు ప్రేక్షకుల భాగస్వామ్యం ఉంటాయి. అందుకే ఇది సాధారణ భజన కార్యక్రమానికి, మ్యూజిక్ కాన్సర్ట్‌కు మధ్య ఉన్న ఓ కొత్త తరహా అనుభూతిలా కనిపిస్తుంది.

మోదీ ఎలా పాల్గొన్నారు?

ఢిల్లీలోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ పార్క్‌లో శుక్రవారం భజన్ క్లబ్బింగ్ కార్యక్రమం జరిగింది. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ 110వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని మోదీ కార్యక్రమానికి హాజరై ప్రేక్షకుల మధ్య కూర్చున్నారు. భజనలు జరుగుతున్న సమయంలో చప్పట్లు కొడుతూ పాల్గొన్నారు. చేతిలో చిన్న వాయిద్యాన్ని (కంజర) వాయిస్తూ కనిపించారు.

జనవరిలోనే ప్రస్తావించిన మోదీ

'భజన్ క్లబ్బింగ్' గురించి మోదీ ఈ ఏడాది జనవరిలో 'మన్ కీ బాత్'లోనూ ప్రస్తావించారు. జెన్–జీ యువత ఈ విధానాన్ని స్వీకరిస్తోందని, ఆధ్యాత్మికతతో ఆధునికత కలిసిన రూపంగా ఇది కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. భజనల పవిత్రతను కాపాడుతూ కొత్త విధానంలో వాటిని అందిస్తున్నారని చెప్పారు.

యువతకు ఎందుకు నచ్చుతోంది?

భజనలు వినడానికి తప్పనిసరిగా సంప్రదాయ కార్యక్రమానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా.. లైవ్ మ్యూజిక్, రిథమ్, సామూహిక భాగస్వామ్యంతో అనుభవించే అవకాశం ఈ విధానంలో ఉంటుంది. అందుకే సంప్రదాయ భక్తి సంగీతాన్ని ఆధునిక సంగీత వాతావరణంతో కలపాలనుకునే కార్యక్రమంగా 'భజన్ క్లబ్బింగ్' గుర్తింపు పొందుతోంది.

# ఖమ్మం జిల్లాలో గల మీ సేవలో అడుగు అడుగున అక్రమాలే

**- అధికారుల బదులు అనధికార వ్యక్తుల సంతకాలే అనే అనుమానం**
**- ఏసీబీ తనిఖీల్లో వెలుగులోకి వస్తున్న సంచలన అంశాలు**
**- అధిక వసూళ్లు, మధ్యవర్తుల వ్యవహారంపై ఆరా**
**- తనిఖీ జరిగి నెలలు గడిచినా తదుపరి చర్యలెక్కడ**
**- మీ సేవా కేంద్రం సేవలకా మధ్యవర్తులకా**
**- ప్రభుత్వ రుసుం ఎంత? ప్రజల నుంచి వసూలు చేసిందెంత**
**- ఖమ్మం కేంద్రంపై ఏసీబీ గుర్తించిన అంశాలపై చర్య ఎక్కడ**
**- సంతకాలు ఎవరివి ధ్రువపత్రాలు ఎవరు తయారు చేశారు**
**- ఒక కేంద్రం తనిఖీతో సమస్య ముగిసిందా**
**- జర్నలిస్ట్ ల పేరుతో పలు చోట్ల మీ సేవ కేంద్రాలు**
**- ఖమ్మం నగరంలో ఓ ప్రధాన పత్రిక పేరుతో మీ సేవ కేంద్రం, మరోవైపు ఖమ్మం కార్పొరేషన్ లో భార్య ఉద్యోగం**

ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ::: ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభంగా, పారదర్శకంగా అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మీ సేవా కేంద్రాల్లో నిబంధనల ఉల్లంఘనలు చోటుచేసుకుంటున్నాయా? ప్రజల దరఖాస్తులు, ధ్రువపత్రాలు, ప్రభుత్వ రుసుముల చెల్లింపులు, దరఖాస్తుల పరిశీలన వంటి కీలక ప్రక్రియల్లో అనధికార వ్యక్తుల జోక్యం ఉందా? అన్న ప్రశ్నలు ఖమ్మంలో అవినీతి నిరోధక శాఖ నిర్వహించిన ఆకస్మిక తనిఖీలతో మరోసారి తెరపైకి వచ్చాయి. 2026 ఏప్రిల్ 15న తెలంగాణవ్యాప్తంగా 13 మీ సేవా కేంద్రాల్లో ఏసీబీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా, ఖమ్మం కేంద్రంలో అధీకృత సిబ్బందికి బదులుగా అనధికార వ్యక్తులు ధ్రువపత్రాలపై సంతకాలు చేస్తున్నట్లు గుర్తించినట్లు ఏసీబీ ఆధారిత నివేదికలు వెల్లడించాయి. ఇది ఇలా ఉండగా ఓ మీ సేవ కేంద్రంలో ఓ ప్రధాన పత్రిక రిపోర్టర్ గా చెలామణి అవుతూ మరోవైపు తన భార్యను ఖమ్మం కార్పొరేషన్ లో ఉద్యోగం ఇప్పించుకొని, ఆ కార్యాలయంలోని విలువైన డాకుమెంట్స్ మొత్తం తన వద్దకు తెప్పించకోవడం జరుగుతుంది అనే ఆరోపణలు చోటు చేసుకున్నాయి. దీనిపై క్షేత్ర స్థాయిలో విచారణ చేపడితే మరిన్ని విషయాలు బయటకు రానున్నాయి. దీనిపై ఖమ్మం కార్పొరేషన్ కమీషనర్ ఏ చర్యలు తీసుకుంటరో వేచి చూడాలి మరి.

- అధికారుల బదులు అనధికార వ్యక్తుల సంతకాలా

ఖమ్మంలోని మీ సేవా కేంద్రంలో ధ్రువపత్రాలపై అధికారికంగా బాధ్యత కలిగిన వ్యక్తుల స్థానంలో అనధికార వ్యక్తులు సంతకాలు చేస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించినట్లు ఏసీబీ పేర్కొంది. ఒక సాధారణ ధ్రువపత్రం వెనుక ప్రజల వ్యక్తిగత సమాచారం, ఆదాయం, కులం, నివాసం, ఇతర ప్రభుత్వ సేవలకు సంబంధించిన వివరాలు ఉంటాయి. అలాంటి పత్రాల జారీ ప్రక్రియలో అధీకృత వ్యవస్థకు బయట ఉన్న వ్యక్తి జోక్యం చేసుకోవడం నిజమైతే, అది కేవలం కార్యాలయ నిబంధనల ఉల్లంఘనగా మాత్రమే కాకుండా ప్రజల పత్రాల భద్రత, ప్రభుత్వ ధ్రువపత్రాల విశ్వసనీయతకు సంబంధించిన తీవ్రమైన ప్రశ్నగా మారుతుంది.

### - మీ సేవా కేంద్రం, సేవలకామధ్యవర్తులకా

మీ సేవా కేంద్రాల ప్రధాన ఉద్దేశం ప్రజలు నేరుగా ప్రభుత్వ సేవలు పొందేలా చేయడం. కానీ ఏసీబీ తనిఖీల్లో రాష్ట్రంలోని పలు కేంద్రాల్లో అనధికార మధ్యవర్తుల ప్రమేయం, నిర్ణీత రుసుం ల కంటే అధిక వసూళ్లు వంటి అంశాలు గుర్తించినట్లు తెలిపింది. కొన్ని కేంద్రాల్లో కేంద్రాల నిర్వాహకులు, అనధికార ఏజెంట్ల మధ్య నగదు రహిత లావాదేవీలు, సందేశాల మార్పిడికి సంబంధించిన వివరాలు కూడా తనిఖీల్లో గుర్తించినట్లు నివేదికలు పేర్కొన్నాయి.

### ప్రభుత్వ రుసుము ఎంత ప్రజల నుంచి వసూలు చేసిందెంత

మీ సేవా కేంద్రాల్లో ప్రతి సేవకు ప్రభుత్వం నిర్ణయించిన రుసుం ఉంటుంది. దానికి మించి వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధం. ఏసీబీ రాష్ట్రవ్యాప్త తనిఖీల్లో పలు కేంద్రాలు నిర్ణీత రుసుం కంటే అధికంగా వసూలు చేస్తున్నట్లు గుర్తించినట్లు పేర్కొంది. ఖమ్మం కేంద్రానికి సంబంధించి కూడా ఇప్పుడు కీలకంగా తేలాల్సింది. ప్రజల నుంచి ఏ సేవకు ఎంత వసూలు చేశారు? ప్రభుత్వం నిర్ణయించిన రుసుం ఎంత? అదనంగా ఏమైనా వసూలు చేశారా అదనపు మొత్తానికి రసీదు ఇచ్చారా అన్నదే తేలాల్సి ఉంది.

### ఖమ్మం కేంద్రంపై ఏసీబీ గుర్తించిన అంశాలపై చర్య ఎక్కడ

ఏసీబీ తనిఖీలు నిర్వహించడం ఒక దశ మాత్రమే. తనిఖీల్లో గుర్తించిన అంశాలపై శాఖాపరమైన విచారణ జరిగిందా సంబంధిత కేంద్రానికి వివరణ కోరారా అనధికార వ్యక్తులు ధ్రువపత్రాలపై సంతకాలు చేసిన అంశంపై బాధ్యులను గుర్తించారా? కేంద్రం నిర్వహణపై ఏదైనా చర్య తీసుకున్నారా అనే ప్రశ్నలు ఇప్పుడు ముందుకు వస్తున్నాయి. తనిఖీల అనంతరం సంబంధిత కేంద్రాలపై చర్యల కోసం ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపనున్నట్లు ఏసీబీ అప్పట్లో తెలిపింది.

### సంతకాలు ఎవరివి ధ్రువపత్రాలు ఎవరు తయారు చేశారు

ఈ వ్యవహారంలో అసలు దర్యాప్తు ఇక్కడి నుంచే మొదలుకావాలి. ఏసీబీ గుర్తించిన ధ్రువపత్రాలు ఏ తేదీల్లో జారీ అయ్యాయి వాటిపై సంతకాలు చేసిన వ్యక్తి అధికారికంగా ఆ బాధ్యత కలిగిన వ్యక్తేనా కాదంటే అతను కేంద్రంలో ఏ హోదాలో ఉన్నాడు అతనికి సంతకం చేసే అధికారం ఎవరు ఇచ్చారు ఆ సంతకాల ఆధారంగా ఎన్ని ధ్రువపత్రాలు జారీ అయ్యాయి అనే ప్రశ్నలకు రికార్డులే సమాధానం చెప్పాలి. దరఖాస్తు నుంచి ధ్రువపత్రం వరకు, మొత్తం ప్రక్రియను పరిశీలించాలా ప్రజలు మీ సేవా కేంద్రానికి దరఖాస్తు చేసిన క్షణం నుంచి ధ్రువపత్రం అందుకునే వరకు ప్రతి దశకు నమోదు ఉంటుంది. దరఖాస్తు సంఖ్య, దరఖాస్తుదారుడి వివరాలు, సేవ రకం, చెల్లించిన రుసుం, దరఖాస్తు పరిశీలన, ధ్రువపత్రం తయారీ, జారీ చేసిన తేదీ వంటి వివరాలను పరిశీలిస్తే అసలు ప్రక్రియలో ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘన జరిగిందా అన్నది గుర్తించవచ్చు. అందుకే ఖమ్మం కేంద్రంలో ఏసీబీ గుర్తించిన అంశాలపై నమూనా ధ్రువపత్రాలను, దరఖాస్తులను, రుసుం ల రసీదులను, సంతకాల నమోదును పరిశీలించడం కీలకంగా మారుతుంది.

### అనధికార వ్యక్తులకు దరఖాస్తుదారుల సమాచారం ఎలా చేరింది

మీ సేవా కేంద్రాల్లో ప్రజలు తమ వ్యక్తిగత సమాచారాన్ని సమర్పిస్తారు. గుర్తింపు వివరాలు, కుటుంబ వివరాలు, ఆదాయం, కులం, నివాసం, భూములు, విద్య, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం వంటి వివరాలు అనేక సేవల్లో అవసరం కావచ్చు. ఇలాంటి సమాచారాన్ని అధికారిక బాధ్యత లేని వ్యక్తులు నిర్వహిస్తే, ఆ సమాచార భద్రతపై ప్రశ్నలు తలెత్తుతాయి. అందువల్ల ఖమ్మం కేంద్రంలో అనధికార వ్యక్తుల ప్రమేయం ఏ స్థాయిలో ఉందో, వారికి దరఖాస్తులపై ఎంతవరకు గోప్యత ఉందో కూడా విచారణలో తేలాల్సిన అంశమే.

### - మధ్యవర్తుల వ్యవహారం ఎంతవరకు ఉంది

ఏసీబీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో అనధికార మధ్యవర్తుల ప్రమేయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించింది. కొన్ని కేంద్రాల్లో కేంద్రాల నిర్వాహకులు, మధ్యవర్తుల మధ్య జరిగినట్లు గుర్తించిన నగదు రహిత లావాదేవీలు, సందేశాల మార్పిడిని కూడా అధికారులు పరిశీలించినట్లు నివేదికలు వెల్లడించాయి. ఖమ్మం కేంద్రానికి సంబంధించి కూడా ఇలాంటి సంబంధాలు ఉన్నాయా? ఉంటే వారి పాత్ర ఏమిటి? ప్రజల నుంచి అదనపు మొత్తాలను ఎవరు వసూలు చేశారు అనే అంశాలను దర్యాప్తులో స్పష్టీకరించాల్సి ఉంది.

### - ఒక కేంద్రం తనిఖీతో సమస్య ముగిసిందా

ఖమ్మంలో ఒక మీ సేవా కేంద్రంలో ఏసీబీ గుర్తించిన అంశాలు నిజమైతే, దాన్ని ఒక్క కేంద్రానికి మాత్రమే పరిమితం చేసి చూడకుండా జిల్లాలోని ఇతర మీ సేవా కేంద్రాల్లో పరిస్థితి ఎలా ఉంది? అన్నదీ పరిశీలించాల్సిన ప్రశ్నగా మారుతుంది. అర్బన్, రూరల్ ప్రాంతాల్లోని కేంద్రాల్లో నిర్ణీత రుసుముల అమలు, ధ్రువపత్రాలపై సంతకాల విధానం, నిర్వాహకుల అధికార పరిధి, అనధికార వ్యక్తుల ప్రవేశం, దరఖాస్తుల నిర్వహణ వంటి అంశాలపై నమూనా తనిఖీలు జరిగితే వ్యవస్థలో ఎక్కడైనా పునరావృత సమస్య ఉందా అన్నది బయటపడే అవకాశం ఉంటుంది.

### - ఇప్పుడు కావాల్సింది తనిఖీ కాదు, తుది చర్యే

ఏసీబీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నిబంధనల ఉల్లంఘనలను గుర్తించడం అవినీతి నిరోధక చర్యల్లో ఒక ముఖ్యమైన దశ. కానీ ప్రజల దృష్టిలో అసలు ప్రశ్న అక్కడితో ముగియదు. తనిఖీలో ఏం బయటపడింది? దానిపై ఎవరు బాధ్యత వహించారు? ప్రభుత్వం ఏ చర్య తీసుకుంది? ప్రజలకు నష్టం జరిగితే దాన్ని ఎలా సరిచేశారు? అన్నదే కీలకం. ఖమ్మం మీ సేవా కేంద్రానికి సంబంధించిన ఏసీబీ తనిఖీపై తదుపరి చర్యలు ఏమిటన్నది అధికార యంత్రాంగం స్పష్టంగా వెల్లడించాల్సిన అవసరం ఎంతైనా ఉంది మరి.

## నష్టపోయిన మినుము రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి

**- కొత్తూరులో మినుము రైతులు ఆందోళన**
**- పంట నష్టాలు పరిశీలించిన రైతు సంఘం నాయకులు**



పెదపాడు (కొత్తూరు) సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ::: వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన మినుము రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం పెదపాడు మండలంలోని కొత్తూరు, కొత్తముప్పరు గ్రామాలలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు పర్యటించి నీట మునిగిన మినుము పంటను పరిశీలించారు. చనిపోయే దశలో ఉన్న మినుము పంటతో రైతులు నిరసన వ్యక్తం చేశారు. తమను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం ఉందని కృష్ణా డెల్టాలో వరి పంట వేయవద్దు ఆరుతడి పంటలు వేసుకోవాలని ప్రభుత్వం,వ్యవసాయ అధికారులు సూచనలతో రైతులు మినుము పంట సాగు చేశారని చెప్పారు. కృష్ణా డెల్టాకు గోదావరి జలాలు అందించే అవకాశం ఉన్నా ప్రభుత్వం నిర్లక్ష్యంతో మరో అవకాశం లేక రైతులు ఆరుపడి పంటలు సాగు చేశారని చెప్పారు. ఎల్ నినో తీవ్రత తగ్గి వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెప్పినా ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోలేదని, వర్షాలు వస్తే ఆరుతడి పంటలు దెబ్బతింటాయని రైతులు ఎంత చెప్పినా పెడచెవిన పెట్టారని, ఇప్పుడు ఆరుతడి పంటలు సాగు చేస్తున్న రైతులు నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. గత 4 రోజులుగా వర్షాలు కురిసి మినుముపంట నీట మునిగినా ఇంతవరకు వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన కూడా చేయలేదని, రైతులను పలకరించిన పరిస్థితి లేదని విమర్శించారు. భారీ వర్షాలకు మినుము పంటతో పాటు జిల్లాలో వరి, అరటి, కూరగాయలు, ఆయిల్ పామ్ తదితర పంటలకు నష్టం వాటిల్లిందని చెప్పారు. పంట నష్టాలను వెంటనే నమోదు చేయాలని కోరారు. పంటలు నష్టపోయిన రైతులకు,కౌలు రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని, పంటల బీమా పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.మినుము పంట నష్టపోయిన చెడుగొండి శ్రీనివాసరావు మాట్లాడుతూ వరి పంట సాగు కోసం ముందుగా నారుమడి వేసి నీరు అందక ఎండిపోయే నష్టపోయానని, అధికారుల సూచనలు మేరకు మినుము పంట వేసి అధిక వరకు వర్షాలకు నష్టపోయానని పది ఎకరాల సాగులో దాదాపు రూ.3లక్షల వరకు నష్టపోయినని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు మినుము రైతులు పాల్గొన్నారు.



## ప్రకృతి ఆరోగ్యంమే మన ఆరోగ్యం : మంజుల పత్తిపాటి

పచ్చని ప్రకృతి -- ఆరోగ్య జీవితం
పచ్చని ప్రకృతి -- ఆరోగ్య జీవితం
పచ్చని చెట్లు మనకు ప్రాణం,
ప్రకృతే మన జీవన గానం.
స్వచ్ఛమైన గాలి, నిర్మల జలం,
అవే
మన ఆరోగ్యానికి అమృత బలం చెట్టు
చెట్లను పెంచుతాం
కాలుష్యాన్ని దూరం చేద్దాం,
పర్యావరణాన్ని కాపాడుదాం..!
మొక్కలను నాటుదాం నాట్టిద్దాం
భవిత తరాలకు బాటను వేయుదాం..!
ప్రకృతి ఆరోగ్యంగా ఉంటేనే,
మన ఆరోగ్యంగా ఉంటాం...
చెత్తను చెత్త డబ్బాలో వేద్దాం..
మన పరిసరాలను పరిశుభ్రంగా
ఉంచుదాం..!
ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవ
శుభాకాంక్షలు
రచన : మంజుల పత్తిపాటి
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్
కమిటీ డైరెక్టర్. తెలంగాణ రాష్ట్రం.



## తిరువూరు ఎం విఎస్ నర్సింగ్ హోమ్ సీజ్

ఖమ్మం, కల్లూరు, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ::: ఈ ఒక్క నెలలోనే వారం రోజుల్లో ఇద్దరు పేషెంట్స్ మృతి. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ట్రీట్మెంట్ చేయొద్దని ఆదేశం. ఎం విఎస్ సర్జికల్ అండ్ మెటర్నిటీ నర్సింగ్ హోమ్ లో మహిళ మృతి. డెలివరీ తర్వాత మృతి చెందిన దీప్తి. డెంటల్ డాక్టర్ గా పని చేస్తున్న దీప్తి. వారం క్రితం ఇదే ఆస్పత్రిలో ఆపరేషన్ వికటించి కుమారి మృతి. నర్సింగ్ హోమ్ నడుపుతున్న డాక్టర్ రమేష్ తెలంగాణలోని కల్లూరు ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ గా పనిచేస్తున్న రమేష్. గతంలోనూ డాక్టర్ రమేష్ చేసిన ఆపరేషన్లు వికటించి రోగులు మృతి. మృతుల కుటుంబీకులకు డబ్బులు ఇచ్చి సెటిల్మెంట్ చేసుకుంటున్నట్లు ఆరోపణలు. డాక్టర్ రమేష్ మద్యం తాగి ఆపరేషన్లు చేస్తారనే ఆరోపణలు ఉన్నాయి.

## ‘దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న కూటమి ప్రభుత్వం..!’

**- బొమ్మూరు కలెక్టరేట్ వద్ద దివ్యాంగులకు త్రిచక్ర వాహనాల (స్కూటీల) పంపిణీ..**
- నియోజకవర్గానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు ఉచిత స్కూటీలు అందజేసిన ఎమ్మెల్యే ‘బత్తుల’..



కోరుకొండ, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);తూర్పుగోదావరి జిల్లా బొమ్మూరులోని జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో లబ్ధిదారులైన దివ్యాంగులకు ఉచిత త్రిచక్ర వాహనాలను (మోటరైజ్డ్ స్కూటీలను) రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గశీ లోని రాజానగరం మండలం కానవరం గ్రామానికి చెందిన చాపల ధనలక్ష్మి, రఘునాథపురం గ్రామానికి చెందిన మడికి జ్యోతి, సూర్యారావుపేట గ్రామానికి చెందిన దొండపాటి సుశీత, తూర్పు గోనగూడెం గ్రామానికి చెందిన తోట లలిత, లాలాచెరువు హోసింగ్ బోర్డు కాలనీ కి చెందిన బొర్రా రామలింగేశ్వర్, కోరుకొండ మండలం దోసకాయలపల్లి గ్రామానికి చెందిన చీకట్ల శ్రీనివాస్, సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామానికి చెందిన కర్రి వీర్రాజు, దొడ్డి నాగలక్ష్మికు దివ్యాంగ లబ్ధిదారులకు ఎమ్మెల్యే బలరామకృష్ణ స్వయంగా త్రిచక్ర వాహనాల (స్కూటీల) తాళాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలరామకృష్ణ మాట్లాడుతూ...దివ్యాంగులు ఎవరిపైనా ఆధారపడకుండా తమ కాళ్ళపై తాము నిలబడేందుకు, వారి నిత్య జీవితంలో ఆర్థిక మరియు సామాజిక పురోగతి సాధించేందుకు ఈ వాహనాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రతిజ్ఞాబద్ధంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్క దివ్యాంగుడికి ప్రభుత్వ పథకాలు మరియు సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. వాహనాలు అందుకున్న దివ్యాంగులు ఎమ్మెల్యేకి మరియు ప్రభుత్వానికి తమ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ప్రతినిధులు, జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## స్వర్గీయ డాక్టర్ పెద్దింటి అరుణ్ ప్రసాద్ వైకుంఠ సమారాధన..

**ఘనంగా నివాళులు అర్పించిన శిష్యబృందం..**




కోరుకొండ, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె); మండల కేంద్రమైన కోరుకొండలోని ప్రముఖ వైద్యులు స్వర్గీయ డాక్టర్ పెద్దింటి అరుణ్ ప్రసాద్ వైకుంఠ సమారాధన కార్యక్రమం శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మైదానంలో ఘనంగా నిర్వహించారు.కుటుంబ సభ్యులతో కలిసి ఆయన శిష్యులు, పీఎంపీ వైద్య మిత్రులు, స్థానిక పెద్దలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి శిష్యులు, గ్రామ పెద్దలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సన్నిహితులు, గ్రామ పెద్దలు, పీఎంపీ వైద్య మిత్రులు, ఆయన శిష్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తెలంగాణ భవన్‌లో ఘనంగా వీరనారి చిట్యాల (చాకలి) ఐలమ్మ జయంతి వేడుకలు



హైదరాబాద్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ::: ( మాధవరావు యెగినాటి, “నేటి శుభోదయ” తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కో- ఆర్డినేటర్ ) ::: హైదరాబాద్‌లోని బిఆర్ఎస్ రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యాలయం తెలంగాణ భవన్‌లో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చిట్యాల (చాకలి) ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పాల్గొని, ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు, బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేందర్ రెడ్డి, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, ఖమ్మం మాజీ జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, భద్రాచలం నాయకులు మానె రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్, నాయకులు బండారు వీరబాబుతో పాటు పలువురు బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కెరీర్ ప్రణాళికపై అవగాహన అవసరం



ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ::: తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల, ఖమ్మంలో విద్యార్థినుల భవిష్యత్ విద్యా, ఉద్యోగ, కెరీర్ అవకాశాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక కౌన్సెలింగ్, కెరీర్ మార్గదర్శక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పిఎస్ఎన్ మూర్తి, ఐడిఏఎస్, మాజీ అస్టిసెంట్ డైరెక్టర్ జనరల్, యుఐడిఏఐ (ఆధార్) పాల్గొని విద్యార్థినులకు విలువైన సూచనలు, మార్గదర్శకాలు అందించారు. మరో ముఖ్య అతిథిగా వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్, ఉస్మానియా యూనివర్సిటీ డెంటల్ కాలేజీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థినులకు సబ్జెక్ట్ నాలెడ్జ్, జనరల్ నాలెడ్జ్, అప్లికేషన్ నాలెడ్జ్ ప్రాధాన్యతను వివరించారు. కేవలం పాఠ్యపుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా, నేర్చుకున్న విషయాలను ఆచరణలో అన్వయించుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.అలాగే అకడమిక్ పరీక్షలతో పాటు పోటీ పరీక్షల్లో విజయానికి అవసరమైన ప్రణాళిక, నిరంతర అధ్యయనం, సమయపాలన, లక్ష్య నిర్దేశం, కెరీర్ ప్లానింగ్ వంటి అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. తమ ఆసక్తి, ప్రతిభకు అనుగుణంగా ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలను ముందుగానే గుర్తించి సరైన దిశలో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు.విద్యార్థినులు అతిథులతో తమ సందేహాలను పంచుకొని, విద్య, పోటీ పరీక్షలు, ఉన్నత విద్య, కెరీర్ అవకాశాలకు సంబంధించిన పలు ప్రశ్నలకు సమాధానాలు పొందారు.కార్యక్రమం విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, భవిష్యత్ లక్ష్యాలపై స్పష్టతను కల్పించే విధంగా సాగింది. కళాశాల ప్రిన్సిపాల్ సునీత, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చలో విజయవాడకు అనుమతి లేదు.. వెళ్తే క్రిమినల్ కేసులు

**ఎస్పీ బిందు మాధవ్ హెచ్చరిక**



కాకినాడ, జిల్లా సెప్టెంబర్ 26 నేటి శుభోదయ: స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయ సిబ్బంది చేపట్టాలని పిలుపునిచ్చిన “చలో విజయవాడ” ధర్నాకు ఎటువంటి అనుమతులు లేవని కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ స్పష్టం చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ మేరకు వివరాలు వెల్లడించారు. జిల్లా ప్రస్తుతం తుఫాను ప్రభావిత ప్రాంతంగా ఉన్నందున సచివాలయ సిబ్బంది అందరూ తమ విధుల్లోనే కొనసాగుతూ సహాయక చర్యల్లో పాల్గొనాలని ఎస్పీ సూచించారు. జిల్లా కలెక్టర్ అనుమతి లేకుండా ఎవరూ జిల్లా దాటి వెళ్లరాదని తెలిపారు. అనుమతి లేకుండా జిల్లా దాటి వెళ్లి ధర్నాలు లేదా ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొంటే సంబంధిత సిబ్బందిపై శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. ప్రస్తుత విపత్తు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రభుత్వ విధులకు సహకరించాలని ఎస్పీ జి. బిందు మాధవ్ విజ్ఞప్తి చేశారు.

# అక్టోబర్ 02వ తేదీన "గ్లోబల్ హార్టికల్చర్ హబ్ రాయలసీమ రైజింగ్" ప్రారంభం

**-మదనపల్లిలో కేంద్ర ఆర్థిక మంత్రి, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి తో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు**

**- "గ్లోబల్ హార్టికల్చర్ హబ్ - రాయలసీమ రైజింగ్" గురించి జిల్లాలో ఉన్న ప్రతి ఒక్క ఉద్యాన రైతులకు, పారిశ్రామికవేత్తలకు, విద్యార్థులకు, ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి**

**- ఈనెల 26వ తేదీ నుంచి అక్టోబర్ 05 వరకు అవగాహన కార్యక్రమాలు..**

**- జిల్లా నుంచి సుమారుగా రూ.2,252 కోట్లకు ప్రతిపాదనలు పంపించడం జరిగింది.**

**- ప్రెస్ మీట్ లో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**

అనంతపురం, సెప్టెంబర్ 26 నేటి శుభోదయ : అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో శనివారం "గ్లోబల్ హార్టికల్చర్ హబ్ - రాయలసీమ రైజింగ్" అంశంపై జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలుపుకొని, రాయలసీమలో "గ్లోబల్ హార్టికల్చర్ హబ్ - రాయలసీమ రైజింగ్" తో హార్టికల్చర్ ని గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లడానికి ఒక ఉద్యమం ప్రారంభిస్తున్నారని తెలిపారు. అక్టోబర్ 2వ తేదీ మదనపల్లెలో దీనికి సంబంధించిన కార్యక్రమాన్ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గారు, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రతి జిల్లాలో ఉన్న ప్రతి ఒక్క ఉద్యాన రైతులకు, పారిశ్రామికవేత్తలకు, విద్యార్థులకు, ప్రజలకు, అందరికీ విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారుగా 10 జిల్లాల్లో ఈ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ - రాయలసీమ రైజింగ్ ప్రాజెక్ట్ కింద లబ్ధి పొందడానికి అవకాశాలు ఉన్నాయని, ఈ 10 జిల్లాల్లో అనంతపురం జిల్లా కూడా భాగస్వామ్యమై ఉందన్నారు. దీనిలో భాగంగా సుమారుగా రాబోయే 3 సంవత్సరాలలో సుమారుగా లక్ష కోట్ల రూపాయలకు సంబంధించిన ఇన్వెస్ట్మెంట్లు ప్రకాశం, మార్కాపురంతో పాటు రాయలసీమ జిల్లాల్లో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ పరిధిలోకి తీసుకొచ్చారని, ఈ జిల్లాల్లో హార్టికల్చర్ క్లస్టర్లను అభివృద్ధి చేయనున్నారన్నారు. దీనిలో గవర్నమెంట్ కి సంబంధించిన ఇన్వెస్ట్మెంట్లు, ప్రైవేట్ సంస్థలకు సంబంధించిన ఇన్వెస్ట్మెంట్లు కూడా ఉన్నాయన్నారు.ఉద్యానవన శాఖ, జల వనరుల శాఖ, పంచాయతీరాజ్ శాఖ మరియు ఇతర అనుబంధ శాఖల సమన్వయంతో రాయలసీమ ప్రాంతాన్ని ప్రపంచ స్థాయి ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగింది అన్నారు. మొత్తం ఒక లక్ష కోట్ల పెట్టబడిలో ప్రభుత్వ పెట్టుబడి 40,000 కోట్ల రూపాయలు కాగా, అందులో ఉద్యానవన రంగం కింద హార్టికల్చర్ కి సంబంధించిన పనులు చేయించుకోవడానికి 14,906 కోట్లు, నీటిపారుదల మౌలిక సదుపాయాల కోసం (హెచ్ఎన్ఎస్ఎస్ కావచ్చు, కెనాల్ నెట్వర్క్, మోడర్నైజేషన్, డ్రిప్ ఇరిగేషన్) ఇరిగేషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కి 20,844 కోట్లు,



గ్రామీణ స్థాయి నుండి రోడ్లని బాగు చేయాలనే ఉద్దేశంతో రూరల్ రోడ్ డెవలప్మెంట్ వర్క్స్ కూడా సుమారుగా 4,562 కోట్ల రూపాయలు కేటాయించడం జరుగుతుందని, అన్నీ కలుపుకుంటే 40 వేల కోట్లు ప్రభుత్వ తరఫు నుంచి (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు) గౌరవ సీఎం గారి ఆదేశాల మేరకు ఈ యొక్క 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' అని ఒక ప్రాజెక్ట్ ప్రిపేర్ చేయడం జరిగిందని, దాన్ని అక్టోబర్ 2వ తేదీన ప్రారంభిస్తారన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం తరఫు నుంచి 40 వేల కోట్లు ఇన్వెస్ట్మెంట్ చేసినప్పుడు, దానితో కలుపుకొని ప్రైవేట్ సంస్థలు, కంపెనీలు, పారిశ్రామికవేత్తలు అందరి దగ్గర నుంచి కూడా సుమారుగా 60 వేల కోట్లు ఇన్వెస్ట్మెంట్ వస్తుందని గవర్నమెంట్ దృష్టిలో ఉందన్నారు. ఇవి రెండూ కలుపుకున్నట్లయితే సుమారుగా లక్ష కోట్ల రూపాయల దాకా మొత్తం ఈ 10 జిల్లాల్లో అమలు చేయబోతున్నామన్నారు.అనంతపురం జిల్లాలో కూడా దీనికి సంబంధించి సుమారుగా 41 క్లస్టర్లలో, 32 మండలాల్లో ఎలిజిబుల్ క్లస్టర్లను ఎంపిక చేయడం జరిగిందని, ఇవి 338 ఆర్ఎస్కే (ూఖ) పరిధిలో --- మేజర్ గా హార్టికల్చర్ ఇంపార్టెంట్ గా ఉన్న ఆర్ఎస్కేలను ఎంపిక చేసి, దాని నుంచి 41 క్లస్టర్లు చేయడం జరిగిందన్నారు.రాబోయే కాలంలో ఎల్.నినో లాంటి ఇబ్బందులు వచ్చినప్పుడు, క్లైమేట్ కి ఇబ్బంది లేకుండా పంటలు పండించే విధానం మీద దృష్టి పెడతామని, వాతావరణ మార్పులను తట్టుకునే నూతన ఉద్యాన పంటల విస్తీర్ణం పెంపు మరియు మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా పంటల వైవిధ్దీకరణ కోసం 896 హెక్టార్లలో 369 కోట్ల రూపాయలు కేటాయించారని, ఇంకొక లక్ష హెక్టార్ల దాకా సుమారుగా 880 కోట్లతో సూక్ష్మ నీటిపారుదల మరియు ఫర్టిగేషన్ విస్తరణ కోసం కేటాయించారని, ఇవన్నీ కలుపుకున్నట్లయితే సుమారుగా 2,252 కోట్లకు ప్రతిపాదనలు పంపించడం జరిగిందని, దీనికి సంబంధించిన పూర్తి వివరాలు, డిపిఆర్ లన్నీ కూడా ప్రిపేర్ చేయడం జరిగిందన్నారు. ఇందులో హార్టికల్చర్, ఎపిఎంఐపి ఎపిసిఎన్ఎఫ్ ఈ మూడింటిని అనుసంధానం చేసుకొని, ఇరిగేషన్ డిపార్ట్మెంట్ సహకారాన్ని తీసుకొని, నీళ్లు సక్రమంగా ఇవ్వడానికి ఈ మూడు డిపార్ట్మెంట్లను కలుపుకొని ముందుకు తీసుకెళ్తామన్నారు.రాయలసీమలో పండిన పంటలని గ్లోబల్ మార్కెట్ కి తీసుకెళ్లాలి, అక్కడ మంచి రేటు రావాలి, మంచి ఆదాయం రావాలనే ఉద్దేశంతోనే ఈ ప్రణాళిక చేశారని, కాబట్టి జిల్లాల్లో ఉన్న హార్టికల్చర్ రైతులందరికీ దీనిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి గారు నేటి నుంచి రాబోయే అక్టోబర్ 5 వరకు జిల్లా వ్యాప్తంగా ఉద్యాన రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారని, స్కూల్స్ ద్వారా "నా జిల్లా - నా పంట", వ్యాసరూప పోటీలు, లోకల్ ఫ్రూట్స్ గురించి పిల్లలకు తెలియజేయడం, కాలేజీల్లో "హార్టికల్చర్ టెక్ ఛాలెంజ్" ద్వారా బజ్ క్రియేట్ చేయడం, సెప్టెంబర్ 29 నుండి 41 క్లస్టర్లలో రైతుల కోసం డెమోన్స్ట్రేషన్స్, ఫెర్టిగేషన్, ఫార్మ్ పాండ్స్ వంటి వాటిపై "తోట బడి" పాఠశాలల ద్వారా అవగాహన సదస్సులు నిర్వహించడం, ఐ.అండ్.పిఆర్ డిపార్ట్మెంట్ ద్వారా ప్రచార రథం, కళాజాతాలు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ ద్వారా 60-90 సెకన్ల వీడియోల ద్వారా ప్రచారం చేయడం జరుగుతుందన్నారు. రైతులు డిమాండ్ ఆధారిత పంటలు సాగు చేసి, నాణ్యత పెంచి, గ్లోబల్ మార్కెట్ను అందిపుచ్చుకోవాలని, పంట దిగుబడితో పాటు నాణ్యతను పెంచడం ద్వారా రైతుల ఆదాయం పెంపొందుతుందని, ఈ విషయాన్ని ప్రతి రైతుకూ చేరవేయాలని కోరారు.ఈ ప్రెస్ మీట్ లో జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, ఏపీఎమ్ఐపి పిడి రఘునాథరెడ్డి, ఇంచార్జి హార్టికల్చర్ జిల్లా అధికారి ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.

## మర్రిపాక గ్రామంలో అంగన్వాడీ సేవలు, సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం

**సీడీపీఓ పూర్ణిమ ఆధ్వర్యంలో నిర్వహణ**

**- ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచన**



కాకినాడ జిల్లా, జగ్గంపేట సెప్టెంబర్ 26 నేటి శుభోదయ:జగ్గంపేట మండలం మర్రిపాక గ్రామంలో శనివారం సీడీపీఓ పూర్ణిమ ఆధ్వర్యంలో అంగన్వాడీ సేవలు, మహిళా--శిశు సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ పూర్ణిమ మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రం కేవలం పిల్లలకు ఆహారం అందించే స్థలం మాత్రమే కాదని, పిల్లల ఆరోగ్యం, పోషణ, ప్రీ-స్కూల్ విద్య, తల్లుల ఆరోగ్యం, కుటుంబ సంక్షేమానికి సంబంధించిన కీలక కేంద్రంగా పనిచేస్తుందని తెలిపారు. చిన్నారుల జీవితంలోని తొలి సంవత్సరాలు అత్యంత ముఖ్యమైనవని, ఈ దశలో సరైన పోషకాహారం, మంచి అలవాట్లు, ఆటల ద్వారా నేర్చుకునే అవకాశాలు, ప్రేమతో కూడిన వాతావరణం అవసరమని పేర్కొన్నారు.పిల్లల తల్లిదండ్రులు, తల్లుల కమిటీ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, సూపర్వైజర్లు, గ్రామ ప్రజలు సమిష్టిగా కృషి చేస్తే అంగన్వాడీ కేంద్రాలు మరింత అభివృద్ధి చెందుతాయని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజూ అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని, వారి ఎదుగుదలను గమనిస్తూ కార్యకర్తలతో నిరంతరం సంప్రదింపులో ఉండాలని సూచించారు. "మన పిల్లల భవిష్యత్తు -- మన అంగన్వాడీ నుంచే ప్రారంభం" అనే సందేశంతో ప్రతి ఒక్కరూ అంగన్వాడీని ఆదర్శ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ మండల అధ్యక్షుడు పల్లా రాము మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన (ూవీవీవ్) పథకం కింద అర్హులైన గర్భిణీలకు ఆర్థిక సహాయం అందుతుందని వివరించారు. అలాగే మిషన్ వాత్సల్య పథకం 18 సంవత్సరాల లోపు అనాథ పిల్లలకు వర్తిస్తుందని, అర్హులైన వారు సీడీపీఓ కార్యాలయాన్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గర్భిణీలు, బాలింతలు, ప్రీ-స్కూల్ పిల్లలకు సేవలు అందిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పైల రామకృష్ణ, మాజీ సర్పంచ్ బండారు చిన్నయ్య, గ్రామ పెద్దలు కాపారపు ప్రకాశం, వీరాంజనేయులు, సెక్రటరీ ఉషారాణి, మహిళా పోలీస్ మహాలక్ష్మి, ఎంఎల్హెచ్పీ శిరీష, సూపర్వైజర్ అమ్మాజీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని పరిశీలించిన దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్



విజయవాడ, సెప్టెంబర్ 26 (నేటి శుభోదయ):-భారీ వర్షాల కారణంగా ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని శనివారం ఉదయం ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దేవస్థాన అధికారులు, ఇంజినీరింగ్ సాంకేతిక నిపుణుల బృందంతో కలిసి ఆయన ఘాట్ రోడ్డులోని ప్రభావిత ప్రాంతాన్ని, రక్షణ గోడలను, కొండ వాలు భాగాలను నిశితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ కమిషనర్ మాట్లాడుతూ రానున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ భక్తుల రక్షణే అత్యంత ప్రధానమని స్పష్టం చేశారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు ఎట్టి పరిస్థితుల్లోనూ పునరావృతం కాకుండా పటిష్టమైన, శాశ్వత ప్రత్యామ్నాయ రక్షణ చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ అధ్యయనం ఆధారంగా కార్యాచరణ.గతంలో ఇంద్రకీలాద్రి కొండచరియల స్థిరత్వంపై బెంగళూరుకు చెందిన ప్రతిష్టాత్మక నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ శాస్త్రవేత్తలు సమగ్ర అధ్యయనం చేసి సమర్పించిన సాంకేతిక నివేదిక ఆధారంగా చేపట్టవలసిన రక్షణ పనులపై ఘటనా స్థలంలోనే ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా చీ×=వీ శాస్త్రవేత్త జైన్, దేవాదాయ శాఖ సాంకేతిక సలహాదారు సుబ్బారావు, చీఫ్ ఇంజినీర్ శేఖర్, ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్‌లతో కలిసి కమిషనర్ కీలక అంశాలపై చర్చించారు. వర్షపు నీటి ఊట కారణంగా పట్టు కోల్పోయిన వదులైన రాళ్లను శాస్త్రీయ పద్ధతిలో తొలగించడం, కొండ వాలును పటిష్టం చేసేందుకు అవసరమైన 'రాక్ బోల్టింగ్' (=శీఎ౧ దీశీశ్రీఅఅస్త్ర), షాట్‌క్రీటింగ్ పనులను పరిశీలించారు.కొండ పైనుండి రాళ్లు రోడ్డుపైకి రాకుండా ఏర్పాటు చేసిన హై-టెన్సైల్ ఐరన్ ఫెన్సింగ్ నెట్లను (=శీఎ౧-టుశ్రీశ్రీ చీవ్అఅస్త్ర) సరిచూసి, అవసరమైన చోట్ల నూతన రక్షణ నెట్లను అమర్చేందుకు గానూ, కొండపై భాగం నుండి వర్షపు నీరు కొండచరియల్లోకి ఇంకి ఒత్తిడి పెంచకుండా, ప్రత్యేక డ్రైనేజీ చానల్స్ ద్వారా నీరు నేరుగా కిందకు వెళ్లేలా చర్యలు తీసుకోవడానికి చీ×=వీ వారి సూచనలు మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.దసరా మహోత్సవాల నాటికి ఘాట్ రోడ్డు పూర్తిగా సురక్షితంగా ఉండేలా అన్ని సాంకేతిక, ఇంజినీరింగ్ చర్యలను సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ సమీక్షలో చీ×=వీ శాస్త్రవేత్త జైన్, దేవాదాయ సాంకేతిక సలహాదారు సుబ్బారావు, చీఫ్ ఇంజినీర్ శేఖర్, ఆలయ ఈవో వి.కె. శీనా నాయక్, ఇతర ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రిపై అన్నదాన విభాగాన్ని ఆకస్మికంగా సందర్శించిన దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్



విజయవాడ, సెప్టెంబర్ 26 (నేటి శుభోదయ):-శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలోని అన్నదాన విభాగాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అన్నప్రసాదం తయారీ విధానం, వంటశాలలోని శుచి, శుభ్రత, భక్తులకు వడ్డిస్తున్న భోజన నాణ్యతను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అన్నదాన ప్రాంగణంలో భక్తులకు కల్పిస్తున్న తాగునీరు, సీటింగ్ తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. రానున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని అన్నదానానికి విచ్చేసే లక్షలాది మంది సామాన్య భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఈవో శీనా నాయక్ కు సూచించారు. ముఖ్యంగా వంటశాల, భోజనశాలల్లో పరిశుభ్రత ప్రమాణాల విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలని, అత్యున్నత శ్రద్ధ వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అన్నదాన విభాగ పరిశీలన అనంతరం దేవస్థాన ఈవో చాంబర్‌లో దేవాదాయ శాఖ కమిషనర్ అధ్యక్షతన ప్రత్యేక సమీక్షా సమావేశం జరిగింది. భారీ వర్షాల కారణంగా ఘాట్ రోడ్డులో కొండచరియలు జారిన నేపథ్యంలో చేపడుతున్న తాత్కాలిక, శాశ్వత రక్షణ పనులపై ఇంజినీరింగ్ అధికారులు, బెంగళూరుకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ (చీ×=వీ) నిపుణుల బృందంతో ఆయన సమగ్రంగా చర్చించారు. భవిష్యత్ పనులను ప్రణాళిక ప్రకారం చేయాలని ఆదేశించారు. దసరా ఉత్సవాల నాటికి భక్తుల రాకపోకలకు ఘాట్ రోడ్డును పూర్తి సురక్షితంగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో చీ×=వీ శాస్త్రవేత్త శ్రీ ప్రసన్న జైన్, దేవాదాయ సాంకేతిక సలహాదారు శ్రీ సుబ్బారావు, చీఫ్ ఇంజినీర్ శ్రీ శేఖర్, దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్. రమ, ఇతర ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## డ్రైనేజ్ పంపింగ్ స్టేషన్ పునరుద్ధరణ పనులు..

**ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక చర్యలు వియంసి కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ, సెప్టెంబర్ 26 (నేటి శుభోదయ):-విజయవాడ నగరంలోని వెటర్నరీ కాలనీ నుంచి ఆటోనగర్ ఎస్టీపీకి మురుగునీటిని తరలించే డ్రైనేజ్ పంపింగ్ స్టేషన్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్యను పునరుద్ధరించేందుకు తాత్కాలికంగా పంపింగ్ స్టేషన్‌ను నిలిపివేసి మరమ్మతు పనులు చేపడుతున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు.డ్రైనేజ్ పంపింగ్ స్టేషన్‌ను తాత్కాలికంగా నిలిపివేయడం వల్ల బ్యాక్ ఫ్లో కారణంగా వెంకటేశ్వరరావు నగర్, ఈఎస్ఐ హాస్పిటల్ జంక్షన్, వెటర్నరీ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ పరిసర ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పొంగే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు.కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ఆయా ప్రాంతాల్లో గల్పర్లను ఏర్పాటు చేసి, మురుగునీరు బయటకు ప్రవహించకుండా ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇంజనీరింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మురుగునీటిని గల్పర్ల సహాయంతో నియంత్రించే చర్యలు చేపడుతున్నారని తెలిపారు.డ్రైనేజ్ పంపింగ్ స్టేషన్ పునరుద్ధరణ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు సిబ్బంది చర్యలు చేపడుతున్నారని, సుమారు 24 గంటల సమయం పట్టే అవకాశం ఉందని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. పనులు పూర్తయ్యే వరకు సంబంధిత ప్రాంతాల ప్రజలు నగరపాలక సంస్థకు సహకరించాలని ఆయన కోరారు.ప్రజలకు అసౌకర్యం కలగకుండా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకునేలా ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు కమిషనర్ తెలిపారు.**

## వర్షాల నేపథ్యంలో నగరంలో విస్తృత పారిశుద్ధ్య పనులు

**-- ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు**




విజయవాడ, సెప్టెంబర్ 26 (నేటి శుభోదయ):-విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు, కురిసిన వర్షాల నేపథ్యంలో నగరంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత ముమ్మరం చేశారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ శనివారం ఉదయం దోర్నకల్ రోడ్డు, ప్రకాశం రోడ్డు, ఐజీఎంసీ స్టేడియం, రెడ్ సర్కిల్, లతా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు.చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల గ్లోరీ సూచనల మేరకు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి. అన్నపూర్ణ ఆధ్వర్యంలో ప్రజారోగ్య విభాగం పారిశుద్ధ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో ఈ పనులను నిర్వహించారు. గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాల కారణంగా కాలువల్లో పేరుకుపోయిన సిల్ట్, వ్యర్థాలను తొలగించడంతో పాటు నీటి నిల్వలు ఏర్పడకుండా అవసరమైన పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.వర్షపు నీరు సజావుగా ప్రవహించేలా కాలువల్లో పూడికను తొలగించడం, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను మెరుగుపరచడం, మురుగునీరు నిల్వ ఉండకుండా చూడటంపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా ప్రధాన రహదారులు, ఆసుపత్రులకు వెళ్లే మార్గాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ సిబ్బంది విస్తృతంగా శ్రమించారు.వర్షాకాలంలో నీటి నిల్వల కారణంగా దోమలు వృద్ధి చెంది ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉన్నందున, నగరంలోని అన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. ప్రజలు కూడా తమ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకుంటూ, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో నగరపాలక సంస్థకు సహకరించాలని అధికారులు సూచించారు.

## ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యమే లక్ష్యం 63వ డివిజన్ సుందరయ్య నగర్‌లో 4 సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ, సెప్టెంబర్ 26 (నేటి శుభోదయ):- 63వ డివిజన్ సుందరయ్య నగర్ రామాలయం పక్క వీధిలో 4 సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు స్థానిక మహిళలతో కలిసి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ విజయవాడ సెంట్రల్ లో ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు డివిజన్ నాయకులు, పార్టీ డివిజన్ అధ్యక్షులు నిరంతరం ప్రజల మధ్య ఉంటూ కృషి చేస్తున్నారని, మొన్న తుఫాను కారణంగా నగరంలో భారీ వర్షాలు కురిసిన సమయంలో సైతం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం వరకు వర్షాన్ని లెక్కచేయకుండా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల సమస్యలను పరిశీలించామని, గుర్తించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టేలా కృషి చేశామని తెలిపారు.63వ డివిజన్ సుందరయ్య నగర్‌లోని 4 రోడ్లలో దీర్ఘకాలంగా డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉండేదని, కొద్దిపాటి వర్షం పడినా మురుగునీరు ఇళ్లలోకి చేరి స్థానిక ప్రజలు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని, ఈ సమస్యను స్థానిక మహిళలు, ప్రజలు తన దృష్టికి తీసుకురావడంతో సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామని ఉమా తెలిపారు.ఇచ్చిన హామీ మేరకు డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులను చేపట్టి పనులను వేగవంతంగా పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. దీంతో స్థానిక ప్రజలు, మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. 26 నెలల కాలంలో సెంట్రల్ లో సుమారు రూ.6.50 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, కల్వర్టులు, రోడ్లు, తాగునీటి సదుపాయాలు, కమ్యూనిటీ హాళ్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాల భవనాలు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చామని పేర్కొన్నారు.ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయడమే తమ బాధ్యతగా భావిస్తున్నామని, పదవులు, హోదాలు ముఖ్యమేమీ కాదని, ప్రజలకు సేవ చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు . సెంట్రల్ నియోజకవర్గ ప్రజల సంతృప్తి, అభివృద్ధి పనులే ప్రజా ప్రతినిధుల పనితీరుకు నిదర్శనమని , రాబోయే రోజుల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత అంకితభావంతో పనిచేస్తామని ఉమా తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లు మోదుగుల తిరుపతమ్మ, పైడి తులసి, డివిజన్ అధ్యక్షులు లబ్బా వైకుంఠం, కోలా శ్రీను, మోత్కూరి కాసిం, ూ౧ మెహర్, దుర్గాసి రాము, భీమన ఆంజనేయులు, మోదుగుల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## భారత అంతరిక్ష ప్రగతిని ప్రత్యక్షంగా తెలుసుకున్న విద్యార్థులు,సైన్స్ అండ్ టెక్నాలజీపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచడమే మా లక్ష్యం,భవిష్యత్ శాస్త్రవేత్తలకు



విజయవాడ, సెప్టెంబర్ 26 (నేటి శుభోదయ):-అజిత్‌సింగ్ నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య విదుని స్టేడియంలో శనివారం ఆధ్వర్యంలో నిర్వహించిన "రాజ్యాంగ శక్తి జ్ఞానయజ్ఞం" అంతరిక్ష వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతదేశం రాకెట్ సాంకేతికతలో సాధించిన ప్రగతిని విద్యార్థులకు సరళమైన విధానంలో వివరించారు. చిన్న స్థాయి రాకెట్ల నుంచి ప్రస్తుత భారీ సామర్థ్యం కలిగిన రాకెట్ల తయారీ వరకు దేశం సాధించిన సాంకేతిక అభివృద్ధిని విద్యార్థులకు ప్రదర్శనలు, నమూనాల ద్వారా వివరించారు.గతంలో అనేక సాంకేతిక పరిజ్ఞానాల కోసం విదేశాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉండగా, నేడు భారత శాస్త్రవేత్తలు స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో అంతరిక్ష రంగంలో భారీ విజయాలు సాధిస్తున్నారని కార్యక్రమ నిర్వాహకులు విద్యార్థులకు వివరించారు. ఉపగ్రహ సమాచార వ్యవస్థల అభివృద్ధి ద్వారా కమ్యూనికేషన్, విద్య, వాతావరణం, వ్యవసాయం తదితర అనేక రంగాల్లో సాంకేతిక విప్లవం చోటుచేసుకున్న విషయాన్ని తెలియజేశారు.ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని రాకెట్ నమూనాలు, అంతరిక్ష సాంకేతికతకు సంబంధించిన ప్రయోగాలను ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రాజ్యాంగ శక్తి జ్ఞానయజ్ఞం బస్సులోని నమూనాలు, ప్రయోగాల ద్వారా విద్యార్థులకు క్లిష్టమైన అంతరిక్ష సాంకేతిక అంశాలను సులభంగా అర్థమయ్యేలా వివరిస్తున్నారు. విద్యార్థుల్లో చిన్నవయస్సు నుంచే సైన్స్, టెక్నాలజీపై ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్యే బొండా ఉమా తెలిపారు. భవిష్యత్‌లో మరింత మంది విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోట, ఇస్రో అధికారులు మురళి అనిల్, తదితర సిబ్బందితోపాటు విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు జెల్లం జైపాల్, సెంట్రల్ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు వేల్పుల రాజేష్, టిడిపి డివిజన్ ఇంచార్జ్ పెరియా సోమేశ్వరరావు, టిడిపి డివిజన్ అధ్యక్షుడు దుర్గారావు, మాజీ కార్పొరేటర్ పైడి తులసి, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా స్ఫూర్తిని ఐక్యతను పెంపొందించడానికి క్రీడా పోటీలు దోహదం

**ఫైర్ అండ్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అమరావతి చాప్టర్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే గద్దె**



విజయవాడ, సెప్టెంబర్ 26 (నేటి శుభోదయ):- ఫైర్ అండ్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అమరావతి చాప్టర్ లోని సభ్యుల మధ్య క్రీడా స్ఫూర్తిని ఐక్యతను పెంపొందించడానికి క్రీడా పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు.శనివారం ఉదయం తూర్పు లోని సాయి సందీప్ బ్యాడ్మింటన్ అకాడమీ ఆవరణలో ఫైర్ అండ్ సెక్యూరిటీ ఆఫ్ ఇండియా అమరావతి చాప్టర్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. ఈ పోటీల ను ఎమ్మెల్యే గద్దె రామ మోహన్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫైర్ అండ్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అమరావతి చాప్టర్ ఆధ్వర్యంలో ఈ విధంగా బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఫైర్ అండ్ సెక్యూరిటీస్ పై అవగాహన కోసం ఈ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ రకాలుగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు రక్షణ కల్పిస్తున్నారని చెప్పారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి ఇలాంటి ఆటల పోటీలు నిర్వహించడంతోపాటు విద్యార్థులకు ఉపకార వేతనాలను అందజేయడం సంతోషకరమని అన్నారు. ప్రజలకు ఫైర్ అండ్ సెంక్యూరిటీ పై అవగాహన కల్పించడానికి ఇలాంటి క్రీడా పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయని అన్నారు. గత 25 సంవత్సరాలుగా ఈ స్వచ్ఛంద సంస్థ ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తోందని చెప్పారు. అభివృద్ధి చెందుతున్న మనలాంటి దేశాలకు ఇలాంటి స్వచ్ఛంద సంస్థల సేవలు మరింత అవసరమని ఎమ్మెల్యే గద్దె చెప్పారు. తోటి వారికి సేవ చేయాలనే ఉద్దేశంతో ఈ సంస్థను స్థాపించి సమర్థవంతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఫైర్ అండ్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. ఫైర్ అండ్ సెక్యూరిటీ అమరావతి చాప్టర్ ప్రెసిడెంట్ కాంతారావు మాట్లాడుతూ 2017వ సంవత్సరంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదగా అమరావతి చాప్టర్ ప్రారంభమైందని, ఆ రోజు నుంచి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. గత ఏడాది బ్యాడ్మింటన్ పోటీలను షెషన్-1 నిర్వహించామని, ఇప్పుడు షెషన్-2 బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నామని చెప్పారు. తమ అసోసియేషన్ లోని సభ్యులందరూ ఈ క్రీడా పోటీలలో పాల్గొంటున్నారని అన్నారు. ఫైర్ సర్వీసెస్, సెక్యూరిటీ సంబంధించిన ఉద్యోగులు, ఇంజనీర్లు, ఆర్కిటెక్చర్లు ఎలక్ట్రానిక్స్ ఎక్విప్మెంట్ ప్రొవైడర్స్ అసోసియేషన్లో సభ్యులుగా ఉన్నారని చెప్పారు. అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించడం తమ అసోసియేషన్ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. తమ అసోసియేషన్ లోని సభ్యుల మధ్య క్రీడా స్ఫూర్తిని ఐకమత్యాన్ని పెంపొందించడానికి ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

## భక్తిశ్రద్ధలతో గణపతి మహోత్సవాల అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న బుద్ధా వెంకన్న



విజయవాడ, సెప్టెంబర్ 26 (నేటి శుభోదయ):- పశ్చిమ నియోజకవర్గం ఊర్మిళా నగర్‌లో శనివారం గణపతి మహోత్సవాల అన్నదాన కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ బుద్ధా వెంకన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినాయకుని ఆశీస్సులు అందరిపై ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, భక్తులతో ఆత్మీయంగా మమేకమయ్యారు. వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖశాంతులు కలగాలని కోరుకున్నాను అని బుద్ధా వెంకన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదాల తిరుపతిరావు, వాసుదేవ్, ప్రసన్న లక్ష్మి, కొనికి కొండయ్య, బంక శ్రీనివాస్ రెడ్డి, మహేంద్ర నాని, స్థానిక భక్తులు తదితరులు పాల్గొన్నారు

## సీపీని కలిసి వినతిపత్రం అందజేసిన వైసీపీ ప్రతినిధి బృందం



విజయవాడ, సెప్టెంబర్ 26 (నేటి శుభోదయ):-కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైసీపీ శ్రేణులపై సాగిస్తున్న కక్షసాధింపు చర్యలు, పోలీసుల అక్రమ కేసుల వ్యవహారం, డిఎస్సి నిరసన కార్యక్రమంలో వైసిపి నేతల పై మోపిన అక్రమ కేసుల వ్యవహారం పై విజయవాడ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో వైసీపీ నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు వైసిపి నేతలతో కలిసి పాల్గొన్నారు.

## సర్వజ్ఞ సూపర్ కిడ్స్‌లో ఘనంగా “ఫైర్‌లెస్ కుకింగ్, డాడ్స్ అండ్ కిడ్స్” కార్యక్రమం



ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :: సర్వజ్ఞ సూపర్ కిడ్స్‌లో చిన్నారుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించడంతో పాటు తండ్రులు, పిల్లల మధ్య అనుబంధాన్ని మరింత బలపరిచే ఉద్దేశంతో “ఫైర్‌లెస్ కుకింగ్ -- డాడ్స్ అండ్ కిడ్స్” కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.మంటను ఉపయోగించకుండా తండ్రులు తమ చిన్నారులతో కలిసి వివిధ రకాల రుచికరమైన, ఆరోగ్యకరమైన వంటకాలను తయారు చేశారు. పిల్లలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. తండ్రులు, పిల్లలు కలిసి వంట చేయడం ద్వారా సహకారం, పరిశుభ్రత, ఆహారంపై అవగాహన, స్వయం ఆధారితత వంటి విలువలు పిల్లల్లో పెంపొందాయి.తండ్రుల సృజనాత్మకత, పిల్లల ఉత్సాహం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమం తల్లిదండ్రులను పాఠశాల కార్యకలాపాల్లో భాగస్వాములను చేస్తూ, పిల్లల సమగ్ర అభివృద్ధికి పాఠశాల అందిస్తున్న అవకాశాలకు నిదర్శనంగా నిలిచింది.ఈ సందర్భంగా సర్వజ్ఞ చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్, డైరెక్టర్ నీలిమ కార్యక్రమంలో పాల్గొన్న తండ్రులు, చిన్నారులను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు కుటుంబ విలువలను పెంపొందించడంలో ఎంతో ఉపయోగపడతాయని వారు పేర్కొన్నారు.కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయ బృందాన్ని కూడా వారు అభినందించారు.

## తెలంగాణ పోరాట జ్యోతి, వీరనారి చాకలి ఐలమ్మ

**: మేకల మల్లి బాబు యాదవ్**



ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ::: భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఝాన్సీ లక్ష్మీబాయి పోరాటం చేస్తే, తెలంగాణ కోసం వీరనారి చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య లాంటి వారు చేసిన అసాధారణ పోరాట ఫలితంగానే నేడు మనం తెలంగాణ ఫలితాలు అనుభవిస్తున్నామని డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ తెలిపారు. కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా బీసీ కులాల ప్రతినిధుల సమక్షంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ నిజాం నిరంకుశ పరిపాలనలో గ్రామాలలో దొరలు భూస్వాములు దేశముఖ్ లు ప్రజలను, మహిళలను బానిసలుగా చేసి వెట్టి చాకిరి పేరుతో ప్రజల శ్రమను దోపిడీ చేస్తూ, రైతుల భూములను అక్రమంగా లాక్కొని, ఉచితంగా పనులు చేయించు కుంటున్న ఆ రోజులలో అందరూ భయపడి ఊరుకున్నారు కానీ తనకున్న 4ఎకరాల భూమిని ఇవ్వనని చావనైన చస్తాను గాని భూమి ఇవ్వనని, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా దొరల అహంకారానికి వ్యతిరేకంగా ఎదురొడ్డి నిలబడి పోరాటం చేసిన చాకలి ఐలమ్మకు మద్దతుగా చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు, ఆంధ్ర మహాసభ కమ్యూనిస్టు పార్టీల సహకారంతో తిరుగుబాటు చేశారు. ఐలమ్మకు చదువు లేకపోయినా ఆత్మ గౌరవం కోసం పోరాటం చేసింది. భూమి మనది, శ్రమ మనది, పంటమన్నది. అనుభవించేది పాలించేది దొరలా అని ప్రశ్నించే మొదటి గొంతుక అయింది చాకలి ఐలమ్మ అని కొనియాడారు. సమాజంలో జరిగే ప్రతి అన్యాయానికి ఒక మహిళగా ఆమె ఒక్కతే ఆదర్శం అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు, ముదిరాజ్ సంఘం మండల నాయకులు శీలం పుల్లయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాటిబండ్ల ప్రసాద్, వడ్డెర సంఘం నాయకులు తురక బిక్షం చల్ల మల్లయ్య, ఓబీసీ జిల్లా నాయకులు చల్ల మల్లయ్య, చింతలపెద్ద వెంకయ్య,బాధావత్ నాగరాజు, జక్కంపూడి వెంకటేశ్వర్లు, గుగులోత్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## మోడీ పాలనను నిరసిస్తూ జైల్ భరో

**- ధరల నియంత్రణలో విఫలం**

**- రేవంత్, హామీలు అమలు చేయకపోతే ఆందోళన**

**- అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి**

**- సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో బాగం**



ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ::: మోడీ పాలనను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా విస్తృత పద్ధతుల్లో ఆందోళన నిర్వహించనున్నట్లు సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. అక్టోబర్, నవంబర్ మాసాల్లో మోడీ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరుస్తూ డిసెంబర్ రెండు, మూడు, నాలుగు తేదీలలో జైల్భరో కార్యక్రమాన్ని నిర్వహించి ఐదు లక్షల మంది అరెస్టు కానున్నట్లు ఆయన తెలిపారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం ఏనుగు గాంధీ అధ్యక్షతన స్థానిక గిరిప్రసాద్ భవన్లో జరిగింది. సమావేశంలో బాగం మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ రంగ సంస్థలను బిజెపి అనుబంధ సంఘాలుగా మార్చివేశారని సిబిఐ, ఎన్ఫోర్స్మెంట్, ఎన్నికల సంఘం సహా వివిధ సంస్థలు ‘స్వతంత్రను కోల్పోయాయన్నారు. బిజెపి పాలన ప్రజలకు వ్యతిరేకంగా సాగుతుందని ఆయన ఆరోపించారు. కార్పొరేట్ల కోసం సాగుతున్న ఈ పాలనను నిరసిస్తూ ఆందోళన చేపట్టనున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన అందరికీ ఇండ్లు ఇవ్వాలని హేమంతరావు డిమాండ్ చేశారు. కేవలం కాంగ్రెస్ పార్టీ సిఫారసు చేసిన వారికి మాత్రమే ఇండ్లు ఇచ్చి అసలైన పేదలకు అన్యాయం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా కొన్ని హామీలకు సంబంధించి కనీసం ఊసెత్తడం లేదన్నారు. హామీల అమలుకు కార్యాచరణ ప్రకటించాలని హేమంతరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో భూ బాగోతం నడుస్తుందని అధికార, విపక్షాల మధ్య విమర్శ, ప్రతి విమర్శలలో ప్రజా సమస్యలు పక్కదారి పడుతున్నాయన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పరస్పర ఆరోపణల ద్వారా అక్రమ ఆస్తుల వ్యవహారం వెలుగు చూస్తుందని కానీ పేదల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ లతో పాటు కాంగ్రెస్ ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి అమలు కాలేదని ఆయన తెలిపారు. ఎల్నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది రైతులకు తీవ్ర నష్టం వాటిల్లనుందని రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రత్యేక కార్యాచరణను ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. వర్షాల కారణంగా వృథాగా పోతున్న వర్షపు నీటిని చెరువులకు మళ్లించి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నీటిని సంరక్షించాలని ఆయన కోరారు. సాగర్ ఎడమ కాలువ ద్వారా జిల్లాలో చెరువులు, కుంటలు నింపాలని ఇందు కొరకు ఒక ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. అనేక దశాబ్దాలుగా పేదలు, దళితులు సాగు చేసుకుంటున్న భూములపై వారికే హక్కు కల్పించాలని -ఆయన కోరారు. ఐదారు దశాబ్దాలుగా పేదలు సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వ భూములుగా చూపడం అన్యాయమన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులను బతకనియని స్థితిని నెట్టివేశాయని ఆయన తెలిపారు. ఒక పక్క సంక్షేమ పథకాలు నిలిచిపోయి మరో పక్క నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆరోపించారు. భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజల పక్షాన సమరశీల పోరాటాలకు సిద్ధమైందని ఆయన ప్రకటించారు. ఒక పక్క పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేస్తూ మరో పక్క ప్రజా ఉద్యమ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు హేమంతరావు తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కార్యక్రమాల నివేదికను ప్రవేశపెట్టగా ఈ సమావేశంలో సిపిఐ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్ ను పరిశీలించిన చైర్ పర్సన్ బల్లా పల్లవి



అనంత పురం సెప్టెంబర్ 26 నేటి శుభోదయ: అనంతపురం నగర సమీపంలో ఉన్న మార్కెట్ యార్డ్ ను చైర్ పర్సన్ బల్లా పల్లవి శనివారం పరిశీలించారు. ప్రతి శనివారం సంత నిర్వహిస్తున్న సందర్భంగా రైతులతో చైర్ పర్సన్ బల్లా పల్లవి ముచ్చటించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి శనివారం రైతులకు ఉచితంగా భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేయడం తో పాటు భోజనం ఎలా ఉందని రైతులతో అడిగి తెలుసుకున్నారు. ఆదివారం మాల పున్నమి పర్వ దినాన్ని పురస్కరించుకుని పోట్టేళ్ల కొనుగోళ్లు, అమ్మకాలతో సందడిగా మారిన మార్కెట్ యార్డ్‌ను సందర్శించి రైతులతో మాట్లాడారు.

## పాత్రికేయుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలి**

**జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి హాజరైన మాజీ మంత్రి డాక్టర్ పల్లె ,వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 26 నేటి శుభోదయ: పాత్రికేయుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మాజీ మంత్రి, పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు. సమాజానికి నిత్యం సేవలందించే పాత్రికేయులు, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని ఆయన ఆకాంక్షించారు.సత్యసాయి జిల్లా జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల కోసం పుట్టపర్తిలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం కార్యక్రమంలో డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టులు తమ వృత్తి బాధ్యతల్లో భాగంగా నిరంతరం ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ సమాజానికి విశేష సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచితంగా వైద్య పరీక్షలు, వైద్యుల సలహాలు అందించడం అభినందనీయమని తెలిపారు. ఇలాంటి వైద్య శిబిరాలను భవిష్యత్తులో కూడా నిర్వహించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమానికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు వైద్య శిబిరాన్ని పరిశీలించి, జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులకు అందుతున్న వైద్య సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వైద్యులు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు, సూచనలు అందించారు. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు.ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం మైనార్టీల అభివృద్ధికి సీఎం చంద్రబాబు పెద్దపీట

**మైనార్టీల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం**

**స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించండి.**

**మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి**



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 26 నేటి శుభోదయ:ముస్లిం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మాజీ మంత్రి, పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మైనార్టీల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు.పుట్టపర్తి షాదీఖానాలో శుక్రవారం ముస్లిం మైనార్టీ సోదరులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, మైనార్టీల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అన్నారు. ముస్లిం మైనార్టీలకు విద్య, ఉపాధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని పేర్కొన్నారు.తాను 2014లో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో పుట్టపర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో షాదీఖానాల నిర్మాణానికి కృషి చేశానని గుర్తు చేశారు. ముస్లిం మైనార్టీ సోదరుల వివాహాలు, ఇతర శుభకార్యాలకు ఉపయోగపడేలా షాదీఖానాలను నిర్మించడం జరిగిందన్నారు. కడప విజయవాడలో ఒక్కొక్కటి 10 కోట్లతో హజ్ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. ఏ విధంగా ఇమామ్ లకు రూ.5వేలు మౌజములకు రూ3వేలు గౌరవ వేతనం పంపిణీ చేశామని తెలిపారు. హిందువునైన తనకు మైనార్టీ మంత్రి గా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అవకాశం ఇచ్చారని ఆ కృతజ్ఞతతో మైనార్టీల సంక్షేమానికి చిత్త శుద్ధి తో అహర్నిశలు కృషి చేశామని అన్నారు.రాష్ట్రంలో ఉన్న 16,500 ఎకరాలు వక్ఫ్ భూములు అన్యాక్రాంతమైతే ఇందులో ఎనిమిది వేల ఎకరాలకు పైగా ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో షాదీఖానాలు నిర్మాణంతోపాటు దర్గాలు మరమ్మతులకు అత్యధిక నిధులు కేటాయించామని పేర్కొన్నారు. పుట్టపర్తి లో రూ 1.20 కోట్లతో షాదిఖానా నిర్మాణాన్ని చేపట్టినట్టు గుర్తు చేశారు. ఈ షాదిఖానా కు త్వరలో మరుగుదొడ్లు, ప్రహరీ గోడ నిర్మాణం,పై అంతస్తులో డైనింగ్ హాల్ నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. షాదిఖానా లో మరుగుదొడ్లు కు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. మైనార్టీ సోదరులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి హామీ ఇచ్చారు. మైనార్టీలకు అండగా ఉంటూ వారి సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు మహమ్మద్ రఫీ, జనసేన నాయకులు సివిల్ సప్లై కమిషన్ సభ్యులు అబ్దుల్లా ,టీడీపీ నాయకులు షామీర్ భాష ,టీడీపీ కి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు కార్యకర్తలు, మైనార్టీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.



# మురికివాడల్లేని మాచర్ల నిర్మాణమే లక్ష్యం

**వార్డుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం.. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి**



మాచర్ల: ఆర్ సి ఇన్చార్జ్ సెప్టెంబర్ 26; నేటి శుభోదయ : మురికివాడలు లేని మాచర్ల పట్టణాన్ని నిర్మించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని 6, 7, 8, 10వ వార్డుల్లో ఆయన సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లోని ప్రజలను కలిసి స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, విద్యుత్ సమస్యలపై మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. ప్రజల సమస్యలను ప్రాధాన్యత



క్రమంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వార్డుల్లో జరుగుతున్న అమృత్ పథకం పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. 8వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ఓవర్‌హెడ్ ట్యాంకును పరిశీలించి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని ప్రతి వార్డుకు మౌలిక వసతులు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా పలువురిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి గబ్రూనాయక్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, టీడీపీ నాయకులు యాగంటి మల్లికార్జునరావు, కజ్జం సైదయ్య, మద్దిగపు వెంకటరామిరెడ్డి, యెనుముల కేశవరెడ్డి, రాజబోయిన మధు, కొమెర దుర్గారావు, శశిరెడ్డి, బీజేపీ నాయకులు క్రాంతికుమార్, జనసేన నాయకులు లాల్‌కిషన్, నర్రా రాముడు, కమాలకర్, భాగం హనుమంతరావు, వంకయాలపాటి రాజుకుమార్, చల్లా సాంబ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల వద్దకే వైద్య సేవలు మంత్రి సత్య కుమార్ యాదవ్...

అనంతపురం,సెప్టెంబరు26 నేటి శుభోదయ: ప్రజల వద్దకే వైద్య సేవలు తీసుకెళ్లే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్యా శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. శనివారం అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ వారి నిధుల నుండి రూ. 75 లక్షల వ్యయంతో ఆసుపత్రికి వచ్చే రోగుల సహాయకుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన విశ్రాంతి భవనాన్ని ముఖ్య అతిథిగా మంత్రి పాల్గొని లాంఛనంగా ప్రారంభించారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దలవాయి రమాదేవి, జిల్లా కలెక్టర్ ఓ .ఆనంద్ , ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఓబిలి రత్నమయ్య, కోసిండి గంగారాం, వెంకటరమణ, మిద్దెల నరసింహులు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.మల్లేశ్వరి, ఆర్ ఎం ఓ లు డా . సుధారాణి, డా. హేమలత, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. విజయశ్రీ, ఏ .ఓ. మల్లికార్జున రెడ్డి, మాజీ మేయర్ స్వరూప ఆసుపత్రిలోని వివిధ విభాగాలకు చెందిన డాక్టర్లు వైద్య సిబ్బంది, పలువురు కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సేవా తత్పరత భావంతో కృషితో తన నిధుల నుండి విశ్రాంతి భవనాన్ని నిర్మించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లాలో అన్ని ఆసుపత్రిలో అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. ముఖ్యంగా వివిధ హోదాల్లో ఖాళీగా ఉండే ఉద్యోగాలను భర్తీ చేయుటకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా ఆసుపత్రిలో అనేక ప్రాంతాల నుండి రోగులు వైద్య చికిత్సల కోసం వస్తుంటారని వారి సహాయకుల కోసం నిర్మించిన ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యంగా 550 బెడ్లకు పైగా రోగులు వస్తుంటారని, ఇతర జిల్లాల కంటే అధిక సంఖ్యలో ఈ ఆసుపత్రికి బెడ్లు పెంచవలసిన అవసరం ఉందన్నారు. ఆసుపత్రిలో వివిధ స్థాయిలో పెండింగ్ లో ఉన్న పనులను పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నాడు -నేడు కార్యక్రమం ద్వారా చేపట్టిన పనులన్నీ అసంపూర్తిగా మిగిలిపోయాయని కేవలం కేవలం జీవోలు ఇచ్చారని స్పష్టత లేని కారణంగా వైద్య ఆరోగ్యశాఖలో అభివృద్ధి పనులు పూర్తి కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం 756 కోట్ల రూపాయలను మౌలిక సదుపాయాల కల్పన కోసం సహకారం అందిస్తున్నదని అన్నారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ పనితీరుపై ఐ వి ఆర్ ఎస్ సర్వేలో 78 శాతం వరకు ప్రజల నుండి స్పందన సత్ఫలితాలు ఇస్తున్నట్లు తెలిపారు. అనంతపురంలో క్యాన్సర్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఆసుపత్రుల్లో వైద్యులు ఇతర సిబ్బంది బాధ్యత యుతంగా తమ ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తున్నారని అన్నారు.



రాష్ట్రంలో గతంలో ఎన్నడు లేని విధంగాప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవల పట్ల ప్రజలకు విశ్వాసం కలుగుతున్నదని మారుమూల ప్రాంతాల్లో సైతం వైద్యులు తమ విధులు నిర్వర్తించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది జనాభాను తమ కుటుంబ సభ్యులతో సమానంగా జవాబుదారి తనంతో వైద్య శాఖ సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రుల అభివృద్ధికి ప్రజలు, దాతలు తగిన ప్రోత్సాహం అందించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా సంజీవిని కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ప్రజలకు 42 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా అందించడం జరుగుతున్నదని పేర్కొన్నారు. నిన్నటి రోజున ధర్మవరంలో అనంతపురం మరియు శ్రీ సత్య సాయి జిల్లాలకు సంబంధించి 71 ఆరోగ్య రకాలను ప్రారంభించడం జరిగిందని రూ. 3వేలు నుంచి రూ 5వేలు వరకు ఖర్చయ్యే దయాబెటిస్, కిడ్నీ, కాలేయ, రక్త తదితర పరీక్షలు అందుబాటులో ఉంటాయని మంత్రి తెలిపారు. అంతేగాక రాష్ట్రంలోని రెండువేల పైగా ఆసుపత్రులలో సమన్వయకర్తలను నియమించడం జరిగిందని రోగులకు వైద్య సేవ అందించడంలో భాగంగా ఆశా కార్యకర్తలు ఏఎన్ఎంలతో కలిసి ఆసుపత్రి వైద్యులు అపాయింట్మెంట్ మార్గ నిర్దేశం చేయడంతో పాటు చికిత్స అనంతరం మందుల వాడకం ఆరోగ్య స్థితిని పర్యవేక్షిస్తారని మంత్రి తెలిపారు.

## మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం.ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ...

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభా కార్యక్రమంలో తొలుత అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా మెరుగైన వైద్య సేవలు మరింతగా అందించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుత ఆసుపత్రికి వచ్చే రోగుల సహాయకులకు వసతి ఏర్పాటుకు తన నిధుల నుండి రూ.75 లక్షల వ్యయంతో నిర్మించడం జరిగిందన్నారు. అనంతపురం ఆస్పత్రి అభివృద్ధికి అవసరమైన మేరకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్గా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోది నేతృత్వంలో- 2047 వికసి భారత్ లక్ష్యాల్లో భాగంగా వైద్య రంగానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నట్లు ఎంపీ తెలిపారు.అనంతపురంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రోగులకు మాత్రమే కాకుండా చికిత్స కాలమంతా మానసిక లాజిస్టికల్ మద్దతును అందించే వారి సహాయకులకు కూడా సేవలు అందుతున్నట్లు తెలిపారు. తరచుగా ఈ సహాయకులకు సరైన ఆశ్రయం లేదా సౌకర్యాలు లేకుండా బహిరంగ ప్రదేశాలలో కారిడార్లలో లేదా ఆసుపత్రి ప్రాంగణంలో మరియు చుట్టుపక్కల వేచి ఉండాల్సిన దుస్థితిని ప్రజల ద్వారా గుర్తించి వారి అభ్యర్థన మేరకు ఈ సౌకర్యాన్ని కలిగించడం జరిగిందన్నారు. ముఖ్యంగా వర్షాకాలం వేసవి సమయాల్లో ఎక్కువ కాలం ఆసుపత్రిలో ఉన్నప్పుడు సహాయకులు వేచి ఉండే సమయంలో లేదా విశ్రాంతి తీసుకునేటప్పుడు వారికి సురక్షితమైన పరిశుభ్రమైన మరియు క్రమబద్ధమైన వాతావరణాన్ని అందించడమే ఈ సౌకర్యం యొక్క ప్రధాన లక్ష్యమన్నారు. ఈ వసతి విశ్రాంతి భవనంలో మహిళలకు పురుషులకు వేరువేరుగా విభాగాలు ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. అంతే గాక ఇలాంటి సముదాయాలు ఏర్పాటు చేయడం వల్ల ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను ప్రతిబింబిస్తుందని ఎంపీ తెలిపారు. ఈ భవన నిర్మాణంలో భాగస్వాములైన దాతలకు ఎంపీ కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో రోగులకు సరిపడే విధంగా బెడ్లు పెంచే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ సహకారాలతో ప్రభుత్వ ఆసుపత్రిని అన్ని విధాల అభివృద్ధి పరుస్తామన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారా అనేక ప్రజల సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు అవుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని ప్రభుత్వం ద్వారా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయి అన్నారు. దేశంలో అన్ని రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రైల్వే బడ్జెట్ అధిక శాతం మంజూరు అయిందని అలాగే కేంద్ర ప్రభుత్వం ఈ రాష్ట్ర అభివృద్ధికి అనేక విధాలుగా సహకరిస్తున్నట్లు ఎంపీ తెలిపారు. ప్రస్తుతం ఈ ఆసుపత్రికి సంబంధించి పెండింగ్ లో ఉన్న అన్ని పనులను, సమస్యలను పరిష్కరించాలని మంత్రి సత్య కుమార్ యాదవ్ను ఎంపీ ప్రత్యేకంగా కోరారు. అలాగే సి ఎస్ ఆర్ నిధులతో పాటు ఎంపీ లాడ్స్ ద్వారా ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం వైద్య శాఖలో వివిధ స్థాయిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని పలువురు మంత్రాన్ని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు.




# మున్సిపల్ సిబ్బంది సేవలు వెలకట్టలేనివి..!

**– ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి**



మాచర్ల: ఆర్ సి ఇన్చార్జ్ సెప్టెంబర్ 26 ;నేటి శుభోదయ: పట్టణ ప్రజలకు మున్సిపల్ సిబ్బంది అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 30 మంది పర్మినెంట్ మున్సిపల్ సిబ్బందికి ఎమ్మెల్యే చేతుల మీదుగా నూతన యూనిఫాం వస్త్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కరోనా విపత్కర సమయంలో మున్సిపల్ సిబ్బంది అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. ప్రజారోగ్యం, పారిశుధ్య పరిరక్షణలో మున్సిపల్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వారి సేవలను ప్రభుత్వం, ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని అన్నారు.అర్హత కలిగిన మున్సిపల్ సిబ్బందికి తప్పకుండా నివేశన స్థలాలు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సిబ్బంది సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి. వేణుబాబు, కజ్జం సైదయ్య, కొమెర దుర్గారావు, మద్దిగపు వెంకటరామిరెడ్డి, కంభంపాటి అనిల్ కుమార్, బీజేపీ నాయకులు ఓర్సు క్రాంతికుమార్, జనసేన నాయకులు కొమెర లాల్‌కిషన్, అవినాష్‌రెడ్డి, కొమెర శివ తదితరులు పాల్గొన్నారు.

# నేడు పైపులైన్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన..!



మాచర్ల: ఆర్ సి ఇన్చార్జ్ సెప్టెంబర్ 26; నేటి శుభోదయ: జల్ జీవన్ మిషన్ నిధులతో మాచర్ల నియోజవర్గంలో చేపట్టిన పల్నాడు వాటర్ గ్రిడ్ పనుల్లో భాగంగా మండల పరిధిలోని రాయవరం జంక్షన్ ఎంఎస్ఎంఈ పార్క్ వద్ద రాయవరం జంక్షన్ నుంచి కారంపూడి వరకు నిర్మించే 1300 ఎంఎం వాటర్ పైప్ లైన్ పనులకు ఆదివారం ఉదయం 11.30 నిమిషాలకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చేతుల మీదిగా శంకుస్థాపన కార్యక్రమం జరుగుతోందని శాసన సభ్యుల వారి కార్యాలయం శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది. ముందుగా ఉదయం 8 గంటలకు 11,12,13,14 వార్డులు, సాయంత్రం 3,4,5 వార్డుల నందు పర్యటిస్తారని వెల్లడించింది.

# వికసిత్ భారత్‌పై విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం




మాచర్ల: మాచర్ల ఆర్ సి ఇన్చార్జ్ సెప్టెంబర్ 26; నేటి శుభోదయ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా మాచర్ల పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో 'వికసిత్ భారత్' అంశంపై డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మాచర్ల పట్టణ బీజేపీ అధ్యక్షుడు ఓర్సు క్రాంతి కుమార్ బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, దేశభక్తి, సామాజిక బాధ్యతలను పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. వికసిత్ భారత్ నిర్మాణంలో యువత, విద్యార్థుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ హనుమంతరావు, డైరెక్టర్ రామకృష్ణ శ్రీధర్, స్కూల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీనివాస్ రాజు, నియోజకవర్గ సీనియర్ నాయకులు పోకూరు కాశుపతి, ప్రధాన కార్యదర్శి ఏచూరి సురేష్ బాబు, పట్టణ ఉపాధ్యక్షుడు శివకోటయ్య నాయక్, పట్టణ నాయకులు సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

# పరాసర శ్రీలక్ష్మీనరసింహభట్టర్ స్వామి వారి

**శతాభిషేకం మహోత్సవ శుభాకాంక్షలు తెలిపి,**

**ఆశీస్సులు పొందిన బిజెపి నేత నీరుకొండ వీరన్న చౌదరి..!!**



కోరుకొండ, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);శ్రీ పరాసర సుదర్శన భట్టర్ స్వామి వారి జ్యేష్ఠ కుమారులుశ్రీ పరాసర లక్ష్మీనరసింహభట్టర్ స్వామి వారిశతాభిషేకం (సహస్ర చంద్ర దర్శనం) మహోత్సవ వేడుక పరమ పూజ్యులు మా గురువు శ్రీ పరాసర శ్రీలక్ష్మీనరసింహభట్టర్ స్వామివారి 81వ జన్మదిన శతాభిషేకం మహోత్సవం శ్రీ పరాసర రంగరాజ భట్టర్ స్వామి వారి ఆద్వర్యంలో వైభవంగా నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ రాజానగరం నియోజకవర్గ మాజీ కన్వీనర్ సీనియర్ నాయకులు నీరుకొండ వీరన్న చౌదరి, వారి కుటుంబ సభ్యులు శ్రీలక్ష్మీనరసింహభట్టర్ స్వామివారిని దర్శించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి పాదాభివందనం చేశారు. సందర్భంగా వీరన్న చౌదరికి శ్రీ లక్ష్మీ నరసింహ బట్ట స్వామి వారు ఆశీస్సులు అందజేశారు. అర్చకులు, అధ్యాపక స్వాముల ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో శనివారం ఈ పవిత్రమైన మహోత్సవానికి వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తులు, శిశ్య బృందం, అభిమానులు పాల్గొన్నారు.

# విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలి

**అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ**




అనంతపురం బ్యూరో సెప్టెంబర్, 26 నేటి శుభోదయ : అనంతపురం నగరంలోని శ్రీ వాణి డిగ్రీ , పీజీ కళాశాలలో నిర్వహించిన "యువత భవితకు భరోసా" కార్యక్రమంలో అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగావిద్యార్థులతో ఎంపీ వ ముచ్చటించారు. ఈ సందర్భంగా అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ యువత భవిష్యత్తుకు భరోసా కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న విద్యా, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను గురించి వివరించారు.ముఖ్యంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా రంగంలో తీసుకొస్తున్న సంస్కరణలు, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు చేస్తున్న కృషిని తెలియజేశారు.శ్రీ వాణి కళాశాల ఫౌండర్ డాక్టర్ నారాయణమ్మ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విద్యతో పాటు ఉచిత బస్సు సౌకర్యం, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, క్రీడలు వంటి అనేక వసతులు కల్పిస్తూ విద్యార్థుల అభ్యున్నతికి చేస్తున్న సేవలను అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వనజమ్మ కోఆర్డినేటర్ సుధీర్ రెడ్డి అధ్యాపకులు, సిబ్బందికి అభినందనలు తెలియజేశారు.ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా కష్టపడి చదువుకోవాలి. నేటి సమాజానికి, మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా నూతన నైపుణ్యాలను అలవర్చుకోవాలి. ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత స్థాయి ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగాలి.విద్యార్థులు మంచి విద్యతో పాటు చక్కగా మాట్లాడటం, క్రమశిక్షణతో వ్యవహరించడం, మన సంస్కృతి సంప్రదాయాలను గౌరవించడం వంటి విలువలను కూడా అలవర్చుకోవాలి.ఆత్మవిశ్వాసంతో స్వయం ప్రకాశంగా ఎదిగి, సమాజానికి మరియు దేశానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుకోవాలి.యువత భవిష్యత్తే దేశ భవిష్యత్తు. వారి కలలకు, లక్ష్యాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు.




# సమాజంలో వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాడిన ఐలమ్మ చరిత్ర చిరస్మరణీయం

**చాకలి ఐలమ్మ పోరాట పటిమ నేటితరానికి స్ఫూర్తిదాయకం : జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**



ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ::: సమాజంలోని అసమానతలకు ఎదురొడ్డి, వెట్టిచాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా నిర్భయంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని , వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని శనివారం ఖమ్మం , వైరా రోడ్డులోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సమీపంలో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు . అనంతరం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొని, చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు . ఈ సందర్భంగా డాక్టర్ కేవీ కృష్ణారావు మాట్లాడుతూ ఐలమ్మ విగ్రహాన్ని హైదరాబాదు ట్యాంక్ బండ్ పై పెట్టాలని డిమాండ్ చేశారు . చాకలి ఐలమ్మ భూ పోరాటం, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తనదైన పాత్రను పోషించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు . ఆమె పోరాట పటిమ , ధైర్యసాహసాలు మహిళా శక్తికి ప్రతీకగా నిలిచాయని , నేటి తరానికి కూడా ఆమె జీవితం ఆదర్శప్రాయమని అన్నారు . కొత్త కొండ శ్రీలక్ష్మి మాట్లాడుతూ జనగం జిల్లాకు చాకలి ఐలమ్మ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు . సమాజ హితం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను , వారి సేవలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వారి జయంతి , వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు . తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచిన చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని , మహిళా శక్తిని చాటి చెప్పారని కలెక్టర్ అన్నారు. ఆమె ఆశయాలు , పోరాట విలువలను స్మరించుకుంటూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారిణి జి.జ్యోతి , దుంపటి నగేష్ , సట్టు వెంకటేశ్వర్లు , ఎడపల్లి భాస్కర్ , పడిగెల కృష్ణవేణి , కనతాల వెంకన్న , వల్లంకొండ కొండలు , ఎడపల్లి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు .

# అనంతపురం పట్టణంలో ఘనంగా 'అంగన్వాడీల ఉత్సవం'

**– చేనేత, వైద్య రంగ సమస్యలపై బీజేపీ రాష్ట్ర నేతలకు వినతి**



అనంతపురం సెప్టెంబర్ 26 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : పట్టణం లోని రాయల్ ఫంక్షన్ హాల్లో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో "సేవా సంకల్ప అభియాన్"లో భాగంగా అంగన్వాడీల ఉత్సవం కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ అధ్యక్షత వహించిన ఈ వేడుకకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ మరియు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంకాల్ రెడ్డి, సందిరెడ్డి ప్రతాప్ రెడ్డితో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులు, బూత్ స్థాయి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.?ఈ సమావేశం అనంతరం అనంతపురం జిల్లా చేనేత అధ్యక్షులు చింతా చౌడయ్య రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్‌లను మర్యాదపూర్వకంగా కలిసి చేనేత నేస్తం పథకం అమలుతో పాటు పలు చేనేత సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే యాడికి మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించి నిర్మాణ దశలోనే నిలిచిపోయిన భవన నిర్మాణ పనులను పూర్తి చేయించాలని విన్నవించారు. నేతల సమస్యలపై స్పందించిన రాష్ట్ర అధ్యక్షులు మరియు మంత్రి సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తూ భరోసా కల్పించారు..

# జర్నలిస్టుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**మంత్రి సత్యకుమార్ యాదవ్**



పుట్టపర్తి సెప్టెంబర్ 26 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : సత్యసాయి జిల్లా కేంద్రంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ చొరవతో జర్నలిస్టులు మరియు వారి కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం దిగ్విజయంగా ముగిసింది. కళ్యాణదుర్గం, అనంతపురం విలేఖరుల సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో పాటు జాప్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పల లక్ష్మణ్, సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్, డిఎంఅండ్‌హెచ్ఓ, అనంతపురం జాప్ జిల్లా అధ్యక్షులు నాగేంద్ర యాదవ్, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మరియు పలు జర్నలిస్టు యూనియన్ల అధ్యక్షులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాప్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పల లక్ష్మణ్ మాట్లాడుతూ, నిరంతరం వృత్తి ధర్మంలో నిమగ్నమై జర్నలిస్టులు తమ ఆరోగ్యాన్ని, కుటుంబాన్ని విస్మరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోతున్న జర్నలిస్టు కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారుతోందని, ప్రతి ఒక్కరూ కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల వైద్య సేవా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, పెన్షన్లు, పత్రికా యాజమాన్యాల ద్వారా వేతనాల అమలులో జరుగుతున్న అన్యాయాలపై ప్రభుత్వాలు స్పందించి ఒక క్రమబద్ధమైన విధానాన్ని తీసుకురావాలని కోరారు.మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, గతంతో పోలిస్తే నేడు జర్నలిస్టుల సంఖ్య భారీగా పెరిగిందని, ప్రతి ఒక్కరిని గుర్తించడం కోసం అక్రిడిటేషన్ గుర్తింపు కార్డులు చాలా ముఖ్యమని తెలిపారు. ప్రభుత్వాలు అందించే ఉచిత వైద్యం, విద్య, ఇళ్ల పట్టాలు, గృహ నిర్మాణాలు అందాలంటే అక్రిడిటేషన్ కార్డులు ఎంతగానో దోహదపడతాయని, ప్రతి జర్నలిస్టు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు.సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ, జిల్లాలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం ఖాళీ స్థలాలను సేకరించాలని ఇప్పటికే రెవెన్యూ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. జర్నలిస్టుల ఆరోగ్య సంరక్షణ కోసం వైద్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఈ మెగా వైద్య శిబిరం ఏర్పాటుకు సహకరించినట్లు వెల్లడించారు.ఈ మెగా వైద్య శిబిరంలో అనంతపురం, సత్యసాయి జిల్లాల నుంచి విచ్చేసిన వందలాది మంది జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఆర్థోపెడిక్, న్యూరాలజీ, ఈఎన్టీ తదితర అన్ని విభాగాలకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి అక్కడికక్కడే రిపోర్టులు అందజేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసి వైద్యులచే తగు సూచనలు ఇప్పించారు. మొత్తం 185 జర్నలిస్టు కుటుంబాలకు చెందిన 110 మంది పురుషులు, 75 మంది మహిళలు ఈ వైద్య శిబిరం ద్వారా లబ్ధి పొందగా, ఇందులో 31 మందికి క్యాన్సర్ సంబంధిత పరీక్షలు నిర్వహించి ఈ శిబిరాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో యాడికి మండలం తరఫునుంచి నేటి శుభోదయ పత్రిక విలేఖరి బండారు బాలకృష్ణ, సూర్య వెలుగు జాతీయ తెలుగు దినపత్రిక విలేకరి ఆలూరు చంద్రశేఖర్ రెడ్డి, ప్రభ న్యూస్ విలేఖరి సిద్ధవటం తిరుమలరెడ్డి, యువతరం విలేకరి బండారు ధనుంజయ పాల్గొనడం జరిగింది..

# అంగరంగ వైభవంగా హనుమాన్ జీ శోభాయాత్రలిమ



ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ::: కమాన్ బజార్ రైల్వే గేట్ సమీపంలోని శ్రీ హనుమాన్ దేవస్థానంలో శ్రీ హనుమాన్ భక్తబృంద కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ జీ శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పూర్వాహ్ణ సక్తశాన్ని పురస్కరించుకుని ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, హోమ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.మధ్యాహ్నం సుమారు 600 మంది భక్తులకు అన్నదాన ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం 6 గంటలకు స్వామివారి పల్లకి శోభాయాత్రను ప్రారంభించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భజనలు, భక్తి కార్యక్రమాలతో శోభాయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం రాత్రి 8 గంటలకు భక్తులకు అల్పాహారం పంపిణీ చేశారు. ప్రతి నెల 27వ తేదీన భక్తబృంద కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, భక్తులను ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ కార్యక్రమాల్లో భక్తుల భాగస్వామ్యం మరింత పెంచేలా భక్తబృంద కమిటీ ఆధ్వర్యంలో నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజా మురళీకృష్ణ, యక్కల ఆనంద్ కుమార్, బోంగిరి శ్రవణ్, తేలా రవికిరణ్, బుర్లె పుల్లారావు, చల్లా జగదీష్, వంపనప మధు, నక్కా లక్ష్మీనారాయణ, టి.ఎస్. చక్రవర్తి, సిద్ధంశెట్టి శ్రీకాంత్, కొదుమూరు భద్రయ్య, కొంకిమళ్ల కృష్ణమూర్తి, ఆలయ అర్చకులు, ఈక శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. భక్తుల సహకారంతో శోభాయాత్రను విజయవంతంగా నిర్వహించారు.



# జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాల్సిందే

**- సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**

**- బైపాస్ రోడ్డులో సిపిఐ రాస్తారోకో**



ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ::: ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థకు కళంకం తెచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేష్కుమార్ రాజీనామా చేయాల్సిందేనని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజల అభిప్రాయాలను పక్కదారి పట్టించిన జ్ఞానేష్కుమార్ దేశ ఎన్నికల ఫలితాలను తారుమారు చేశారని ఆయన ఆరోపించారు. బిజెపికి తొత్తుగా వ్యవహరించిన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకోను ఉద్దేశించి సురేష్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ గుట్టు రట్టయిన తర్వాత మోడీ, అమిత్‌షాల బండారం బయటపడిందన్నారు. ప్రజా బలంతో కాకుండా ఎన్నికల సంఘం మాయాజాలంతో బిజెపి అధికారంలోకి వచ్చిందన్న విషయం స్పష్టమైందని సురేష్ తెలిపారు. దేశంలో జ్ఞానేష్కుమార్ బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన అన్ని ఎన్నికలను రద్దు చేయాలని -ఆయన డిమాండ్ చేశారు. రాజ్యాంగ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ బిజెపి చెప్పు చేతల్లో పెట్టుకున్నారని రాజ్యాంగ సంస్థలు ఇప్పుడు ప్రజల కోసం కాకుండా బిజెపి కోసం పనిచేస్తున్నాయని ఆయన తెలిపారు. బిజెపి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని ధరల నియంత్రణ, కార్మిక చట్టాల రద్దు, నూతన సాగు చట్టాలు, జలా అన్ని ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటుందని సురేష్ ఆరోపించారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసేంత వరకు ఆందోళనలు కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు. రాజీనామా తర్వాత ఆయనపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని "సురేష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి -సభ్యులు యర్రా బాబు, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, మహ్మద్ సలాం, బిజి క్లైమెంట్, జిల్లా కార్యవర్గ -సభ్యులు పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, దొండపాటి రమేష్, జాగర్లమూడి రంజిత్, బెజవాడ రవి, ఏపూరి రవీంద్రబాబు, మేకల శ్రీనివాసరావు, ఏనుగు గాంధీ, మల్లికార్జున్, -యానాలి సాంబశివరెడ్డి, యంగల ఆనందరావు పాల్గొన్నారు.

# పొగాకు రైతుల తరపున కేంద్ర ప్రభుత్వానికి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కృతజ్ఞతలు

**- ఫలించిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కృషి**

**- రైతులు అదనంగా పండించిన పొగాకును ఎలాంటి పెనాల్టీ లేకుండా వేలం కేంద్రాల్లో అమ్ముకునేందుకు అనుమతిస్తూ కేంద్రం ఉత్తర్వులు**

**- 50 వేల చొప్పున వడ్డీ లేని రుణంపై కూడా నోటిఫికేషన్**



ఏలూరు, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :: రాష్ట్ర ప్రభుత్వం, ఎంపీగా తాను చేసిన విజ్ఞప్తులు, రైతుల ఇబ్బందులు అర్థం చేసుకుని అదనపు పొగాకు అమ్మకాలకు అనుమతి ఇస్తూ కేంద్రం నోటిఫికేషన్ ఇవ్వడం పట్ల ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. పొగాకు రైతుల తరపున కేంద్ర ప్రభుత్వానికి, పొగాకు బోర్డుకు ఎంపీ కృతజ్ఞతలు తెలియచేశారు. ఈమేరకు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసిన ఎంపీ, పొగాకు బోర్డు గతంలోనే అంగీకరించిన విధంగా బార్న్‌కు రూ.50 వేల చొప్పున వడ్డీ లేని రుణానికి ఆమోదం తెలపడంతో పాటు, 2025-26 పంట కాలంలో అదనపు పొగాకు విక్రయాలకు అనుమతి ఇస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం పట్ల ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. పొగాకు బోర్డులో నమోదైన డీలర్లు, వ్యాపారులు ఎలాంటి పెనాల్టీలు, ఇబ్బందులు లేకుండా సాధారణ సర్వీస్ ఛార్జీలు చెల్లించి పొగాకును వేలం ద్వారా కొనుగోలు చేయడానికి కేంద్రం అనుమతించింది. దీనితోపాటు బార్న్‌కు రూ.50 వేల చొప్పున వడ్డీ లేని రుణం నిర్ణయం వల్ల దాదాపు 44 వేల మంది రైతులకు రూ.220 కోట్ల వరకూ ఉపశమనం కలుగుతుందని ఎంపీ వెల్లడించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 13న జంగారెడ్డిగూడెం ప్రాంతానికి చెందిన పొగాకు రైతులు, రైతు సంఘాల నేతలు తనను కలిసి బోర్డు నిర్దేశించిన కోటాకు మించి పండిన పంటను కూడా వేలం కేంద్రాల్లో విక్రయించేందుకు అనుమతి ఇప్పించమని కోరిన విషయాన్ని, దీనిపై రైతులకు హామీ ఇచ్చిన మేరకు తాను కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ తో, అధికారులతో మాట్లాడిన విషయాన్ని ఎంపీ గుర్తు చేశారు. తనతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కేంద్ర మంత్రితో, అధికారులతో మాట్లాడిన ఫలితంగానే తాజా ఉత్తర్వులు వెలువడ్డాయని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. వీటితో పాటు పొగాకు రైతులకు ఆర్థిక ఉపశమన చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ధరల స్థిరీకరణ పథకం కింద లో గ్రేడ్, ఆఫ్ గ్రేడ్ రకాలకు కిలోకి రూ.10 చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు ముందుకొచ్చి, దీనికోసం 94 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని కూడా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. అంతర్జాతీయ పరిమాణాల కారణంగా, కొద్ది నెలలుగా పొగాకు మార్కెట్ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొందన్న ఎంపీ, ప్రస్తుతం మార్కెట్ ధరలు రోజురోజుకూ మెరుగుపడి ఇప్పుడు యార్డులో పొగాకు కొనుగోలు ధర కేజీ 345 వరకూ చేరిందని, రాబోవు రోజుల్లో మరి కొంత పెరిగే అవకాశం ఉందని చెప్పారు. అదనపు పొగాకు అమ్మకాలకు అనుమతి ఇస్తూ కేంద్రం నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిన పొగాకు రైతు సంఘం నేతలు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు ఫోన్ చేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. గత రెండేళ్లుగా పొగాకు రైతులకు ఇబ్బందులు వచ్చినప్పుడల్లా నేనున్నానంటూ ముందుకు వచ్చి, రైతులకు న్యాయం జరిగేలా కేంద్ర మంత్రుల వద్ద, పొగాకు బోర్డులో రైతుల తరపున గట్టి వాదన వినిపిస్తూ అండగా నిలుస్తున్న ఎంపీకి పొగాకు రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

# ఎంపీ వద్దిరాజు స్వగ్రామం ఇనుగుర్తి కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ లో చేరిక



ఖమ్మం, మహబూబాబాద్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ::: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు నాయకత్వమే రాష్ట్రానికి, ప్రజలకు శ్రీరామరక్ష అని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర మరోసారి స్పష్టం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులను చూసి అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పాలనను ఛీదరించుకుంటున్నారని చెప్పారు. ఎంపీ రవిచంద్ర స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రం, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు ఆ పార్టీని వీడి శనివారం హైదరాబాద్ తెలంగాణ భవన్ కు తరలివచ్చి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు సమక్షంలో గులాబీ కండువాలు కప్పుకున్నారు.మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇనుగుర్తి ఉప సర్పంచ్ సత్తూరి యాదగిరి, ఆయనతో పాటు వచ్చిన సుమారు 500 మంది కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలకు కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్ లోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు, మాజీ ఎంపీ మాలోతు కవిత మాట్లాడారు. మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య,రేగా కాంతారావు,మెచ్చా నాగేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి,గెల్లు శ్రీనివాస్ యాదవ్,బానోత్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పూర్తిగా కుంటుపడిపోవడంతో నిరాశ చెందిన కరుడుగట్టిన కాంగ్రెస్ కుటుంబాలు ఆ పార్టీకి మూకుమ్మడిగా గుడ్ బై చెప్పి బీఆర్ఎస్ లో చేరారన్నారు. ఇనుగుర్తికి ఘనమైన చరిత్ర ఉందని,కాకతీయులు కొంతకాలం ఇక్కడి నుంచే పాలన చేశారని,100 ఏండ్ల కిందటనే తెలుగు పత్రిక ప్రచురణ జరిగిందని తెలిపారు.దివంగత మాజీ ప్రధాని పీ.వీ.నర్సింహారావు తన చిన్నతనంలో ఇనుగుర్తిలోనే చదువుకున్నారని,మా ఊరు వాలీబాల్ క్రీడకు పేరుగాంచిందని, జాతీయ జట్టుకు వెంకటనారాయణ కెప్టెన్ గా వ్యవహరించారని చెప్పారు. మండల కేంద్రం ఎప్పుడో కావలసి ఉండగా,రాజకీయ కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేదని,తనతో పాటు పార్టీ నాయకులు రవీందర్ రావు,కవిత, సత్యవతి రాథోడ్,శంకర్ నాయక్ తదితరులు విజ్ఞప్తి చేయడంతో మహానేత కేసీఆర్ తమ చిరకాల ఆకాంక్షను నెరవేర్చారన్నారు. కాంగ్రెస్ నాయకులు ఇష్టారీతిగా హామీలిచ్చి ప్రజలను మోసపుచ్చి అధికారంలోకి వచ్చారని ఎంపీ రవిచంద్ర దుయ్యబట్టారు.కాంగ్రెస్ సర్కార్ అవలంభిస్తున్న తప్పుడు విధానాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారన్నారు.మేజర్ గ్రామ పంచాయతీ ఇనుగుర్తి మాదిరిగానే మహబూబాబాద్ జిల్లా మొత్తాన్ని గులాబీ కంచుకోటగా మార్చేందుకు బీఆర్ఎస్ నాయకులందరం మరింత సంఘటితమై ముందుకు సాగుతామని ఎంపీ వద్దిరాజు చెప్పారు.కేటీఆర్ పట్ల యువతరం చాలా అభిమానం చూపుతున్నారని,వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం, కేసీఆర్ ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమని ఎంపీ వద్దిరాజు వివరించారు.

# తిరుమలాపురంలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**- బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఘన నివాళులు**



చింతకాని, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ::: ఖమ్మం జిల్లా, చింతకాని మండలం తిరుమలాపురం గ్రామంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గోగుల నరసింహారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ చాపలమడుగు వీరబాబు మాట్లాడుతూ.. తెలంగాణలో సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని అన్నారు. భూస్వామ్య దోపిడీకి ఎదురొడ్డి నిలిచి, అణగారిన వర్గాల్లో పోరాట స్ఫూర్తిని నింపిన ఆమె జీవితం నేటి తరానికి ఆదర్శమన్నారు. గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు గోగుల నరసింహారావు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, యువత సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బండి యాకోబు, బండి గోపీనాథ్, గోద వెంకన్న, మరీదు భూపతిరావు, రామ్, లక్ష్మణ్ తదితరులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# డిగ్రీ కాలేజీలో ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం




చింతూరు, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ::: చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్ .మణిమాల తెలిపారు. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపల్ ముల్లి.శేఖర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ చింతూరు పరిసర ప్రాంతాలలో గొప్ప పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని దానికి ఉదాహరణగా పొల్లూరు జలపాతం, మోతుగూడెం పరిసర ప్రాంతాలు గొప్ప పర్యాటక ప్రదేశాలుగా వెలుగొందుతున్నాయని తెలిపారు. ఈ ప్రాంతాలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయని నిత్యము పర్యాటకులతో సందడి చేస్తున్నాయని తెలిపారు. ఐ. క్యు. ఏ.సి.కో ఆర్డినేటర్ డాక్టర్. వై.పద్మ మాట్లాడుతూ అంతర్జాతీయ సమాజంలో పర్యాటక పాత్ర మీద అవగాహన పెంచడం, అది ప్రపంచవ్యాప్తంగా సామాజిక, సాంస్కృతిక,రాజకీయ,ఆర్థిక విలువలను ఎలా ప్రభావితం చేసిందో తెలిపారు. ఇంగ్లీష్ అధ్యాపకులు ఎం. రాకేష్ రాజ్ మాట్లాడుతూ 1980 నుండి ఐక్యరాజ్యసమితి ప్రపంచ పర్యాటక సంస్థ ఈ వేడుకలను సెప్టెంబర్ 27న నిర్వహిస్తుందని తెలిపారు. జువాలజీ అధ్యాపకులు కె.సత్య గణేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మిలియన్ల మంది పర్యాటకులు నూతన గమ్యస్థానాలను చూడడానికి విభిన్న సంస్కృతులను చూసి ఆనందించి అనుభవించడానికి శాశ్వత జ్ఞాపకాల కొరకు ప్రజలు ప్రపంచవ్యాప్తంగా సరిహద్దులు దాటి ఆయా ప్రదేశాలను చూస్తున్నారని తెలిపారు. చరిత్ర అధ్యాపకులు బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యాటక రంగం నుంచి వచ్చే ఆదాయం పెరగడం వల్ల మెరుగైన జీవన ప్రమాణాలు ఆరోగ్యం, విద్య, ఇతర అవసరాలకు మెరుగైన ప్రాప్యత లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.జి.ఝాన్సీ, జి. సాయికుమార్ , ఎన్. ఆనంద్, కోట్ల. లక్ష్మీ ప్రసన్న అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# వరదల్లోనూ, తుఫాన్లోనూ అద్భుత సేవలు

**- విద్యుత్, రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్,**

**వైద్య ఆరోగ్య శాఖల సిబ్బందికి మహమ్మద్ జమాల్ ఖాన్ కృతజ్ఞతలు**



చింతూరు, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ::: చింతూరు ఏజెన్సీ ప్రాంతంలో భారీ వర్షాలు, వరదలు, తుఫాన్ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సమయంలో తమ కుటుంబాలను, తమ భద్రతను సైతం పక్కనపెట్టి ప్రజల కోసం విధుల్లో నిలిచిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి మహమ్మద్ జమాల్ ఖాన్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వరద ఉధృతి, ప్రతికూల వాతావరణం, రాకపోకలకు తీవ్ర అంతరాయాలు ఉన్నప్పటికీ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్, రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖలతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది అహర్నిశలు అందించిన సేవలు ఎంతో అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఆపద సమయంలో ప్రజల వద్దకు చేరుకుని వారి సమస్యలను తెలుసుకుని సహాయక చర్యలను సమన్వయం చేసిన రెవెన్యూ అధికారులు, గ్రామాల్లో రహదారులు, మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు కృషి చేసిన పంచాయతీరాజ్ సిబ్బంది, ప్రజలకు భద్రత కల్పిస్తూ వరద ప్రాంతాల్లో సహాయక చర్యల్లో పాల్గొన్న పోలీస్ శాఖ సిబ్బంది, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం సేవలందించిన వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, అలాగే ప్రతికూల పరిస్థితుల్లోనూ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు శ్రమించిన విద్యుత్ శాఖ సిబ్బంది చేసిన సేవలు మరువలేనివని మహమ్మద్ జమాల్ ఖాన్ అన్నారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు తమ ప్రాణాలకు, కుటుంబాలకు సంబంధించిన ఆందోళనలను పక్కనపెట్టి ప్రజల భద్రత, సంక్షేమం కోసం ముందుండి పనిచేసిన ప్రభుత్వ ఉద్యోగుల సేవాభావం ఎంతో గొప్పదని ఆయన పేర్కొన్నారు.వరదలు, తుఫాన్ వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలిచిన ప్రతి ఒక్క ప్రభుత్వ అధికారి, ఉద్యోగి, పోలీస్ సిబ్బంది, వైద్య సిబ్బంది, విద్యుత్ సిబ్బంది, పంచాయతీరాజ్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బందికి చింతూరు ప్రజల తరఫున మనస్ఫూర్తిగా ధన్యవాదాలు, ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నట్లు మహమ్మద్ జమాల్ ఖాన్ తెలిపారు.

# వరద పరిస్థితిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**వరద పరిస్థితిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**- 135 పునరావాస కేంద్రాలు, 161 గ్రామాల్లో ప్రత్యేక బృందాలు సిద్ధం**

**కూనవరం, వి.ఆర్.పురం మండలాల్లో కలెక్టర్ కే. దినేష్ కుమార్ క్షేత్రస్థాయి పరిశీలన**



చింతూరు, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ::: ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాల నేపథ్యంలో శబరి, గోదావరి నదుల వరద పరిస్థితిపై ప్రజలు రానున్న 24 నుంచి 48 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని పోలవరం జిల్లా కలెక్టర్ కే. దినేష్ కుమార్ కోరారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు పునరావాస కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.శనివారం చింతూరు డివిజన్ పరిధిలోని కూనవరం, వి.ఆర్.పురం ప్రాంతాల్లో కలెక్టర్ కే. దినేష్ కుమార్, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, సబ్ కలెక్టర్, ఐటీడీఏ పీవో శుభం నొక్వల్, ఓ ఎస్ డి జావలి ఇతర అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో నెలకొన్న వాస్తవ పరిస్థితులను స్వయంగా పరిశీలించి, వరద ప్రభావం, రహదారులు, రాకపోకలు, ప్రజల భద్రత, పునరావాస ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురవడం, ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలతో పాటు శబరి నది పరివాహక ప్రాంతంలో అధిక వర్షపాతం నమోదవడంతో శబరి నదికి భారీగా వరద ప్రవాహం వచ్చిందని కలెక్టర్ తెలిపారు. గతంలో 1986లో నమోదైన సుమారు 5.4 లక్షల క్యూసెక్కుల చారిత్రాత్మక వరదను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం ముందుగానే అప్రమత్తమై చర్యలు చేపట్టిందన్నారు.చింతూరు వద్ద శబరి నది నీటిమట్టం 43.5 అడుగులకు చేరిందని, ఇది సుమారు 3.5 నుంచి 4 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహానికి సమానమని తెలిపారు.ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికీ అక్కడి వరద నీరు దిగువ ప్రాంతాలకు చేరడానికి కొంత సమయం పడుతుందని చెప్పారు.వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో పోలీసు, రెవెన్యూ, ఐటీడీఏ, పంచాయతీరాజ్ తదితర శాఖల సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ మైకుల ద్వారా ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. చింతూరు డివిజన్‌లో సుమారు 135 పునరావాస కేంద్రాలను సిద్ధం చేసి, 161 గ్రామాల్లో ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో 124 మంది గర్భిణీలను గుర్తించి, ప్రసవ సమయం సమీపించిన 10 మందికి పైగా గర్భిణీలను ముందుగానే ప్రసవ కేంద్రాలకు తరలించినట్లు చెప్పారు. అత్యవసర వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా వైద్య ఆరోగ్య శాఖ బృందాలను కూడా అప్రమత్తం చేసినట్లు తెలిపారు. రానున్న 24 నుంచి 48 గంటలు అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. సాయంత్రం నుంచి గోదావరి నీటిమట్టం కూడా పెరిగే అవకాశం ఉన్నందున మొదటి, రెండో ప్రమాద హెచ్చరికలు జారీ అయ్యే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గోదావరి ప్రవాహం పెరిగినప్పుడు శబరి వరద నీరు దిగువకు వెళ్లే వేగం తగ్గి నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.వరదల కారణంగా రాకపోకలు నిలిచిపోయిన గ్రామాల్లోని ప్రజలకు నిత్యావసర సరుకుల కొరత లేకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు తీసుకుని బియ్యం, కందిపప్పు, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు, వంటనూనె తదితర నిత్యావసర సరుకులను బాధిత ప్రజలకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనలో వరద పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజల తరలింపు, పునరావాసం, ఆహారం, తాగునీరు, వైద్య సేవలు వంటి అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రాణ, ఆస్తి నష్టాన్ని సాధ్యమైనంత వరకు నివారించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# " పంట పొలాలను పరిశీలించిన వైసిపి ఇన్చార్జ్ వడ్డి రఘురామ్ నాయుడు"

తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 26 (నేటి- శుభోదయ) తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఎర్రకాలువ ఉధృతంగా ప్రవహించడంతో తాడేపల్లిగూడెం నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి.ముంపు కారణంగా పంటలు దెబ్బతిని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. నందమూరు, మారంపల్లి, జగన్నాథపురం, దండగర్ర, మాధవరం గ్రామాల్లో వడ్డి రఘురామ్ నాయుడు పర్యటించారు.పొలాల్లో నిలిచిన నీటిని పరిశీలిస్తూ రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను, పంట నష్టాన్ని, పెట్టుబడుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ముంపు కారణంగా పంటలు దెబ్బతిన్నాయని రైతులు తమ ఆవేదనను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పంట నష్టం మాత్రమే కాకుండా... పంట కోసం చేసిన పెట్టుబడులు కూడా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు వివరించారు.రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి.ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ నాయుడు మాట్లాడుతూ ముంపు కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంట పొలాల్లో ఎంత మేరకు నష్టం జరిగిందో అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో అంచనా వేయాలని కోరారు.రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చిన తర్వాత స్పందించడం కాకుండా ముంపు ప్రాంతాలను అధికారులు స్వయంగా పరిశీలించి పంట నష్టాన్ని నమోదు చేయాలని అన్నారు. నష్టపోయిన రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించాలని పంట నష్టం పరిహారం విషయంలో ప్రభుత్వం ఆలస్యం చేయకూడదని డిమాండ్ చేశారు. ఒక్క పార్టీ ప్రభుత్వం ఇచ్చిన పరిహారం కంటే... మూడు పార్టీలు మూడు రెట్లు ఇవ్వాలి: గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో పంట నష్టం జరిగిన సమయంలోనే పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకున్నామని వడ్డి రఘురామ్ నాయుడు పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మూడు పార్టీలు కలిసి అధికారంలో ఉన్నాయని ప్రస్తావిస్తూ... గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం కంటే ఇప్పుడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం మూడు రెట్లు పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ముంపు కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతులకు కనీసం రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు తక్షణ సాయం అందించాలని కోరారు.రైతులు మళ్లీ తదుపరి పంట సాగు చేసుకునే పరిస్థితి కల్పించాలంటే ప్రభుత్వం వెంటనే ఆర్థిక సహాయం అందించాల్సిన అవసరం ఉందన్నారు.



### నందమూరు అక్విడెక్ట్ వద్ద గుర్రపు డెక్క తొలగించాలని డిమాండ్:

నందమూరు అక్విడెక్ట్ ప్రాంతంలో నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న గుర్రపు డెక్కను తొలగించాల్సిన అవసరం ఉందని వడ్డి రఘురామ్ నాయుడు అన్నారు.గుర్రపు డెక్కను ముందుగానే తొలగించి ఉంటే నీటి ప్రవాహానికి ఇబ్బంది ఏర్పడేది కాదని ఆయన అభిప్రాయపడ్డారు.వర్షాకాలం ప్రారంభానికి ముందే అక్విడెక్టులు, కాలువలు, డ్రెయిన్లు, నీటి ప్రవాహ మార్గాలను పరిశీలించి అడ్డంకులను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు.వరదలు వచ్చిన తర్వాత హడావుడిగా చర్యలు చేపట్టడం కంటే... ముందస్తు ప్రణాళికతో అధికారులు పనిచేయాలని కోరారు.

### ప్రతి ఏడాది ముంపే... ముందస్తు చర్యలు ఏమిటి

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని ఈ ప్రాంతాలు ప్రతి ఏడాది వర్షాకాలంలో ముంపునకు గురవుతున్నాయని వడ్డి రఘురామ్ నాయుడు అన్నారు. ప్రతి సంవత్సరం ఇదే సమస్య పునరావృతమవుతున్నప్పుడు ముంపును నివారించేందుకు ప్రభుత్వం ముందస్తుగా ఎలాంటి చర్యలు తీసుకుంటోందో చెప్పాలని ప్రశ్నించారు. కాలువల్లో పూడికతీత, గుర్రపు డెక్క తొలగింపు, నీటి ప్రవాహ మార్గాల శుభ్రత, అక్విడెక్టుల నిర్వహణ వంటి అంశాలపై అధికారులు ముందుగానే దృష్టి పెట్టాలని అన్నారు. ముంపు వచ్చిన తర్వాత ప్రాంతాలను సందర్శించడం కంటే... ముంపు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే ప్రభుత్వ బాధ్యత అని వ్యాఖ్యానించారు.

### ఇరిగేషన్, రెవెన్యూ శాఖలపై విమర్శలు:

ముంపు సమస్యపై ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు తగిన స్థాయిలో స్పందించడం లేదని వడ్డి రఘురామ్ నాయుడు విమర్శించారు. రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి... పంట నష్టాన్ని నమోదు చేసి, సంబంధిత అధికారులకు నివేదికలు పంపి, పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు పంట నష్టంతో ఇబ్బందులు పడుతున్న సమయంలో శాఖల మధ్య సమన్వయం అవసరమని అన్నారు.

### యూరియా బ్లాక్ మార్కెట్‌పై ఆగ్రహం:

ఇదే సమయంలో రైతులకు అవసరమైన యూరియా విషయంలో కూడా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని వడ్డి రఘురామ్ నాయుడు డిమాండ్ చేశారు. యూరియాను బ్లాక్‌లో విక్రయిస్తున్నారనే ఆరోపణలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అక్రమ విక్రయాలకు పాల్పడుతున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పంట నష్టంతో ఇబ్బందులు పడుతున్న రైతులకు మరోవైపు ఎరువుల సమస్య కూడా ఎదురైతే వారి పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని అన్నారు. ఫార్మాలిటీ కోసం వచ్చి ఫోటోలు తీసుకుని వెళ్లిపోవడం కాదు ముంపు ప్రాంతాలను సందర్శించడం కేవలం ఫార్మాలిటీగా మారకూడదని వడ్డి రఘురామ్ నాయుడు అన్నారు.ప్రాంతానికి వచ్చి రైతులతో మాట్లాడి, ఫోటోలు తీసుకుని వెళ్లిపోవడం కాకుండా... వారి సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.రైతుల పొలాల్లోకి నీరు ఎందుకు చేరుతోంది నీరు వేగంగా బయటకు వెళ్లేందుకు ఎలాంటి అడ్డంకులు ఉన్నాయి... వాటిని శాశ్వతంగా ఎలా పరిష్కరించాలి... అనే అంశాలపై అధికారులు సమగ్రంగా అధ్యయనం చేయాలని అన్నారు.

### రూ.25 వేల నుంచి రూ.30 వేల తక్షణ సాయం ఇవ్వాలి

ముంపుతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు తక్షణ సాయం అందించాలని వడ్డి రఘురామ్ నాయుడు డిమాండ్ చేశారు.పంట నష్టాన్ని అంచనా వేసే ప్రక్రియ పూర్తయ్యే వరకు రైతులు ఎదురుచూసే పరిస్థితి లేకుండా... అత్యవసర సాయంగా తక్షణ ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అదేవిధంగా పూర్తి స్థాయి పంట నష్టాన్ని అంచనా వేసి... ప్రభుత్వ నిబంధనల ప్రకారం అదనపు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

### రైతుల కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వడ్డి రఘురామ్ నాయుడు కోరారు.ముంపు ప్రాంతాల్లోని రైతులకు న్యాయం చేయకపోతే... వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున రైతుల కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.రైతుల పంట నష్టం, ముంపు సమస్య, ఎరువుల సమస్య, నష్టపరిహారం వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఎర్రకాలువ ముంపు సమస్యకు తాత్కాలిక చర్యలతో కాకుండా... శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు.నందమూరు నుంచి మారంపల్లి, జగన్నాథపురం, దండగర్ర, మాధవరం వరకు ముంపు ప్రభావిత ప్రాంతాలను సమగ్రంగా పరిశీలించి... రైతులకు భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.రైతుల పంటను కాపాడటంతో పాటు... నష్టపోయిన రైతులకు తక్షణ సాయం అందించి, భవిష్యత్తులో ముంపు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని వడ్డి రఘురామ్ నాయుడు డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# రఫీ పై కేసు నమోదు : సి ఐ

ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ::: బుధవారం రాత్రి సమయంలో పువ్వాడ ఉదయ నగర్ గ్రామం వద్ద షేక్ రఫీ, తండ్రి సొందుమియా, వయసు (39) సంవత్సరాలు, కులం: ముస్లిం, వృత్తి: ఆటో డ్రైవర్ ఆర్ /ఓ పువ్వాడ ఉదయ నగర్ గ్రామం అనే వ్యక్తి ఒక డమ్మీ కత్తి తో వినాయక నిమజ్జనం యాత్రలో డ్యాన్స్ చేయడం జరిగింది. ఈ వీడియో సోషల్ మీడియాలో రావడం జరిగింది. ఇలా ఆయుధాలు లేదా వాటిని పోలిన వాటిని పబ్లిక్ లో ప్రదర్శించడం నేరం కావున సదరు షేక్ రఫీ పై రఘునాథపాలెం పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగింది. ఎవరైనా భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు పాల్పడిన కేసులు నమోదు చేయడం జరుగుతుంది. శాంతి భద్రతకు భంగం కలిగించే వారి పై కటిన చర్యలు తీసుకుంటాం అని రఘు నాథ పాలెం సి ఐ తెలిపారు.

## పూజా హాస్పిటల్ డాక్టర్ చిర్రా బాబు రావు తండ్రి నాగయ్య ప్రధమ వర్ధంతి కార్యక్రమం



తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ::: ఖమ్మంలో ప్రముఖ వైద్యులు పూజ ఆస్పటల్ డాక్టర్ చిర్రా బాబురావు, తండ్రి నాగయ్య ప్రధమ వర్ధంతి కార్యక్రమం శనివారం తిరుమలాయపాలెం మండల పరిధిలోని కొక్కిరేణి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గాను జిల్లా టీజేఏసీ చైర్మన్ మందడి ఇజ్రాయిల్, ఆయనతోపాటు జిల్లా ప్రముఖులు చిర్రా నాగయ్యకు ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో నేటి శుభోదయ, బంధువులు నెలమరి రామచంద్రు, అంగిరేకుల నరసయ్య, కొమ్ము, రాఘవులు, చుంచు రాము, కొప్పుల బాబు, తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలాయపాలెం ఎస్సై ని పరామర్శించిన జిల్లా టి జేఏసీ చైర్మన్ మందడి ఇజ్రాయిల్



తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ::: తిరుమలాయపాలెం మండల పరిధిలోని మంగళవారం గణేష్ నిమజ్జనం సందర్భంగా జరుగుతున్న వేడుకలలో పర్యవేక్షణ నిమిత్తం మండలంలో పర్యటించి రాత్రి ఒంటిగంట సమయంలో పోలీస్ స్టేషన్ కు చేరుకునే సమయంలో భవానీ హోటల్ దగ్గర

(గౌరమ్మ రాయి చెట్టు మూల మడతవద్ద) జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ తిరుమలాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్, ఆయన డ్రైవర్ రాకేష్ గాయపడ్డ విషయం మనందరికీ విదితమే ఆయన చికిత్స పొందుతున్న ఖమ్మం ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో ఖమ్మం జిల్లా టీజేసి చైర్మన్ మరియు పత్రిక విలేకరులు ఆయనని పరామర్శించి , కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీజేఏసీ జిల్లా చైర్మన్ మందడి ఇజ్రాయిల్,

జనం సాక్షి పత్రిక విలేఖరి ఏలూరు ఆనందరావు, నేటి శుభోదయ పత్రిక విలేఖరి గాదరి బాబు, ప్రథమ చికిత్స డాక్టర్ గండమల్ల జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

# వరద ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ చర్యలు చేపట్టాలి

**- పంట పొలాల్లో నిలిచిన నీటిని వెంటనే తొలగించాలి**

**- నష్టం వివరాలను తక్షణమే సమర్పించాలి : జిల్లా కలెక్టర్ కే. దినేష్ కుమార్**

చింతూరు, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ::: వరదలు, భారీ వర్షాల ప్రభావంతో నష్టపోయిన ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేసి, ప్రజలకు అవసరమైన సహాయాన్ని తక్షణమే అందించాలని పోలవరం జిల్లా కలెక్టర్ కే. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం చింతూరు ఐటీడీఏ సమావేశ మందిరంలో చింతూరు డివిజన్‌కు చెందిన ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ కె దినేష్ కుమార్ మాట్లాడుతూ వర్షాలు ప్రస్తుతం తగ్గుముఖం పట్టినందున వ్యవసాయ పొలాల్లో నిలిచిన నీటిని శనివారం సాయంత్రంలోగా పూర్తిగా తొలగించేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల శాఖల అధికారులను ఆదేశించారు. పొలాల్లో ఎక్కువ కాలం నీరు నిలిచిపోతే పంటలు దెబ్బతినే అవకాశం ఉన్నందున నీటిని బయటకు మళ్లించే ఏర్పాట్లు యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. వరద నీటితో ముంపునకు గురైన కొన్ని నివాస ప్రాంతాల్లో కూడా నీటిని సాయంత్రంలోగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నష్టం వివరాలను వెంటనే సమర్పించాలి వరదల కారణంగా వ్యవసాయ, ఉద్యానవన పంటలకు జరిగిన నష్టం, ఇళ్లు దెబ్బతిన్న వివరాలు, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లు, పశువుల నష్టం, ఇతర ఆస్తుల నష్టానికి సంబంధించిన సమగ్ర వివరాలను అన్ని శాఖల అధికారులు వెంటనే సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు కొన్ని శాఖలు నష్టం వివరాలను సమర్పించకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేస్తూ, నష్టం అంచనా వివరాల సేకరణలో ఎటువంటి జాప్యం ఉండరాదని స్పష్టం చేశారు. వ్యవసాయం, ఉద్యానవనం, నీటిపారుదల, రహదారులు, విద్యుత్ తదితర శాఖల అధికారులు తమ పరిధిలో జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి ఖచ్చితమైన వివరాలను అందించాలన్నారు. రహదారులు, విద్యుత్ సరఫరా వ్యవస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాల భవనాలు తదితరాలకు జరిగిన నష్టాన్ని గుర్తించి తక్షణ మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు,వరద ప్రభావిత కుటుంబాలకు అవసరమైన నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచి, అర్హులైన ప్రతి బాధిత కుటుంబానికి పంపిణీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి కుటుంబానికి ఒక కిలో బంగాళాదుంపలు, ఒక కిలో ఉల్లిపాయలు, ఒక కిలో పప్పు, ఒక లీటర్ పామ్ ఆయిల్ అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సహాయ సామగ్రిని జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్ సమన్వయంతో కొనుగోలు చేసి అందుబాటులో ఉంచాలని, చింతూరు డివిజన్‌లోని వరద ప్రభావిత కుటుంబాలన్నింటికీ సరుకులు చేరేలా ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఇప్పటికే అవసరమైన సామగ్రితో పాటు అదనంగా కావాల్సిన సరుకుల కోసం ఇండెంట్ సిద్ధం చేసి తక్షణమే పంపాలని సూచించారు. అలాగే వరద ప్రభావిత కుటుంబాల పూర్తి గణనను నిర్వహించి, ఎవరెవరికి సహాయ సామగ్రి అవసరమో కుటుంబాల వారీగా జాబితా సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.



### అధికారుల సమన్వయంతో సహాయక చర్యలు

వరద అనంతర పరిస్థితుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను వెంటనే గుర్తించి, వాటికి తక్షణ పరిష్కారం చూపాలని ఆదేశించారు. వ్యవసాయం, ఉద్యానవనం, నీటిపారుదల, రహదారులు, విద్యుత్, రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేయాలన్నారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్, సబ్ కలెక్టర్ , చింతూరు పీవో శుభం నొక్వల్, ఓ ఎస్ డి జావళి, పశుసంవర్ధక డిప్యూటీ డైరెక్టర్ షేక్ అహ్మద్ షరీఫ్, ఎస్ డి సి బాలకృష్ణ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదానం, డ్వామా పిడి బి. రాంప్రసాద్, పి హెచ్ ఓ నరేంద్ర కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామ్మోహన్ రావు, జిల్లా మత్స్యశాఖ అధికారి దిల్షాద్, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. ఉమా,ఎ పి ఓ జనరల్ రామ తులసి, డిఇ లు సుబ్బారావు, శ్రీరామచంద్రమూర్తి, వివిధ శాఖల అధికారులు, చింతూరు డివిజన్‌కు చెందిన ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఐ ఎఫ్ టి యు జాతీయ నాయకులు పోటు ప్రసాద్ ని మర్యాద పూర్వకంగా కలిసిన ఖమ్మం జిల్లా టీ జెఏసి చైర్మన్ మందడి ఇజ్రాయిల్



తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ::: ఖమ్మం లోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో పిడిఎస్ యు పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమానికి హాజరైన సందర్భంగా శనివారం జిల్లా టి జేఏసీ చైర్మన్ మందడి ఇజ్రాయిల్ పోటు ప్రసాద్(పీపీ )ని మర్యాదపూర్వకంగా కలిసి ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాల గురించి విస్తృతంగా చర్చించారు. తదనంతరం టీజేఏసీ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో మాకు మీ సహకారం కావాలని ఆయనను కోరారు ఆయన దానికి సానుకూలంగా స్పందించారు.

## జిల్లా ఆర్యవైశ్య మీడియా వైస్ చైర్మన్‌గా చెన్నకేశవరావు



దుర్గి, సెప్టెంబర్ 26; ఆర్ సి ఇన్చార్జ్;నేటి శుభోదయ: పల్నాడు జిల్లా ఆర్యవైశ్య ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా వైస్ చైర్మన్‌గా దుర్గికి చెందిన ఓబుల్‌శెట్టి చెన్నకేశవరావు నియమితులయ్యారు. ఈ మేరకు పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చందోలు వెంకటకృష్ణ సూర్యప్రకాష్ రావు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా చందోలు వెంకటకృష్ణ సూర్యప్రకాష్ రావు మాట్లాడుతూ.. ఆర్యవైశ్య సమాజ అభివృద్ధితో పాటు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా పాత్ర ఎంతో కీలకమన్నారు. జిల్లాలోని ఆర్యవైశ్య విలేకరుల సంక్షేమానికి, మీడియా విభాగాన్ని మరింత బలోపేతం చేసేందుకు చెన్నకేశవరావు కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.తనపై నమ్మకంతో జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించిన జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చందోలు వెంకటకృష్ణ సూర్యప్రకాష్ రావుకు చెన్నకేశవరావు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని ఆర్యవైశ్య ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ సంఘం ఆశయాలకు అనుగుణంగా బాధ్యతాయుతంగా పనిచేస్తానన్నారు. చెన్నకేశవరావు నియామకం పట్ల పల్నాడు జిల్లా, స్థానిక ఆర్యవైశ్య సంఘ నాయకులు, ప్రముఖులు, వివిధ పత్రికలు, టీవీ ఛానళ్ల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

## ఐసిడిఎస్ శాఖపై జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సమీక్ష..



అనంతపురం, సెప్టెంబర్ 26 నేటి శుభోదయ : అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో శనివారం జిల్లా మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ (ఐసిడిఎస్)పై జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో అంగన్వాడీ సేవల అమలు, పోషకాహార పంపిణీ, పోస్టుల భర్తీ మరియు పిల్లల హాజరు తీరుపై జిల్లా కలెక్టర్ సమీక్ష జరిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, రోస్టర్ సమర్పించని సీడీపీవోలపై తక్షణమే ఛార్జ్ మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. గత సమావేశపు అంశాలపై తగిన యాక్షన్ టేకన్ రిపోర్ట్ సమర్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కంబదూరు ప్రాజెక్టులో ఎస్ఎన్పీ పంపిణీ 95 శాతంతో చివరి స్థానంలో ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ల ఆలస్యంపై తగిన ఆధారాలతో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని, ప్రతీ ప్రాజెక్టు 100 శాతం లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. అనంతపురం రూరల్ మరియు కనేకల్ తదితర ప్రాంతాలలో 3 నుండి 6 సంవత్సరాల పిల్లల ప్రీ-స్కూల్ హాజరు శాతం మెరుగుపడాలని ఆదేశించారు. పిల్లలు రాని పక్షంలో అంగన్వాడీ వర్కర్లు మరియు సూపర్వైజర్లు వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి, ఫోన్ / వీడియో కాల్స్ ద్వారా నిత్యం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. తీవ్ర పోషకాహార లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రాయదుర్గం, డి.హీరేహాళ్ తదితర ప్రాంతాల్లో ఉన్న ప్రత్యేక కేసులపై సమీక్ష జరిపి తగిన వైద్య సేవలు అందించాలన్నారు. అన్ని ప్రాజెక్టుల్లోనూ పనులు మెరుగుపడాలని, నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై శాఖాపరమైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సిడిపిఓలు, సూపర్వైజర్ల పనితీరు మరింత మెరుగుపడాలన్నారు. చిన్నారులకు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారాన్ని సరైన సమయానికి ఇవ్వాలన్నారు. టేక్ హోమ్ రేషన్ పంపిణీలో వెనుకబడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ ఉత్సవ్ కు సంబంధించిన పోస్టర్ లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సమావేశంలో ఐసిడిఎస్ పిడి సాజిదాబేగం, డిఈఓ అయూబ్ హుస్సేన్, సమగ్ర శిక్ష ఏపిసి శైలజ, డిఎంహెచ్ఓ డా.కె. వెంకటేశ్వర్లు, సిడిపివోలు, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .

## మాచర్లలో రాజకీయ పార్టీలతో ఎస్ఐఆర్‌పై సమావేశం



మాచర్ల:ఆర్ సి ఇన్చార్జ్ సెప్టెంబర్ 26 ;నేటి శుభోదయ: మాచర్ల తహశీల్దార్ కార్యాలయంలో శనివారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏఈఆర్ఓలు, తహశీల్దార్‌తో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై సమావేశం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి, 101-మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గం ఈఆర్ఓ ఆదేశాల మేరకు సాయంత్రం 5 గంటలకు ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ షెడ్యూల్, హియరింగ్స్ నిర్వహణ విధానం, తదితర అంశాలపై అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. పెండింగ్‌లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల పరిశీలన, వాటిపై తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై చర్చించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, సంబంధిత వర్గాలు సహకరించాలని అధికారులు సూచించారు. సమావేశంలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన పలు అంశాలపై ప్రతినిధులు చర్చించారు.

## వెంకన్న కు అభినందనలు తెలిపిన పంది రాజు గౌడ్



ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :: తొలిసారి మా నూతన గృహానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ ఖమ్మం జిల్లా మెంబర్ గజ్జెల్లి వెంకన్న కి కాంగ్రెస్ నాయకులు పంది రాజు గౌడ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రజాసేవలో నిరంతరం శ్రమిస్తున్న మీకు, ఆ భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలను, ఆనందాలను అందించాలని మనసారా కోరుకుంటున్నాను అని పంది రాజు గౌడ్ తెలిపారు.

## బంగారం ఫైనాన్సర్ 96 లక్షలకు దివాలా పిటిషన్ దాఖలు

ఖమ్మం లీగల్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ::: ఖమ్మం పట్టణంలోని వైయస్సార్ కాలనీ చెందిన ప్రతి గడప రాజీవ్ రాజు 96 లక్షల ఇరవై వేలకు ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో మొత్తం ఐదుగురు ప్రతివాదులపై తాను చేసే బంగారం ఫైనాన్స్ నష్టాలు రావడంతో ప్రతివాదులు ఒత్తిడి చేయడంతో తన న్యాయవాది అయిన కూనాటి చంద్రశేఖర్ ద్వారా శనివారం దివాలా పిటిషన్ దాఖలు చేశాడు.

## రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన



దుర్గి: ఆర్ సి ఇన్చార్జ్ సెప్టెంబర్ 26 ;నేటి శుభోదయ: రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని దుర్గి ఎస్ఐ బి. గోపాల్ సూచించారు. శనివారం దుర్గి మెయిన్ సెంటర్‌లో ఆయన ఆధ్వర్యంలో వాహనదారులకు రోడ్డు భద్రత, హెల్మెట్ ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గోపాల్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రమాదాల సమయంలో హెల్మెట్ తలకు తీవ్ర గాయాలు కాకుండా ప్రాణరక్షణ కల్పిస్తుందని తెలిపారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం వంటి వాటికి దూరంగా ఉండాలని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రమాదాల నివారణకు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ గోపాల్ కోరారు.

## పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి



మాచర్ల: ఆర్సి సి ఇన్చార్జ్ సెప్టెంబర్ 26; నేటి శుభోదయ :భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుల్లో ప్రముఖులు, ఏకాత్మ మానవతావాద సిద్ధాంత ప్రతిపాదకుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని మాచర్ల పట్టణ బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశానికి పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అందించిన సేవలను, పార్టీ బలోపేతానికి చేసిన కృషిని స్మరించుకున్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మాచర్ల పట్టణ అధ్యక్షుడు ఓర్సు క్రాంతి కుమార్, సీనియర్ నాయకుడు బొగ్గవరపు మస్తాన్‌రావు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఏచూరి సురేష్‌బాబు, ఉపాధ్యక్షులు రమావత్ శివకోటయ్య నాయక్, వరకవి నాగరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## “శాసనసభ్యులు బొలిశెట్టిని మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ మండల పరిషత్ అధ్యక్షురాలు కట్టుబోయిన వెంకటలక్ష్మి”



తాడేపల్లిగూడెం సెప్టెంబరు 26 (నేటి- శుభోదయ) పెంటపాడు మండల పరిషత్ మాజీ అధ్యక్షురాలు కట్టుబోయిన వెంకటలక్ష్మి ఆమె భర్త కట్టు బోయిన కృష్ణ ప్రసాద్ దంపతులిద్దరూ తాడేపల్లిగూడెం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బోలిశెట్టి శ్రీనివాసు ను ఆయన గృహములో శనివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ కట్టుబోయిన వెంకటలక్ష్మి మాట్లాడుతూ తనకు ఎంపీపీగా అవకాశం ఇచ్చిన శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆయనను సన్మానించి మెమొంటో బహుకరించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. పదవి ఉన్న, లేకపోయినా ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి శక్తివంతన లేకుండా కృషి చేస్తామని ఈ సందర్భంగా దంపతులిద్దరూ తెలియజేశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో జనసేన పార్టీకి అంకితభావంతో పనిచేస్తామని శాసనసభ్యులకు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షులు పుల్లా బాబి, మైలవరపు పెదబాబు, కూచిపూడి అనిల్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పుల్లా బాబీ గారు, మైలవరపు పెదబాబు గారు మరియు కూచిపూడి అనిల్

## కోరుకొండ క్షేత్రంలో వైభవంగా శ్రీ పరాసర శ్రీ లక్ష్మీనరసింహభట్టర్ గారి 81వ జన్మదిన శతాభిషేక మహోత్సవం

**- పాదపూజ, గజమాలలతో సత్కరించిన శిష్యులు,**

**నాయకులు తెలగంశెట్టి శ్రీనివాస్ దంపతులు, కటకం చలం దంపతులు..!!**



కోరుకొండ, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన ప్రాంగణంలో శ్రీ పరాసర శ్రీ లక్ష్మీనరసింహభట్టర్ 81వ జన్మదిన శతాభిషేక మహోత్సవం శనివారం సాయంత్రం 6:00 గంటలకు తెలగంశెట్టి శ్రీను, కటకం చలం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం శ్రీ పరాసర రంగరాజ భట్టర్ స్వామి వారి దివ్య నేతృత్వంలో, ఆలయ అర్చకులు మరియు అధ్యాపక స్వాముల సంప్రదాయ వేద మంత్రోచ్చారణల నడుమ భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. విశేష పూజాధిపత్యం: శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి సన్నిధిలో అర్చక బృందం ప్రత్యేక పూజలు, సంప్రదాయపారాయణాలు పూర్తి చేశారు. ఈ పవిత్ర శతాభిషేక మహోత్సవానికి వేలాది సంఖ్యలో భక్తులు, అభిమానులు తరలివచ్చారు. గురుదేవుల ఆశీస్సులు: విచ్చేసిన భక్తులందరూ స్వామివారి మంగళాశాసనాలను స్వీకరించి, పూజ్య గురువుగారి దివ్య ఆశీస్సులను పొంది పునీతులయ్యారు. ఈ కార్యక్రమం తెలగంశెట్టి శ్రీను, కటకం చలం అత్యంత శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రాజకీయవేత్తలు, భక్తులు స్థానిక నాయకులు, గ్రామస్తులు కూడా పాల్గొన్నారు.



## ఏపీ ఎన్ఐటి విస్తరణకు భూములు పరిశీలించిన జాయింట్ కలెక్టర్ కల్పశ్రీ”



తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 26 (నేటి- శుభోదయ) తాడేపల్లిగూడెంలో గల ఏపీ ఎన్ఐటి విస్తరణకు అవసరమైన భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పశ్రీ కె.ఆర్. శనివారం పరిశీలించారు. రెవెన్యూ, ఎన్ఐటి అధికారులతో కలిసి జాయింట్ ఇనస్పెక్షన్ చేశారు. ఎన్ఐటి పడమర వైపు ఉన్న భూమిని చూశారు. గాంధీ బొమ్మ సెంటర్ నుంచి ఏపీ ఎన్ఐటి కి వెళ్లే దారిలో కొండాలమ్మ గుడి, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు సమీపంలో గల భూములను సందర్శించారు. ఆర్డీవో ఎం.సూర్యారావు, తహసిల్దార్ ఎం.సునీల్ కుమార్ లు వీటికి సంబంధించిన మ్యాపును చూపించి జాయింట్ కలెక్టర్ కు సమగ్రంగా వివరించారు. ఆమె పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్.ఐ.టి. రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి ఇప్పుడున్న ఎన్ఐటి లోని వసతులు గురించి జాయింట్ కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జెసి కల్పశ్రీ మాట్లాడుతూ ఏపీ ఎన్ఐటిని విస్తరించేందుకు 50 ఎకరాలు భూములు కావాలని కోరారని తెలిపారు. అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న 25 ఎకరాలను పరిశీలించడం జరిగిందన్నారు. ఈ భూములు ఇవ్వడానికి గల అవకాశాలను, సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని చెప్పారు. పలువురు గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 28 నుండి ప్రారంభం కానున్న ఏఐకేఎంఎస్ అఖిలభారతం మహాసభలు

**- పూర్వ పిడిఎస్ యు మిత్రుల ఆత్మీయ సమ్మేళనంలో వక్తలు**




ఖమ్మం సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ::: సెప్టెంబర్ 28 నుండి ప్రారంభం కానున్న ఏఐకే ఎం ఎస్ అఖిలభారతం మహాసభల పూర్వ పిడిఎస్ యు మిత్రుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక వేదిక ఫంక్షన్ హాల్ లో పిడిఎస్ యు పూర్వ నాయకురాలు మణి అధ్యక్షతన జరిగిన సభలో పూర్వ ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల ప్రదీప్, పి ప్రసాద్ లు మాట్లాడుతూ భారత పాలకులు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా దేశ వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోమలకు నిట్టబడి రైతాంగం జీవితాలు బుగ్గిపాలవుతున్న సందర్భంలో ఏఐకేఎం ఎస్ అఖిల భారత నాలుగో మహాసభ ఖమ్మం నగరంలో జరుగుతున్నాయని ఈ మహాసభలకు హార్దిక సంఘీభావాన్ని భాగస్వామ్యాన్ని ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. సంపద సృష్టికర్తలైన వారిలో రైతన్న ఒకరిని ఇవ్వాలా “నూతన విత్తన పాలసీ” “విద్యుత్ సవరణ బిల్లు “ “మూడు వ్యవసాయ సాగు చట్టాలు” వంటి విధానాలు భారత వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్కరించే దిశగా వేగంగా జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వదేశీ,విదేశీ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పుల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు ఎస్ వెంకటేశ్వరరావు చిట్టి పాటి వెంకటేశ్వర్ల కాకి భాస్కర్ (స్వర్ధ అధ్యయన వేదిక) ఏం పుల్లయ్య గుర్రం నాగయ్య ఎం శ్రీనివాస్ తాలూరి వేణు సిర్ర రవి విజయ్ దేవ రెడ్డి ప్రముఖ కవి ఎన్. తిరుమల్ అన్యాయవాదులు పురుషోత్తం బి తిరుమల విప్లవ కుమార్ ఆల్ ఇండియా రైతు కూలీ సంఘం జాతీయ మహాసభలకు సహకరించండి. పిడిఎస్ యు ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల ప్రదీప్ పి ప్రసాద్ లు పిలుపునిచ్చారు.

## యాడికిలో ఘనంగా శ్రీ రమ సత్యనారాయణ స్వామి వ్రతం



యాడికి సెప్టెంబర్ 26 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల కేంద్రంలోని ఆర్యవైశ్య వీధిలో గల శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి శాలలో భాద్రపద పౌర్ణమి సందర్భంగా శ్రీశ్రీశ్రీ రమ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయమే స్వామివారికి విశేష అభిషేకం, నవగ్రహ పూజ, అష్ట దిక్పాలకుల పూజ తదితర వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా కనులపండువగా చేపట్టారు. అనంతరం ఐదు కథలతో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఘనంగా పూర్తి చేశారు. ఈ వేడుకకు మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని వ్రతంలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో యాడికి ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు మరియు బంగారు బాల, రాజేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## రోప్‌లైన్ కాలనీలో ఇంటింటికీ టీడీపీ



మాచర్ల:ఆర్ సి ఇంచార్జి సెప్టెంబర్ 26;నేటి శుభోదయ : మాచర్ల పట్టణంలోని 8వ వార్డు రోప్‌లైన్ కాలనీలో టీడీపీ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటికీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. 8వ వార్డు ఇన్‌చార్జ్ కజ్జం సైదయ్య, వార్డు అధ్యక్షుడు మద్దిగపు శ్రీనివాసరెడ్డి (బుల్లిరెడ్డి), ఉపాధ్యక్షుడు వంకాయలపాటి నరేష్‌కుమార్, 67వ బూత్ ఇన్‌చార్జ్ వంకాయలపాటి రాజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు వార్డులోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. వార్డులో నెలకొన్న సమస్యలను సంబంధిత నాయకుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## యాడికిలో ఘనంగా శ్రీ పెద్దమ్మ తల్లి ప్రత్యేక పూజలు



యాడికి సెప్టెంబర్ 26 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : భాద్రపద పౌర్ణమి సందర్భంగా మండల కేంద్రంలోని మెయిన్ బజార్లో వెలసిన శ్రీ పెద్దమ్మ తల్లికి ఆలయంలో ప్రత్యేక పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయమే అమ్మవారికి విశేష అభిషేకం, కుంకుమార్చన పూజలతో పాటు ఖడ్గమాల మరియు మణిద్వీప వర్ణన తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేపట్టారు. ఈ వేడుకకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం అంతా పెద్దమ్మ తల్లి ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా విజయవంతమైంది.

## యాడికి మండల ప్రత్యేక అధికారిగా వరప్రసాద్ బాధ్యతల స్వీకరణ - ఘన సన్మానం



యాడికి సెప్టెంబర్ 26 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల పరిషత్ కాలపరిమితి ముగియడంతో, ఆ స్థానంలో మండల ప్రత్యేక అధికారిగా నియమితులైన జిల్లా చేనేత మరియు జౌళి శాఖాధికారి పి.వరప్రసాద్‌ను యాడికి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అధికారి ప్రత్యేక చొరవ చూపి కృషి చేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గొర్తి రుద్రమ నాయుడు, నిట్టూరు రాజారెడ్డి, దామినేని నరసింహ చౌదరి, కోడూరు నీలకంఠ రెడ్డి, గంగాధర్, రామారావు, సుభాన్, ఆదినారాయణ, చంద్రమోహన్, రేషన్ దుకాణాల డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి సమగ్ర ప్రణాళికలే కీలకం

**- వికసిత గ్రామపంచాయతీపై జిల్లాస్థాయి శిక్షణ**




ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ::: ఖమ్మం జిల్లా కేంద్రంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో వికసిత గ్రామపంచాయతీ ప్రణాళిక, వర్షపు నీటి ప్రవాహ నివారణ ప్రణాళికతో పాటు అక్టోబర్ 2026 నుంచి జూన్ 2027 వరకు గ్రామ పంచాయతీల ప్రాధాన్యతా అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై శిక్షణ, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాలు, ఇంకుడు గుంతలు, వ్యవసాయ కుంటలు, ఊట కుంటలు, జల నిధి, బోర్ రీఛార్జ్ వంటి నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు సంబంధించిన అంశాలను వివరించారు. అలాగే గ్రామపంచాయతీ కార్యాలయ పరిధిలోని ఆస్తుల వివరాల నమోదు, తాగునీటి వసతులు, జాబ్ కార్డులు తదితర అంశాలను సమగ్రంగా ప్రణాళికలో పొందుపరచే విధానంపై అవగాహన కల్పించారు. గ్రామ అవసరాలను గుర్తించి అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత క్రమాన్ని నిర్ణయించుకోవాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, గ్రామ, మండల స్థాయి వి.బి.జి. రామ్‌జీ సిబ్బంది, జిల్లా స్థాయి అధికారులు, డీపీవోలు, వివిధ హోదాల్లోని ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, ఉపాధి, నీటి సంరక్షణ, మౌలిక వసతులు తదితర అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా సమగ్ర గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని ఈ సందర్భంగా సూచించారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పోలీస్ ఫ్యామిలీ క్వార్టర్స్‌లో అన్నదానం



ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ ::: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఖమ్మం పోలీస్ ఫ్యామిలీ క్వార్టర్స్‌లో పోలీస్ కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా పోలీస్ కుటుంబాలు ఏర్పాటు చేసిన గణేష్ మండపాన్ని పోలీస్ కమిషనర్‌తో పాటు పోలీస్ అధికారులు సందర్శించి, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పాల్గొని, పోలీసు సిబ్బందికి మరియు వారి కుటుంబ సభ్యులకు స్వయంగా భోజనాలు వడ్డించారు. పోలీస్ కుటుంబాలతో కలిసి గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనడం ద్వారా సిబ్బందిలో ఆత్మీయత, కుటుంబ భావన మరింత బలపడుతుందని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.

**గణేష్ విగ్రహ ఊరేగింపులో పాల్గొన్న పోలీస్ సిబ్బంది:** పది రోజులుగా గణేష్ నవరాత్రుల బందోబస్త్ విధులలో వున్న పోలీస్ సిబ్బంది ఈ రోజు గణేష్ నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన గణేష్ విగ్రహ శోభాయాత్రలో పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో సాగిన శోభాయాత్రలో పోలీస్ సిబ్బంది పాల్గొని, ఉత్సవాల నిర్వహణలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో ఇంటిలిజెన్స్ ఎస్పీ రామానుజం, అడిషనల్ డీసీపీ రామానుజం, ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి,విజయబాబు, టౌన్ ఏసీపీ రమణమూర్తి, రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి, ఎస్బీ ఏసీపీ మహేష్, సర్వర్,శ్రీనివాసులు, ఏఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, ఆర్ ఐ లు కామరాజు, సురేష్, అప్పలనాయుడు, సాంబశివరావు, సిఐ లు తదితరులు పాల్గొన్నారు.

# గ్లామర్ లోకంలో డాక్టర్ శ్రీలీల!



తెలుగు నటి శ్రీలీల డ్యాన్స్‌లు, నటనతోనే కాదు. చదువు పట్ల తనకున్నఅంకితభావంతోనూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఒకవైపు స్టార్ హీరోలతో వరుస సినిమాలు చేస్తూ బిజీగా ఉంటూనే మరోవైపు ఎంబీబీఎస్ కోర్సును విజయవంతంగా పూర్తి చేయడం హీరోయిన్లలో అరుదైన విషయం. నటిగా కొనసాగుతూ డాక్టర్ర లాంటి పెద్ద చదువును పూర్తి చేయడం అంటే ఆషామాషీ కాదు. రెండు రంగాలపై ఎంతో ఫ్యాషన్ ఉంటే తప్ప సాధ్యం కాదు. మరి వీటిని శ్రీలీల ఎలా బ్యాలెన్స్ చేస్తుంది? అంటే సినిమా షూటింగులు - మెడికల్ చదువులను మేనేజ్ చేయడం ఎలా సాధ్యమని అడిగితే ఆసక్తికర సమాధానం చెప్పింది. దీనికి అచంచలమైన సంకల్పం ఓపిక ఎంతో అవసరం. ఒక్కోసారి పరిస్థితులు క్లిష్టంగా మారతాయి. ఏమీ అర్థం కానట్టు అనిపిస్తుంది. అలాంటప్పుడు సహనంతో నిరణజ్ఞాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎంత ఇష్టమున్నా? ఒకేసారి రెండింటిలో కొనసాగి ఇబ్బంది పడటం అవసరమా? అనిపిస్తుంది. కానీ మనసు ప్రశాంతంగా ఉంచుకుని నిర్ణయాలు తీసుకుంటే ఏదైనా సాధించొచ్చు అంటుంది. వైద్య వృత్తిపై ఉన్న ఇష్టం, ఆ సబ్జెక్టుపై ఉన్న మక్కువ తనను ముందుకు నడిపించాయంది. పని ఒత్తిడిలో కూడా మనసును ఒక విషయం నుండి మరొక విషయానికి మార్చుకోగలగడం తన విజయ రహస్యంగా తెలిపింది. శ్రీలీల మామ్ కు, తాతయ్యకు ఇచ్చిన మాట కోసం ఎంబీబీఎస్ పూర్తి చేయడానికి ఎంతో శ్రమించింది. షూటింగ్ బ్రేక్స్‌లో కారవాన్‌లో కూర్చుని చదువుకునేది. సెట్స్‌లో ఉన్నప్పుడు కూడా మెడికల్ పుస్తకాలను వెంట ఉంచుకో వడం అలవాటుగా మార్చుకుంది. ముంబైలోని డి.వై. పాటిల్ యూనివర్సిటీ నుండి ఇటీవల పట్టా పొందిన సమయంలో ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారంటే? ఆ డిగ్రీ వెనుక ఎంతటి కష్టం ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా తన తల్లి స్పెషలైజేషన్ అయిన గైనకాలజీలో ఆమె మంచి మార్కులు సాధించడం విశేషం. శ్రీలీల తల్లి స్వర్ణలత వృత్తిరీత్యా గైనకాలజిస్ట్. తల్లిని చూస్తూ పెరగడం వల్లే తనకు కూడా వైద్య వృత్తిపై గౌరవం ఏర్పడిందని శ్రీలీల చెబుతుంది. స్టార్ హీరోయిన్‌గా ఎంత బిజీగా ఉన్నా? తన ప్రాథమిక బాధ్యత చదువేనని ఆమె ఎప్పుడూ నమ్ముతుంది. సినిమా సెట్స్‌లో లైట్ల వెలుతురులో గడుపుతూనే, రాత్రిపూట దీపం వెలుగులో మెడికల్ టెక్స్ట్ బుక్స్‌తో కుస్తీ పట్టడం ఆమె దైనందిన జీవితంలో భాగమైపోయింది. ఒకే సమయంలో రెండు విభిన్నమైన కష్టతరమైన రంగాల్లో రాణించడం అనేది నేటి యువతకు ఒక గొప్ప స్ఫూర్తి. నటనపై ఫ్యాషన్ ఉన్నా? విద్యను నిర్లక్ష్యం చేయకుండా రెండు లక్ష్యాలను చేరుకోవచ్చని శ్రీలీల నిరూపించింది. కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదని ఆమె ప్రస్థానం చూస్తే అర్థమవుతుంది. గ్లామర్ రంగంలో ఉన్నవారికి చదువు అబ్బదు అనే పాతకాలపు ఆలోచనలను శ్రీలీల పటాపంచలు చేసింది. కేవలం అందం మాత్రమే కాదు. మెదడుకు కూడా పదును పెట్టాలని నిరూపించింది. రోగులకు సేవ చేస్తూనే, మరోవైపు ప్రేక్షకులను అలరించనుంది.

# బన్నీ ఫ్యాన్స్‌కు టెస్ట్ టైమ్.. రాకా కోసం ఇంకా ఎంత వెయిట్?








ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ రాకా చుట్టూ తాజా బజ్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. మొదట 2027 ఏప్రిల్‌లో రిలీజ్ కావాల్సిన ఈ సినిమా, ఇప్పుడు ఆ టైమ్‌లైన్‌ను మిస్ అయ్యే అవకాశాలున్నాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమా రిలీజ్ డిసెంబర్ 2027 లేదా సంక్రాంతి 2028కు షిఫ్ట్ అయ్యే ఛాన్స్ ఉందని టాక్ వినిపిస్తోంది. భారీ అంచనాల మధ్య వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై రిలీజ్ వాయిదా వార్తలు ఫ్యాన్స్‌లో ఆసక్తితో పాటు కొంత ఆందోళనను కూడా పెంచుతున్నాయ్

2027 ఏప్రిల్ వరకు రాకా షెడ్యూల్స్ ఈ ఊహాగానాలకు కారణంగా మారింది ముంబై షూటింగ్ నుంచి బయటకు వచ్చిన ఓ చిన్న క్లూ. చిత్ర యూనిట్ ఉపయోగిస్తున్న ఐడెంటిటీ ట్యాగ్‌పై ఉన్న వివరాల ప్రకారం, షూటింగ్ షెడ్యూల్ ఏప్రిల్ 2027 వరకూ కొనసాగవచ్చని సంకేతాలు కనిపించాయి. సాధారణంగా పెద్ద సినిమాలకు లాంగ్ షెడ్యూల్స్ ఉండటం కొత్త విషయం కాదు. కానీ రాకా విషయంలో ఈ స్థాయి లాంగ్ షూటింగ్ ఎందుకు అవసరమైంది అన్న ప్రశ్న ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. డైరెక్టర్ అట్లీ తన స్టైల్‌కు తగ్గట్టుగా ప్రతి సీన్‌ను గ్రాండియర్‌గా ప్లాన్ చేస్తున్నారనే టాక్ ఉంది. రాకా హాలీవుడ్ టెక్నీషియన్స్ కూడా ఇక ఈ ఆలస్యానికి మరో కీలక కారణంగా చెప్పబడుతున్నది భారీ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్. ఈ సినిమా కోసం హాలీవుడ్‌కు చెందిన పలువురు టెక్నీషియన్స్ కూడా వర్క్ చేస్తున్నారు. ముఖ్యంగా విజువల్ ఎఫెక్ట్స్‌పై ఎక్కువ ఫోకస్ పెట్టిన ఈ సినిమా, పోస్ట్ ప్రొడక్షన్‌కే ఎనిమిది నెలల కంటే ఎక్కువ సమయం తీసుకునే అవకాశం ఉందని ట్రేడ్ అంచనాలు చెబుతున్నాయి. ఇదే నిజమైతే, రాకా విజువల్ పరంగా కొత్త బెంచ్‌మార్క్ సెట్ చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఫ్యాన్స్ మిక్స్డ్ రియాక్షన్స్ అయితే ఈ భారీ స్కేల్ ఒకవైపు హైప్‌ను పెంచుతుండగా, మరోవైపు వెయిటింగ్ టైమ్ కూడా పెరుగుతోంది. కాగా ఈ విషయంలో సోషల్ మీడియాలో ఫ్యాన్స్ రియాక్షన్ మిక్స్‌డ్‌గా ఉంది. మంచి క్వాలిటీ కోసం ఎంతైనా వెయిట్ చేస్తామని ఓ వర్గం చెబుతుండగా, ఇంకా ఎంత కాలం వెయిట్ చేయాలంటూ మరొక వర్గం ప్రశ్నిస్తోంది. అల్లు అర్జున్ ఫ్యాన్‌బేస్‌లో మాత్రం ఈ ప్రాజెక్ట్‌పై రోజురోజుకూ ఆసక్తి పెరుగుతూనే ఉంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న రాకా గ్లోబల్ మార్కెట్‌ను టార్గెట్ చేస్తోందని స్పష్టమవుతోంది. అందుకే మేకర్స్ రిలీజ్ టైమింగ్ విషయంలో కూడా జాగ్రత్తగా ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. సంక్రాంతి 2028 సీజన్‌ను టార్గెట్ చేస్తే, భారీ బాక్సాఫీస్ రన్ సాధించే అవకాశం ఉంటుందని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు. అదే సమయంలో, ఇతర స్టార్ సినిమాలతో క్లాష్ ఎలా ఉంటుందన్నది కూడా ఆసక్తికర అంశంగా మారింది. మొత్తానికి, భారీ అంచనాలు, విస్తృతమైన నిర్మాణ ప్రక్రియ, హాలీవుడ్ స్థాయి టెక్నికల్ వర్క్ అన్నీ కలిపి రాకాను ఒక లాంగ్ గెస్టేషన్ ప్రాజెక్ట్‌గా మార్చుతున్నాయి.

# త్రిష కృష్ణన్ 100 కోట్ల సామ్రాజ్యం 25 ఏళ్ల సినీ ప్రస్థానంలో అరుదైన మైలురాయి!





దక్షిణాది సినీ పరిశ్రమలో -ఎవర్ గ్రీన్ క్వీన్-గా వెలుగొందుతున్న త్రిష కృష్ణన్ తన 25 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో కేవలం నటిగానే కాకుండా ఒక బ్రాండ్‌గా ఎదిగారు. ప్రస్తుతం త్రిష నికర ఆస్తి విలువ సుమారు 100 కోట్ల రూపాయలకు చేరుకోవడం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. 1999లో -జోడి- చిత్రంతో సహాయ నటిగా ప్రయాణం మొదలుపెట్టిన త్రిష.. నేటికీ అగ్ర కథానాయికగా కొనసాగుతూ తనకంటూ ఒక ప్రత్యేక సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు. ఒక నటిగా ఇన్ని దశాబ్దాల పాటు తన క్రేజ్‌ను కాపాడుకుంటూ ఆర్థికంగా ఇంతటి ఉన్నత స్థితికి చేరుకోవడం ఆమె పట్టుదలకు నిదర్శనం.

త్రిష ఆదాయ వనరులను పరిశీలిస్తే.. ఒక్కో సినిమాకు సుమారు 3 కోట్ల రూపాయల వరకు పారితోషికం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. -పొన్నియిన్ సెల్వన్- వంటి భారీ విజయాల తర్వాత డిమాండ్ మరింత పెరిగింది. సినిమాలతో పాటు కార్పొరేట్ సంస్థల ప్రకటనల ద్వారా కూడా ఆమె భారీగానే ఆర్జిస్తున్నారు. సుమారు రెండు దశాబ్దాలకు పైగా టాప్ బ్రాండ్లకు అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ.. స్థిరమైన ఆదాయాన్ని గడించారు.

ఈ సంపాదనను తెలివిగా వివిధ రంగాల్లో పెట్టుబడిగా మలిచారు. త్రిష ఆస్తిపాస్తుల్లో ప్రధానమైనవి హైదరాబాద్ - చెన్నైలలోని విలాసవంతమైన నివాసాలు. ముఖ్యంగా చెన్నైలోని ఆమె సొంత ఇల్లు అత్యంత ఖరీదైన ఇంటీరియర్స్‌తో సకల సౌకర్యాలతో కూడి ఉంది. దీని విలువ దాదాపు 10 కోట్ల రూపాయలకు పైగానే ఉంటుందని అంచనా. ఇవే కాకుండా.. రియల్ ఎస్టేట్ రంగంలో కూడా భారీగా పెట్టుబడులు ఉన్నాయి. పలు నగరాల్లో విలువైన భూములు - వాణిజ్య సముదాయాల్లో భాగస్వామ్యం ఉండటం త్రిష ఆర్థిక భవిష్యత్తుకు మరింత భరోసాగా నిలిచాయి. విలాసవంతమైన జీవనశైలికి మారుపేరైన త్రిషకు లగ్జరీ కార్లంటే ఎంతో ఇష్టం. గ్యారేజీలో బిఎండబ్ల్యూ, మెర్సిడెస్ బెంజ్, రేంజ్ రోవర్ వంటి ఖరీదైన కార్లు ఉన్నాయి. కేవలం భౌతిక సంపాదనే కాకుండా..జంతు సంరక్షణ .. పలు సేవా కార్యక్రమాల కోసం తన సంపాదనలో కొంత భాగాన్ని వెచ్చిస్తూ సమాజం విషయంలో తన బాధ్యతను



చాటుకుంటున్నారు. త్రిష లైఫ్ స్టైల్ నేటి తరం యువ నటీమణులకు ఒక రోల్ మోడల్‌గా నిలుస్తోంది. వృత్తిపరమైన ఒడిదుడుకులు ఎదురైనా.. వ్యక్తిగత జీవితంలో ఎన్ని విమర్శలు వచ్చినా కుంగిపోకుండా తన కెరీర్‌ను విజయవంతంగా మలుచుకున్న త్రిష ప్రయాణం స్ఫూర్తిదాయకం. 40 ఏళ్ల వయసులోనూ కుర్ర హీరోయిన్లకు పోటీనిస్తూ..మరోవైపు వంద కోట్ల ఆస్తిని కూడబెట్టడం చూస్తుంటే.. త్రిష వృత్తి గతంగా చూపే అంకితభావానికి ప్రతిఫలం.

# పెయింటింగ్ చీరలో కాయాదు స్టన్నింగ్ లుక్స్







అస్సాం నుంచి వచ్చి సౌత్ ఇండియాను తన నటనతో పలుకరిస్తున్న యంగ్ బ్యూటీ కాయాదు లోహర్, తాజాగా షేర్ చేసిన ఫోటోలతో నెట్టింట మంటలు పుట్టిస్తోంది. షీర్ ఆర్గాంజా చీరలో, చేతితో గీసిన బొటానికల్ ప్రింట్స్ మెరుస్తుంటే, ఒక అందమైన పెయింటింగ్ లా కనిపిస్తున్న కాయాదును చూసి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. ఒకవైపు గ్లామర్ ఒలికిస్తూనే, మరోవైపు నటనకు ఆస్కారం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న కాయదు లేటెస్ట్ లుక్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఆ వివరాలు చూద్దాం..

అస్సాం నుంచి వెండితెరకు.. కాయాదు జర్నీ:
తేజ్‌పూర్ కు చెందిన కాయాదు లోహర్, తన అందం మరియు అభినయంతో చాలా తక్కువ సమయంలోనే మల్టీ లాంగ్వేజ్ యాక్ట్రెస్‌గా పేరు తెచ్చుకుంది. 2021లో 'ముగిల్ పేట' అనే కన్నడ సినిమాతో కెరీర్ ప్రారంభించిన ఈమె, ఆ తర్వాత మలయాళ, మరాఠీ చిత్రాల్లో నటించి మెప్పించింది. ముఖ్యంగా 2025లో విడుదలైన 'డ్రాగన్' అనే తమిళ సినిమా ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. ఈ సినిమా తెచ్చిన గుర్తింపుతో ఇప్పుడు సౌత్ ఇండియన్ సినిమా అంతా కాయదు వైపు చూస్తోంది.
హ్యాండ్ పెయింటెడ్ చీరలో అదిరిపోయే అందం: తాజాగా సోషల్ మీడియాలో కాయాదు పోస్ట్ చేసిన ఫోటోలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.రంగు రంగులతో కూడిన హ్యాండ్ పెయింటెడ్ బొటానికల్ ప్రింట్స్ ఉన్న షీర్ ఆర్గాంజా చీరలో ఆమె ఎంతో హుందాగా కనిపిస్తోంది. దీనికి కాంబినేషన్‌గా సేజ్ గ్రీన్ కలర్ బ్లౌజ్ ధరించి, మోడ్రన్ అండ్ ట్రెడిషనల్ లుక్‌ను పర్ఫెక్ట్‌గా మేనేజ్ చేసింది. మినిమల్ మేకప్ మరియు సింపుల్ హెయిర్ స్టైల్‌తో కాయాదు నిజంగా ఒక అందమైన కావ్యంలా ఉందంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. తెలుగు సినిమాల్లో బిజీ - వరుస ప్రాజెక్టులు: తెలుగు ప్రేక్షకులకు 'అల్లూరి' సినిమాతో పరిచయమైన కాయాదు, ఇప్పుడు టాలీవుడ్‌లో కూడా బిజీ అవుతోంది. ఇటీవల విశ్వక్ సేన్ సరసన 'ఫంకీ' అనే కామెడీ మూవీ తో మన ముందుకు వచ్చింది.ఇక నేచురల్ స్టార్ నాని నటిస్తున్న 'ది పారడైజ్' లో కూడా ఒక కీలక పాత్ర పోషిస్తోంది. అంతేకాకుండా, మలయాళంలో టొవినో థామస్ సరసన 'పల్లిచట్టంబి' వంటి క్రేజీ మూవీ లో నటిస్తుంది. నటనకు ఆస్కారమున్న వైవిధ్యమైన పాత్రలను ఎంచుకోవడమే ఆమె సక్సెస్ సీక్రెట్ అనిపిస్తోంది.ఒకప్పుడు మోడలింగ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకున్న కాయదు, ఇప్పుడు సౌత్ ఇండియాలో బిజీయెస్ట్ నటిగా మారుతోంది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, ప్రతి సినిమాలో తనకంటూ ఒక మార్క్ క్రియేట్ చేసుకుంటోంది. తాజాగా విడుదలైన ఫోటోలు చూస్తుంటే, ఆమె ఫ్యాషన్ సెన్స్ కూడా నెక్స్ట్ లెవల్‌లో ఉందని అర్థమవుతోంది. మరిన్ని వైవిధ్యమైన సినిమాలతో కాయదు బాక్సాఫీస్ వద్ద కూడా తన సత్తా చాటాలని ఆశిద్దాం.



# వృషకర్మ రిలీజ్ డేట్.. నాగచైతన్య అప్డేట్!

అక్కినేని అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మిస్టికల్ థ్రిల్లర్ 'వృషకర్మ' నుంచి అదిరిపోయే అప్డేట్ వచ్చేసింది. 'విరూపాక్ష' డైరెక్టర్ కార్తీక్ దండు దర్శకత్వంలో చైతన్య చేస్తున్న ఈ సినిమా టీజర్‌తోనే అందరినీ ఆశ్చర్యపరిచింది. తాజాగా ఈ సినిమా షూటింగ్ ఎంతవరకు వచ్చింది? ఎప్పుడు విడుదల కాబోతోంది? అనే విషయాలపై చైతన్య స్వయంగా క్లారిటీ ఇచ్చారు. సినిమా బడ్జెట్ నుంచి విలన్ వరకు అన్నీ ఆసక్తికరంగా ఉన్న ఈ ప్రాజెక్ట్ గురించిన మరిన్ని విశేషాలు చూద్దాం..

షూటింగ్ క్లైమాక్స్‌కు - చైతన్య ఖుషి: నాగచైతన్య తన కెరీర్‌లో ముందెన్నడూ చేయని ఒక విభిన్నమైన రోల్‌లో ఈ సినిమాలో కనిపించబోతున్నారు. తాజాగా మీడియా ఇంటరాక్షన్‌లో చైతూ మాట్లాడుతూ, సినిమా షూటింగ్ ప్రస్తుతం చివరి దశకు చేరుకుందని వెల్లడించారు. ఇక ఇప్పటికే 85 శాతం చిత్రీకరణ పూర్తయిందని, కేవలం 15 శాతం పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు. మిగిలిన ఆ కొద్ది భాగాన్ని కూడా చకచకా పూర్తి చేసి, ఈ ఏడాది ద్వితీయార్థంలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. అవుట్‌పుట్ చూశాక చైతన్య ఎంతో కాన్ఫిడెంట్‌గా ఉండటం విశేషం.

చైతూ కెరీర్‌లోనే భారీ బడ్జెట్: ఈ సినిమాను నిర్మాత బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ ఏకంగా 120 కోట్ల రూపాయల భారీ వ్యయంతో నిర్మిస్తున్నారు. నాగచైతన్య మార్కెట్ దృష్ట్యా ఇది చాలా పెద్ద రిస్క్ అయినప్పటికీ, కథ మీద ఉన్న నమ్మకంతో మేకర్స్ ఎక్కడా వెనకడుగు వేయడం లేదు. ఇక ఈ ప్యాన్-ఇండియా చిత్రానికి సుకుమార్ రైటింగ్స్ కూడా సహకారం అందిస్తుండటం సినిమాపై క్రేజ్‌ను డబుల్ చేసింది. 'వృషకర్మ'లో విజువల్స్ మరియు మిస్టరీ ఎలిమెంట్స్ హాలీవుడ్ స్థాయిలో ఉంటాయని ఇండస్ట్రీ వర్గాలు గుసగుసలాడుతున్నాయి.

క్రేజీ కాస్టింగ్ - మీనాక్షి చౌదరి, స్పర్ష్ శ్రీవాస్తవ: సినిమాలో నాగచైతన్యకు జోడీగా టాలెంటెడ్ బ్యూటీ మీనాక్షి చౌదరి నటిస్తోంది. అయితే ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవబోతున్నది ఎవరంటే లాపతా లేడీస్ చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన స్పర్ష్ శ్రీవాస్తవ. ఈ సినిమాలో ఆయన విలన్ ఒక పవర్‌ఫుల్ రోల్‌లో మెరవబోతున్నారు. హీరో, విలన్ మధ్య జరిగే మైండ్ గేమ్స్ మరియు యాక్షన్ సీక్వెన్స్‌లు ఆడియన్స్‌ను థ్రిల్ చేస్తాయని తెలుస్తోంది. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం ఈ మిస్టికల్ అడ్వెంచర్‌కు ప్రాణం పోయనుంది.

అక్కినేని ఫ్యాన్స్‌కు పండగే.. చివరగా, 'వృషకర్మ' సినిమాతో నాగచైతన్య తన బాక్సాఫీస్ సత్తా చాటుతారని ఫ్యాన్స్ గట్టిగా నమ్ముతున్నారు. కార్తీక్ దండు 'విరూపాక్ష'తో ఎలాగైతే థ్రిల్ చేశారో, అంతకు మించి ఈ సినిమాలో మ్యాజిక్ ఉండబోతోందని సమాచారం. ఇక షూటింగ్ పూర్తయిన వెంటనే గ్రాండ్ లెవల్‌లో ప్రమోషన్స్ ప్రారంభించి, విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనున్నారు. 120 కోట్ల భారీ బడ్జెట్, మిస్టికల్ కథాంశం వెరసి ఈ ఏడాది బాక్సాఫీస్ వద్ద చైతన్యకు ఒక సాలిడ్ హిట్ దక్కుతుందని ఆశిద్దాం.